31 YEARS ANNIVERSARY

www.prajadarbar.net

# ప్రజాదర్బార్

తెలుగు దినపత్రిక

PRAJADARBAR TELUGU DAILY

Editor : G. VENU GOPAL SHARMA

ప్రకటనకర్తలకు విజ్ఞప్తి !

ప్రజాదర్బార్ దినపత్రికలో ప్రచురణకు ప్రభుత్వ ప్రకటనలు, కోర్టు నోటీసులు, ఇతరత్రా సమాచారాన్ని ఈ క్రింది చిరునామాకు తెలుపగలరు.

ప్రజాదర్బార్ దినపత్రిక కార్యాలయం
శర్మా కాంప్లెక్స్, మెయిన్ రోడ్డు, ఉప్పల్, హైదరాబాద్
Phone & Fax : 040-27201814, 9440391525
Email : prajadarbar94@gmail.com

సంపుటి : 32 సంచిక : 100 | హైదరాబాద్, కర్నూలు, తిరుపతి, కడప, అనంతపురం | Thursday, July,30, 2026 | పేజీలు : 12+8 వెల : రూ. 4.00

## బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు ఎప్పటికీ క్షమాపణ చెప్పను: రాహుల్



### అమిత్ షాపై రాహుల్ గాంధీ మరోసారి ఆరోపణలు

**న్యూఢిల్లీ,జూలై,29:** లోక్‌సభలో చేసిన వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పేందుకు కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నిరాకరించారు. జంతర్‌మంతర్‌లో నిరసన తెలిపిన విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేయడంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాత్ర ఉందన్న ఆరోపణలను మరోసారి పునరుద్ఘాటించారు. "అమిత్ షానే ఆదేశాలు ఇచ్చి ఉండాలి.. లేకపోతే ఏం జరుగుతోందో ఆయనకు తెలియకపోయి ఉండాలి" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పార్లమెంట్ సమావేశం వాయిదా పడిన తర్వాత కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రాహుల్ మాట్లాడారు. క్షమాపణ చెబితే ప్రసంగం కొనసాగించేందుకు అవకాశం ఇస్తామని తనకు చెప్పారని, కానీ బీజేపీకి, ఆర్ఎస్ఎస్‌కు తాను ఎప్పటికీ క్షమాపణ చెప్పబోనని స్పష్టం చేశారు. ప్రతిపక్ష నాయకుడిగా దేశానికి సంబంధించిన కీలక అంశాలను లేవనెత్తే హక్కు తనకు ఉందని అన్నారు.

## 'డెలులు', 'క్లాక్ ఇట్'.. పార్లమెంటుకు పాకిన జెన్ జీ స్లాంగ్ పదాలు

### 'బొద్దింక జనతా పార్టీ' పేరుతో యువత సరికొత్త నిరసన - పార్లమెంటు చర్చల్లోకి జెన్ జీ స్లాంగ్ పదాలు

### జెన్ జీ పదాల ఉపయోగాన్ని ప్రశ్నించిన సుప్రియా సూలే



దేశంలో యువత చేపట్టిన సరికొత్త నిరసన ఉద్యమం ఇప్పుడు వీధుల నుంచి పార్లమెంటు చర్చల వరకు చేరింది. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) పేరుతో ప్రారంభమైన ఈ ఉద్యమంలో యువత ఉపయోగిస్తున్న 'డెలులు', 'క్లాక్ ఇట్' వంటి ఆధునిక జెన్ జీ పదజాలం ఇప్పుడు చట్టసభల్లోనూ వినిపిస్తూ జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇటీవలి వరకు ఇన్‌స్టాగ్రామ్ కామెంట్ సెక్షన్‌లు, గ్రూప్ చాట్‌లు, మీమ్ పేజీలకే పరిమితమైన ఈ పదాలు, తాజాగా లోక్‌సభలో ప్రతిధ్వనించాయి. శివసేన ఎంపీ శ్రీకాంత్ షిండే మాట్లాడుతూ, ప్రతిపక్షం "ఎంఐఏ" (మిస్సింగ్ ఇన్ యాక్షన్)గా ఉందని, "ఎఫ్ఓఎంఓ" (ఏదైనా కోల్పోతామనే భయం)తో వణికిపోతోందని విమర్శించారు. చివరకు వాస్తవికతకు దూరంగా భ్రమలో బతుకుతున్నారనే అర్థం వచ్చేలా 'డెలులు' అనే పదాన్ని ప్రయోగిస్తూ ప్రతిపక్షంపై ఎద్దేవా చేశారు. మరోవైపు కాంగ్రెస్ నాయకుడు దీపేందర్ సింగ్ హుడా సైతం ప్రభుత్వాన్ని విమర్శించడానికి నిరసనల సమయంలో ప్రాచుర్యం పొందిన ఒక అర్థరహిత జెన్ జీ నినాదాన్ని ఉద్దేశపూర్వకంగా ఉపయోగించి సభలో నవ్వులు పూయించారు. బీజేపీ ఎంపీ బాన్సురీ స్వరాజ్ ప్రసంగిస్తూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం యాంటీ పేపర్ లీక్ బిల్లును తీసుకురావడాన్ని ప్రశంసిస్తూ 'క్లాక్ ఇట్' అనే పదాన్ని వాడారు. ఎంపీ తేజస్వీ సూర్య సైతం ఇదే బాటలో పయనిస్తూ, కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఇలాంటి సమర్థవంతమైన బిల్లులు తీసుకురాలేకపోయిందని, కనీసం ప్రతిపక్షంలో ఉన్నప్పుడైనా మద్దతు ఇవ్వకుండా విమర్శలు చేస్తోందని మండిపడ్డారు.



## ఎమర్జెన్సీలో తాను కూడా అరెస్టయ్యా: నడ్డా

### రాజ్యసభలో ఢిల్లీ పోలీసుల చర్యలపై దుమారం..

**న్యూఢిల్లీ,జూలై,29:** రాజ్యసభలో బుధవారం ఢిల్లీ పోలీసుల చర్యలపై అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఢిల్లీలోని సీపీఎం కేంద్ర కార్యాలయంలోకి పోలీసులు వెళ్లి మాజీ జేఎన్‌యూ విద్యార్థి సంఘం అధ్యక్షురాలు ఐషే ఘోష్‌ను అరెస్టు చేసేందుకు ప్రయత్నించిన ఘటనను ప్రతిపక్ష సభ్యులు ప్రస్తావించారు. ఈ సందర్భంగా సభలో ఆందోళన, నినాదాలు కొనసాగాయి. దీనిపై స్పందించిన రాజ్యసభ సభానేత, కేంద్ర మంత్రి జేపీ నడ్డా చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. "ఉద్యమాలు చేయాలనుకునే ఏవిద్యార్థైనా పోలీసులను ఎదుర్కోవాల్సిందే" అని అన్నారు. సీపీఎం సభ్యుడు జాన్ బ్రిట్టాస్ ఈ అంశాన్ని సభ దృష్టికి తీసుకొచ్చారు. జంతర్ మంతర్‌లో జరిగిన విద్యార్థుల నిరసనలో పాల్గొనడమే ఐషే ఘోష్ చేసిన తప్పని పేర్కొన్నారు.

## రాహుల్ గాంధీ కుటుంబానికి బాబ్రీ మసీదుకు పట్టిన గతే..

# బీజేపీ ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు

- కర్ణాటక ఎమ్మెల్యే యశ్‌పాల్ సువర్ణపై ఎఫ్ఐఆర్ నమోదు
- బాబ్రీ మసీదు ఘటనను ప్రస్తావిస్తూ విమర్శలు
- కాంగ్రెస్ ఫిర్యాదుతో కేసు నమోదు
- వ్యాఖ్యలపై రాజకీయ దుమారం..



**న్యూఢిల్లీ,జూలై,29:** లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కుటుంబంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే యశ్‌పాల్ సువర్ణపై పోలీసులు కేసు నమోదు చేశారు. 1992లో బాబ్రీ మసీదు కూల్చివేసిన ఘటనను ప్రస్తావిస్తూ, కాంగ్రెస్ ఇదే తరహా రాజకీయాలు కొనసాగిస్తే రాహుల్ గాంధీ కుటుంబానికీ అదే పరిస్థితి వస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపాయి. సామాజిక మాధ్యమాల్లో ప్రసం గం వీడియో వైరల్ కావడంతో కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. ఉడుపిలో నిర్వహించిన బీజేపీ కార్య క్రమంలో యశ్‌పాల్ సువర్ణ ఈ వ్యాఖ్యలు చేశారు. దీనిపై ఉడుపి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అశోక్ కుమార్ కొడవూర్ ఫిర్యా దు చేయడంతో ఎఫ్ఐఆర్ నమోదై ంది. భారతీయ న్యాయ .సంహిత లోనిపలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రార ంభించారు.

## ఒక అధికారికి ఒకే ప్రభుత్వ వాహనం.. కేంద్రం కొత్త ఆదేశాలు..!



**హైదరాబాద్,జూలై,29:** ప్రభుత్వ వనరుల దుర్వినియోగం, వృథా ఖర్చులకు కళ్లెం వేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై అర్హులైన ఒక అధికారికి ఒకే ప్రభుత్వ వాహనాన్ని కేటాయించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని వ్యయ విభాగం 'ఒక అధికారికి–ఒకే కారు' విధానాన్ని అమల్లోకి తెస్తూ అధికారిక మెమొరాండం జారీ చేసింది. ప్రభుత్వ వాహనాలను కేవలం అధికారిక ప్రయోజనాల కోసమే వినియోగించేలా చూడటమే ఈ చర్య ముఖ్య ఉద్దేశం. కొత్త నిబంధనల ప్రకారం, ఇప్పటికే ప్రభుత్వ వాహన సదుపాయం పొందుతున్న అధికారికి.. వేరే మంత్రిత్వ శాఖ, ప్రభుత్వ రంగ సంస్థ లేదా ఇతర స్వయంప్రతిపత్తి సంస్థల్లో అదనపు బాధ్యతలు అప్పగించినప్పటికీ, రెండో వాహనాన్ని కేటాయించకూడదని స్పష్టం చేసింది. సదరు అధికారి తన వద్ద ఉన్న వాహనాన్నే ఆ అదనపు బాధ్యతల నిర్వర్తణకు కూడా ఉపయోగించుకోవాలని ఆదేశాల్లో పేర్కొంది. ఈవిషయంలో ఎలాంటి మినహాయింపులు ఇవ్వొద్దనిఅన్ని మంత్రిత్వ శాఖలు,విభాగాలను ఆదేశించింది. కేవలం వాహనాల సంఖ్యకే ఈ నిబంధ నలుపరిమితం కాలేదు. ప్రభుత్వ రంగ సంస్థలు, స్వయం ప్రతిపత్తి లేదా పాక్షిక–ప్రభుత్వ సంస్థలకు చెందిన వాహనాలను కేంద్ర ప్రభుత్వ అధికారులు వినియో గించడాన్ని కూడా నిషేధించింది.

## బొగత జలపాతం ఉగ్రరూపం.. సందర్శన నిలిపివేత

### వాయుగుండం ప్రభావంతో ఉత్తర తెలంగాణలో భారీ వర్షాలు

### ఉధృతంగా ప్రవహిస్తున్న బొగత జలపాతం - పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని చర్యలు చేపట్టిన అధికారులు...



**ములుగు,జూలై,29:** వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో తెలంగాణలోని ఉత్తరజిల్లాల్లో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో ములుగు జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న కుండపోత వర్షాలకు ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన బొగత జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. గత 10 గంటలుగా అటవీ ప్రాంతంలో వర్షం నిరంతరాయంగా కురుస్తుండటంతో ఎగువ ప్రాంతాలనుంచి భారీగా వరద నీరు వచ్చి చేరి జలపాతం ఉగ్రరూపం దాల్చింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో, పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అటవీ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు.

## తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ..

### టోకెన్లు లేకుండా వచ్చిన వారికి సర్వదర్శనానికి 18 గంటల సమయం

### నిండిపోయిన 31 కంపార్ట్‌మెంట్లు - ఒక్కరోజే శ్రీవారిని దర్శించుకున్న 78 వేల మంది భక్తులు



**తిరుమల,జూలై,29:** తిరుమల గిరులు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. శ్రీవారి దర్శనానికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. టోకెన్లు లేని భక్తులకు సర్వదర్శనానికి సుమారు 18 గంటల సమయం పడుతోందని అధికారులు తెలిపారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌ల్లోని 31 కంపార్ట్‌మెంట్లు భక్తులతో పూర్తిగా నిండిపోయాయి.
ఇక మంగళవారం ఒక్కరోజే 78,709 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 31,312 మంది తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.
భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 4.76 కోట్లుగా నమోదైంది.

# పీఓకేలో రక్తపాతం...

### పాక్ బలగాల దాడిలో 40 మంది మృతి – పీఓకేలో పాక్ సైన్యం దమనకాండ

### గత రెండు రోజుల్లో 40 మంది పౌరులు మృతి – ఇది మారణకాండ అంటున్న స్థానిక నేతలు



**మీర్పూర్,జూలై,29:** పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో పరిస్థితి తీవ్ర ఉద్రిక్తంగా మారింది. అక్కడ నిరసనలు తెలుపుతున్న పౌరులపై పాకిస్థాన్ బలగాలు జరిపిన దమనకాండలో గత రెండు రోజుల్లో కనీసం 40మంది ప్రాణాలు కోల్పోయారు. డజన్ల కొద్దీ ప్రజలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రాంతంలో తీవ్ర అశాంతి నెలకొన్న నేపథ్యంలో పాక్ సైన్యం విచక్షణారహితంగా వ్యవహరిస్తోందని స్థానిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. 'యునైటెడ్ కశ్మీర్ పీపుల్స్ నేషనల్ పార్టీ' (యూకేపీఎన్‌పీ) ఈ ఘటనలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నెల 27,28 తేదీల్లో రావల్‌కోట్, మీర్పూర్ సహా పలు ప్రాంతాల్లో పాక్ బలగాలు జరిపిన దాడుల్లో 40 మంది పౌరులు మరణించారని, వందలాది మందిని అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించింది. అంతేకాకుండా జూన్ 5 నుంచి ఇప్పటివరకు 100 మందికి పైగా పౌరులను పాక్ సైన్యం చంపేసిందని, వందల మందిని బలవంతంగా అదృశ్యం చేసిందని పేర్కొంది. ఇదిలా ఉండగా, జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) నేత సర్దార్ అమ్మాన్ ఖాన్ కూడా పాక్ సైన్యంపై విరుచుకుపడ్డారు.

## చంచల్‌గూడ జైలుకు ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి

# 14 రోజుల రిమాండ్..



- ట్రైనీ ఐపీఎస్ అధికారిణిపై లైంగిక వేధింపుల కేసు
- ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణ రెడ్డికి ఆగస్టు 11 వరకు రిమాండ్
- చంచల్‌గూడ జైలుకు తరలించిన పోలీసులు
- తమది ఇద్దరి అంగీకారంతో కూడిన సంబంధమని నిందితుడి వాదన
- ఎఫ్ఐఆర్ కొట్టివేయాలని హైకోర్టును ఆశ్రయించిన ఉదయ్...

**హైదరాబాద్,జూలై,29:** ట్రైనీ ఐపీఎస్ అధికారిణిపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో అరెస్టయిన ట్రైనీ ఐపీఎస్ ఎం. ఉదయ్ కృష్ణారెడ్డికి న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. మంగళవారం అరెస్టయిన ఆయన్ను పోలీసులు బుధవారం ఉప్పర్‌పల్లి కోర్టులో హాజరుపరిచారు. విచారణ జరిపిన న్యాయమూర్తి, ఆగస్టు 11 వరకు రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు.
అనంతరం ఉదయ్‌ను చంచల్‌గూడ సెంట్రల్ జైలుకుతరలించారు.సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో తనతో పాటు శిక్షణ పొందుతున్న 30ఏళ్ల మహిళా అధికారిణిని లైంగికంగా వేధిం చాడని ఉదయ్‌పై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. పదే పదే లైంగిక వేధింపులకు గురిచేయడం, వాట్సాప్‌లో అసభ్యకర సందేశాలు పంపడం,వెంటపడడడం (స్టాకింగ్), అక్రమంగా నిర్బం ధించడం, శారీరకంగా దాడిచేసి బెదిరింపుల కు పాల్పడటం వంటివి ఫిర్యాదులో ఉన్నాయి. భారతీయన్యాయ సంహిత(బీఎన్ఎస్), ఐటీచట్టంలోని వివిధ సెక్షన్ల కింద లైంగిక వేధింపులు, మహిళ పట్ల నేరపూరితబలప్ర యోగం,గోప్యతకు భంగంకలిగించడం,అశ్లీల సమాచారాన్ని ప్రసారం చేయడంవంటి అభియోగాలతో కేసునమోదు చేశారు. మరో వైపు,తనపై వచ్చినఆరోపణల న్నీఅవాస్తవమని, న్యాయవ్యవస్థపై తనకు నమ్మకం ఉందని ఉదయ్ కృష్ణారెడ్డి ఇటీవల సోషల్ మీడియా ద్వారా తెలిపారు.

## కాటేపల్లి పాఠశాలలో ప్రీ ప్రైమరీ విభాగం ప్రారంభం



మోటకొండూరు,ప్రజాదర్బార్ జూలై 29: మోటకొండూరు మండలంలోని కాటేపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ విభాగాన్ని జిల్లా విద్యాశాఖాధికారి బొల్లారం బిక్షపతి బుధవారం ప్రారంభించారు. గురుపౌర్ణమి సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించి ఆశీర్వదించారు. ఆయన మాట్లాడుతూ,ప్రీ ప్రైమరీ విద్య చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది అని,ఆటలు, పాటలు, కథల ద్వారా పిల్లల్లో నేర్చుకునే ఆసక్తి,ఆత్మవిశ్వాసం,సామాజిక నైపుణ్యాలు పెంపొందుతాయని అన్నారు.తల్లిదండ్రులు పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపాలని,ఉపాధ్యాయులు ప్రేమతో,ఓర్పుతో తీర్చిదిద్దాలని సూచించారు.మండల విద్యాధికారి కేతిరెడ్డి రఘురామ్ రెడ్డి,సర్పంచ్ పచ్చిమట్ల జయమ్మ మదార్ గౌడ్,కాంప్లెక్స్ హెచ్ఎం బాలగంగాధర్ రెడ్డి,హెచ్ఎం పి.మంజుల,ఉపాధ్యాయులు శంకర్, సీఆర్పీలు నరేందర్,సతీష్ రెడ్డి,గ్రామస్తులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## గురు పౌర్ణమి వేళ దత్తాత్రేయ స్వామికి ప్రత్యేక పూజలు



యాదగిరిగుట్ట,ప్రజాదర్బార్ జూలై 29:గురు పౌర్ణమి సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామంలోని తెలంగాణ గానుగపూర్‌గా ప్రసిద్ధి చెందిన శ్రీ దత్తాత్రేయ స్వామి దేవస్థానంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు,ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా దత్త ఉపాసకులు శ్రీ శివశంకర శాస్త్రి ఆయనకు ఆశీర్వచనం అందజేశారు.అనంతరం డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ మాట్లాడుతూ,శ్రీ శివశంకర శాస్త్రి ఆధ్వర్యంలో దేవస్థానంలో నిత్య కైంకర్యాలు కొనసాగుతున్నాయని తెలిపారు.గురు పౌర్ణమి రోజున దత్తాత్రేయ స్వామిని దర్శించుకోవడం విశేష ఫలితాలను ఇస్తుందని పేర్కొంటూ,భక్తులు తెలంగాణ గానుగపూర్‌ను సందర్శించాలని కోరారు.దేవస్థాన అభివృద్ధికి కృషి చేస్తున్న శ్రీ దత్తపీఠం ట్రస్ట్ సభ్యులను అభినందించారు.

## తండ్రి లేని బాలికల చదువుకు అండగా శివరాజ్ గౌడ్



భువనగిరి,ప్రజాదర్బార్ జూలై 29: తండ్రి లేని ఇద్దరు బాలికల విద్యా భ్యాసానికి కాంగ్రెస్ నాయకుడు పచ్చిమట్ల శివరాజ్ గౌడ్ ఆర్థిక సహాయం అందించారు.చందుపట్ల గ్రామానికి చెందిన స్వర్గీయ గుర్రం బిక్షపతి కుమార్తెలు కీర్తన,లహరి చదువులకు ఇచ్చిన హామీ మేరకు ఇండియా మిషన్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న లహరి ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫీజును చెల్లించారు. అలాగే ఇంటర్ చదువుతున్న కీర్తన రెండు సంవత్సరాల కళాశాల ఫీజులను కూడా తానే భరిస్తానని ప్రకటించారు.నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన శివరాజ్ గౌడ్ సేవాభావాన్ని కుటుంబ సభ్యులు,గ్రామస్థులు అభినం దించారు.బాలికల తల్లి గుర్రం విజయ,బాబాయ్ గుర్రం ఉపేందర్,పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బింగి వైకుంఠం పాల్గొన్నారు.

## కారు అదుపుతప్పి బోల్తా.... ముగ్గురికి స్వల్ప గాయాలు.

కొండపాక, (ప్రజాదర్బార్) జులై 29::సిద్దిపేట జిల్లా కొండపాక మండల కేంద్రంలోని రవీంద్రనగర్ వద్ద కారు అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ముగ్గురికి స్వల్ప గాయాలు అయిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. సిద్దిపేట చెందిన అశోక్ (50), లహరి (32), ప్రసాద్ (38)....ఒకే కుటుంబానికి చెందిన వీరు హైదరాబాద్ లో వారి బంధువులు చనిపోతే వెళ్లి తిరిగి సిద్దిపేట వస్తుండగా రవీంద్ర నగర్ వద్ద వీరి కారు అదుపుతప్పి బోల్తా పడటం తో ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు 108 కు సమాచారం ఇవ్వగ ఘటన స్థలానికి చేరిన 108 సిబ్బంది గాయపడిన వ్యక్తులను సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# రోడ్డు భద్రతే ప్రాణ రక్షణ

### - జిల్లా వ్యాప్తంగా పోలీసుల అవగాహన కార్యక్రమాలు- ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వాహనదారులకు సూచన





యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి ప్రజాదర్బార్,జూలై 29: యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ ల పరిధిలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.పోలీసులు వాహనదారులు, విద్యా ర్థులు,ప్రజలకు హెల్మెట్,సీటుబెల్ట్ తప్పనిసరిగా వినియోగిం చాలని, అతివేగం,మద్యం సేవించి వాహనాలు నడపడం,డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగాన్ని నివారించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించి విలువైన ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు.కార్యక్రమంలో కరపత్రాలు పంపిణీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు.సీఐ లు,ఎస్సై లు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## - తెలంగాణలో తొలి ఏబీడీఎం మోడల్ జిల్లాగా ఎంపిక- మూడు నెలల్లో ప్రతి అర్హుడికి ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య గుర్తింపు సంఖ్య లక్ష్యం




యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి ప్రజాదర్బార్,జూలై 29: కేంద్ర ప్రభుత్వ ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కింద తెలంగాణలో తొలి మోడల్ జిల్లాగా ఎంపికైన యాదాద్రి భువనగిరి జిల్లాలో బుధవారం సమీకృత కలెక్టరేట్‌లో ప్రారంభోత్సవ వర్క్‌షాప్ నిర్వహించారు.రాష్ట్ర ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డా.సంగీత సత్యనారాయణ,జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి,అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డా.సంగీత సత్యనారాయణ మాట్లాడుతూ,జిల్లాలో ప్రభుత్వ,ప్రైవేటు ఆరోగ్య సంస్థలు 100 శాతం ఏబీడీఎం అమలుకు కృషి చేయాలని సూచించారు.అనంతరం కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ,రాబోయే మూడు నెలల్లో ప్రతి అర్హుడికి ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య గుర్తింపు సంఖ్య సృష్టించి,అన్ని ఆరోగ్య సంస్థల్లో డిజిటల్ ఆరోగ్య సేవలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.తదుపరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ఎం.మనోహర్ మాట్లాడుతూ,జిల్లాలో ఇప్పటికే 4.02 లక్షలకుపైగా ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య గుర్తింపు సంఖ్యలు,570 ఆరోగ్య సంస్థల నమోదులు,815 మంది ఆరోగ్య నిపుణుల నమోదులు పూర్తయ్యాయని తెలిపారు.వర్క్‌షాప్‌లో డిజిటల్ ఆరోగ్య సేవలు,ఆరోగ్య రికార్డుల నిర్వహణ,ఏబీడీఎం సాఫ్ట్‌వేర్‌లపై అవగాహన కల్పించగా,15 సాంకేతిక ప్రదర్శన స్టాళ్లను ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో నేషనల్ హెల్త్ అథారిటీ ప్రతినిధులు,రాష్ట్ర ఏబీడీఎం బృంద సభ్యులు,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారులు డా.రామకృష్ణ,డా.వీణ,డా.సుమన్ కళ్యాణ్,డా.వంశీకృష్ణ,నోడల్ ఆఫీసర్ డా.అశ్విన్ కుమార్,యాదాద్రి భువనగిరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేజ్ చిస్తీ,భువనగిరి పట్టణ మున్సిపల్ చైర్మన్ తంగెళ్లపల్లి శ్రీవాణి రవికుమార్,మున్సిపల్ వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు,ప్రభుత్వ ఆసుపత్రుల మెడికల్ అధికారులు,ప్రభుత్వ మరియు ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు,మేనేజింగ్ డైరెక్టర్ లు,మెడికల్ సూపరింటెండెంట్ లు,క్లినిక్‌లు,డయాగ్నస్టిక్ సెంటర్ల ప్రతినిధులు,ఫార్మసీ ప్రతినిధులు,ఆరోగ్య సేవల నిపుణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆగస్టు 9న అమరుల యాది బస్సు యాత్రను జయప్రదం చేయాలి:బొలగాని జయరాములు గౌడ్



మోటకొండూరు,ప్రజాదర్బార్ జూలై 29: కల్లుగీత కార్మికుల హక్కుల సాధన, వృత్తి రక్షణ కోసం నిర్వహిస్తున్న అమరుల యాది బస్సు యాత్రను ఆగస్టు 9న భువనగిరిలో విజయవంతం చేయాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొలగాని జయరాములు గౌడ్ పిలుపునిచ్చారు.మోటకొండూరులో స్థానిక సొసైటీ అధ్యక్షుడు గాజుల బాలరాజు గౌడ్ అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో బస్సు యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జయరాములు గౌడ్ మాట్లాడుతూ,రాష్ట్రంలో మూడు లక్షల మంది గీత కార్మికులు వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నప్పటికీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు.వృత్తి ప్రమాదాలకు సంబంధించిన ఎక్స్‌గ్రేషియా బకాయిలను వెంటనే విడుదల చేసి,గీత కార్మికుల సంక్షేమానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.ఆగస్టు 2న మానుకోటలో ప్రారంభమై ఆగస్టు 18న హైదరాబాద్‌లో ముగియనున్న బస్సు యాత్ర ఆగస్టు 9న భువనగిరికి చేరుకుంటుందని,వినాయక చౌరస్తాలో జరిగే ప్రదర్శన,సభకు గీత కార్మికులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.సమావేశంలో జిల్లా కమిటీ సభ్యుడు,ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తండా పాండురంగం గౌడ్,మండల నాయకులు లోడే ఉప్పలయ్య,వంగాల స్వామి,గాజుల వెంకటేష్,దూడల కొమరయ్య,వంగాల మల్లేశం,తాళ్లపల్లి వెంకటయ్య, బోల్లపల్లి సత్తయ్య,వంగాల చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై కక్షసాధింపు చర్యలు మానుకోవాలి

### -సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి ప్రజాదర్బార్,జూలై 29: విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు మానుకోవాలని, నిరంకుశ వైఖరితో పాలన సాగించలేరని సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు.బుధవారం భువనగిరిలో జరిగిన సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ,నీట్ పరీక్షల నిర్వహణలో పారదర్శకత లోపించిందని,పరీక్షల నిర్వహణను జవాబుదారీతనంతో చేపట్టాలని డిమాండ్ చేశారు.ఢిల్లీలో ఆందోళన చేసిన విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడాన్ని ఖండించిన ఆయన,ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును అణచివేయడం సరికాదన్నారు.అయోధ్య రామమందిర విరాళాల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.నిరుద్యోగం,ధరల పెరుగుదల,ప్రైవేటీకరణ వంటి ప్రజా సమస్యలపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు.సెప్టెంబర్ 8 నుంచి 10 వరకు యాదగిరిగుట్టలో జరిగే ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర మూడో మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండీ ఇమ్రాన్,సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి,జిల్లా సహాయ కార్యదర్శులు బోలగాని సత్యనారాయణ,చేడె చంద్రయ్య,రాష్ట్ర సమితి సభ్యులు గోద శ్రీరాములు,కురిమిద్ద శ్రీనివాస్,కళ్లెం కృష్ణ,బండి జంగమ్మ,బచ్చనగోని గాలయ్య, చెక్క వెంకటేష్,ఏశాల అశోక్,అన్నేమైన వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.




## పట్టాలిచ్చి.. ప్లాట్లు మరిచారా?




యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి ప్రజాదర్బార్,జూలై 29: 700 సర్వే నంబర్‌లో పట్టాలు పొందిన లబ్ధిదారులకు వెంటనే భూమిని చదును చేసి ప్లాట్లు చూపించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ డిమాండ్ చేశారు.బుధవారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య భవన్‌లో గంధమల్ల మాతయ్య అధ్యక్షతన నిర్వహించిన భూ పోరాట కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, పట్టాలు ఇచ్చి ఏడాది గడిచినా అధికారులు ఇచ్చిన హామీని అమలు చేయలేదని విమర్శించారు.వారం రోజుల్లో భూమిని చదును చేసి ప్లాట్లు చూపించకపోతే లబ్ధిదారులతో కలిసి మళ్లీ గుడిసెలు వేసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.సీపీఎం పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ,కార్యవర్గ సభ్యులు బందెల ఎల్లయ్య,వనం రాజు,భూ పోరాట కమిటీ కన్వీనర్ దొడ్డి శంకర్,కో-కన్వీనర్ నార కళమ్మ,పిట్టల చంద్రశేఖర్,అరుణ,స్రవంతి,నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## వాతావరణానికి అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి:మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి




రామన్నపేట,ప్రజాదర్బార్ జూలై 29:ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గిన నేపథ్యంలో రైతులు ముందస్తు ప్రణాళికతో ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని వలిగొండ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి సూచించారు.బుధవారం రామన్నపేట రైతు వేదికలో నిర్వహించిన ప్రత్యామ్నాయ పంటల అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ,అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగిస్తూ నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని చెప్పారు.సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా తక్కువ నీటితో సాగయ్యే లాభదాయక పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు.కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ శ్రీలత,పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల భిక్షం రెడ్డి,ఏవో ఖాన్,మార్కెట్ డైరెక్టర్ సత్తయ్య,నాగు అంజయ్యతో పాటు రైతులు పాల్గొన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతో జలసిరి విజయవంతం చేయాలిఅదనపు కలెక్టర్ భాస్కర్ రావు



గుండాల,ప్రజాదర్బార్ జూలై 29: జలసిరి కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అన్నారు.బుధవారం గుండాల మండల ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ,ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా నీటి సంరక్షణ,భూగర్భ జలాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు,ప్రతి రైతుకు పంట కుంటలు,బోర్‌వెల్ రీచార్జ్ పిట్స్,గ్రామాల్లో సోక్‌పిట్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.మహిళా స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యంతో నీటి సంరక్షణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని,ఘన వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణతో పాటు సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు.సమావేశంలో మండల అధికారులు,ప్రజాప్రతినిధులు,సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## బెజ్జంకిలో అఖిలపక్షాల బంద్ విజయవంతం

బెజ్జంకి,జులై 29(ప్రజాదర్బార్): బెజ్జంకిలో అఖిలపక్షాల బంద్ విజయవంతం అయింది.మండలంలోని గుగ్గిళ్ల,నర్సింహులపల్లి గ్రామాల పరిధిలోని ఇథనాల్ పరిశ్రమలను రద్దు చేయాలని కోరుతూ అఖిల పక్షం ఆధ్వర్యంలో రూపొందించిన కార్యచరణలో భాగంగా బుధవారం బెజ్జంకి బంద్ విజయవంతం అయింది.బంద్ లో భాగంగా మండల కేంద్రంలో,పరిసర గ్రామాల్లో దుకాణాలు,ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలలు,వాణిజ్య వ్యాపార కేంద్రాలు మూసివేశారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా స్థానిక ఎస్సై తోట తిరుపతి ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈ బంద్ లో అఖిల పక్ష నాయకులు,యువకులు,తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల ప్రతినిధి జూలై 29 (ప్రజా దర్బార్): జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్, ఐపీఎస్ సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం మరో నాలుగు రోజుల పాటు జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, అత్యవసరం లేకపోతే బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా వాగులు, వంకలు, కల్వర్టులు, చెరువులు, నదుల వద్దకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్--100కు సమాచారం అందించి పోలీసు సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. పోలీసుల సూచనలు:

ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ దిగవద్దు. చేపల వేట కోసం చెరువులు, వాగులు, నదుల వద్దకు వెళ్లవద్దు. నీటితో మునిగిన కల్వర్టులు, వంతెనలు, వాగులను దాటే ప్రయత్నం చేయవద్దు. పశువులను మేతకు తీసుకెళ్లే వారు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలి. విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ తీగలను ముట్టుకోవద్దు. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు విద్యుత్ తీగలు, నీటి ప్రవాహాల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

శిథిలావస్థలో ఉన్న లేదా కూలిపోయే ప్రమాదం ఉన్న ఇళ్లలో నివసించవద్దు. అత్యవసరం కాని దూర ప్రయాణాలను వాయిదా వేసుకోవడం మంచిది. మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దు. వాహనాల్లో అనుమతించిన పరిమితికి మించి ప్రయాణికులను




తీసుకెళ్లవద్దు. సెల్ఫీలు, రీల్స్ కోసం వాగులు, చెరువులు, జలపాతాలు లేదా వరద నీటి ప్రాంతాలకు వెళ్లి ప్రాణాలను ప్రమాదంలో పెట్టుకోవద్దని జిల్లా ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## పౌర్ణమి రోజున వర్షంలోనూ కొండగట్టు గిరి

# ప్రదక్షిణలో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యే

మాల్యాల,జగిత్యాల, జులై29,(ప్రజాదర్బార్) జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన కొండగట్టు లో మంత్రులు గిరి ప్రదక్షిణ లో పాల్గొని గిరి ప్రదక్షిణ ప్రాంభించారు.గురు వ్యాస పౌర్ణమి సందర్భంగా జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామి క్షేత్రంలో నిర్వహించిన గిరి ప్రదక్షిణలో మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, డిసిసి అధ్యక్షుడు గాజంగి నందయ్య తదితరులు పాల్గొన్నారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా గిరి ప్రదక్షిణ చేపట్టారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆంజనేయస్వామిని ప్రార్థించినట్లు వారు తెలిపారు. కొండగట్టు అడవి మార్గంలో ఉన్న పవిత్ర సీతమ్మ బావి వద్ద మంత్రులు నీళ్లు తాగి, ఆ నీటిని చల్లుకొని జైశ్రీరామ్ నినాదాలతో ప్రదక్షిణను ముందుకు సాగించారు.సీతమ్మ బావి జలంతో పులకించిన కొండగట్టు గిరి ప్రదక్షిణ. కొండగట్టులో కొనసాగుతున్న గిరిప్రదక్షిణలో భక్తి పారవశ్యం వెల్లివిరిసింది. అడవి మార్గంలో ఉన్న పవిత్ర సీతమ్మ బావి వద్ద మంత్రులు నీళ్లు తాగి, ఆ నీటిని చల్లుకొని జైశ్రీరామ్ నినాదాలతో ప్రదక్షిణను ముందుకు సాగిం



చారు. మంత్రి పొన్నం స్వయంగా ఆ బావి నీటిని అందరిపై చల్లారు. ఈ బావి నుంచే నిత్యం కొండగట్టు ఆంజన్నకు అభిషేకం నిర్వహిస్తారు. మంత్రులు, విప్, ఎమ్మెల్యేతో కలిసి భక్తులు ఉత్సాహంగా ప్రదక్షిణ చేశారు.

# రాజోలి హెచ్ డబ్ల్యు సి ఎస్ సంస్థకు చెందిన ఇండ్ల స్థలాలను గుట్టుగా కబ్జా చేసిన గత పాలకవర్గం..!

### - అప్పుల్లో చేనేత సహకార సంఘం.

అలంపూర్ నియోజకవర్గం జూలై 29 (ప్రజా దర్బార్): జోగులాంబ గద్వాల జిల్లా, అలంపూర్ నియోజకవర్గం, మేజర్ గ్రామపంచాయతీ అయిన" రాజోలి చేనేత సహకార సంఘం"ఒకప్పుడు రాష్ట్రస్థాయిలో ఉన్నతంగా ఉంటూ ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకున్న సంస్థ. నేడు గత పాలకవర్గాల పుణ్యమా..! అంటూ అప్పుల ఊబిలో.. కొట్టుమిట్టాడుతుంది. కంచే చేను మేసిన చందంగా సంస్థను కాపాడాల్సిన పాలకవర్గాలు. పక్క దారి పట్టారు. సంఘమే మన చేతిలో ఉంది కదా మనల్ని ఎవరు అడిగేది..? అంటూ వడ్డీ లేదని, గత పాలక వర్గాలు వారు, వారి కుటుంబీకులు, బంధువులకు ఇష్టం వచ్చినట్లు వేల రూపాయల నుంచి లక్షల కొలది రూపాయలు అప్పులు ఇచ్చి నేడు సంస్థను అప్పుల ఊబిలోకి నెట్టేశారని చేనేత సహకార సంఘం కార్మికులు ఆరోపిస్తున్నారు. సంస్థ పేరుపై ?:10 లక్షలకు పైగా రుణం తీసుకొని ఎలాంటి లావాదేవీలు జరపకపోవడంతో సంబంధిత బ్యాంకు ఖాతాను నిలిపివేయడం జరిగింది. చేనేత సహకార సంఘం నుంచి అప్పులు తీసుకున్నారే కానీ తిరిగి సంస్థకు చెల్లించిన పాపాన పోలేదని, చేనేత కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొన్నటి వరకు సంస్థను పాలించిన పాలకవర్గాలు మేమేమైనా తక్కువనా..? అంటూ చేనేత కార్మికులకు ఇండ్ల పట్టాలు ఇస్తామంటూ నమ్మబలికి వారి నుంచీ అధిక మొత్తంలోడబ్బులు తీసుకొని, ఇంటి పట్టా స్థలం చూపించకుండా మోసం చేశారంటూ కార్మికులు వాపోయారు. జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి చేతివాటంతో చేనేత వీవర్స్ కాలనీలో కార్మికులకు కేటాయించిన ఇండ్ల స్థలంలో మిగిలిన స్థలాన్ని.. డబ్బులు




ఇచ్చిన కార్మికుల పేరుపై రిజిస్ట్రేషన్ చేయించకుండా, గత పాలకవర్గం వారు వారి పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు చేనేత కార్మికులు మరియు గ్రామస్తులు గుసగుసలు అనుకొనుచున్నారు. ప్రస్తుతం రాజోలి చేనేత కార్మికుల సహకార సంఘం నష్టాల్లో ఉండగా.. గత పాలకవర్గాలు వారు మాత్రం కార్మికుల స్థలాన్ని.. చెప్పా పెట్టకుండా.. చేనేత ,జౌళి శాఖ జిల్లా అధికారిని మచ్చిక చేసుకుని , ఒక చేనేత కార్మికుడికి చెందిన ఇంటి స్థలాన్ని సొంతంగా వారి కుటుంబీకుల పేరుతోగుట్టుగా రిజిస్ట్రేషన్ చేయించు కోవడం ఎంతవరకు న్యాయమంటూ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. , వారికి సహకరించిన జిల్లాఅధికారిని సైతం విచారించి , వారి రిజిస్ట్రేషన్ రద్దు చేసి, వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, చేనేత కార్మికుల ఇండ్ల స్థలాన్ని కార్మికులకే చెందేలా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు మరియు జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని రాజోలి చేనేత సహకార సంఘం కార్మికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# అకాల వర్షాలకు కూలిన భారీ వృక్షం - ఇంటి రేకుల షెడ్డు ధ్వంసం

(పలిమెల/మహాదేవపూర్ జులై 29 ప్రజాదర్బార్) జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల కేంద్రంలో కురుస్తున్న అకాల వర్షాల తో భారీ వృక్షం అకస్మాత్తుగా నేలకూలడం తో ఇంటి రేకుల షెడ్డు ధ్వంసం అయిన సంఘటన మంగళవారం రోజున రాత్రి చోటు చేసుకుంది. మండల కేంద్రంలో నివాసం ఉంటున్న పడాల రాజేందర్ ఇంటి రేకుల షెడ్డు పై భారీ వర్షాలకు మరియు దానికి తోడు ఈదురు గాలులు ఉండడంతో ఒక్కసారిగా భారీ వృక్షం నివాస గృహం ముందు ఉన్న రేకుల షెడ్డు పై పడడంతో ధ్వంసం కాగా అందులోని గృహోపకరణాలు చెడిపోయాయి. అదృష్టవశాత్తూ నివాస గృహానికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. వర్షం పడుతున్న సమయంలో ఒక్కసారిగా చెట్టు విరిగిపడటంతో నివాస గృహం తో పాటు వెల్డింగ్ షాపు పూర్తిగా దెబ్బతిని లోపల ఉన్న సామాగ్రి పాడైంది. తన కుటుంబ జీవనోపాధికి ఆధారమైన షాపు ధ్వంసం కావడంతో షాపు యజమాని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం అదేవిధంగా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం



అందించి ఆదుకోవాలని, కూలిపోయిన చెట్టును వెంటనే తొలగించి ఇబ్బంది లేకుండా చూడాలని మండల ప్రజలు డిమాండ్ చేశారు.

## చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు..!

# దమ్మపేట గ్రామాలన్నీ బెల్టు దుకాణాల మయమే

### - మద్యానికి బానిసలు అవుతున్న గిరిజన గ్రామాలు-కోట్ల రూపాయల అక్రమ వ్యాపారానికి అడ్డుకట్ట ఎప్పుడు?




దమ్మపేట, ప్రజాదర్బార్ జూలై 29:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గంలోని దమ్మపేట మండలంలో అక్రమ మద్యం విక్రయాలు రోజురోజుకూ విచ్చలవిడిగా విస్తరిస్తున్నాయి. ప్రభుత్వ అనుమతి లేని బెల్టు దుకాణాలు గ్రామాల్లో విచ్చలవిడిగా కొనసాగుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ అనుమతి లేని బెల్టు దుకాణాలు గ్రామాల్లో విచ్చలవిడిగా కొనసాగుతున్నా అధికారులు మౌనం వెనుక మతలబు ఏమిటో అని స్థానిక ప్రజల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని అనేక గ్రామాల్లో ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు మద్యం అందుబాటులో ఉండటంతో యువత, కూలీలు, గిరిజన కుటుంబాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.గ్రామాల్లో ఏర్పాటు చేసిన బెల్టు దుకాణాల ద్వారా ప్రభుత్వ ధరల కంటే అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఒకో సీసాపై ?20 నుంచి ?50 వరకు అదనంగా వసూలు చేస్తున్నట్లు వినియోగదారులు చెబుతున్నారు. దీంతో ప్రతిరోజూ వేల రూపాయలు, నెలకు లక్షల రూపాయలు, ఏడాదికి కోట్ల రూపాయల అక్రమ వ్యాపారం జరుగుతోందని స్థానికులు పేర్కొంటున్నారు.

**గిరిజన గ్రామాలపై తీవ్ర ప్రభావం**

మండలంలోని గిరిజన తండాలు, మారుమూల గ్రామాల్లో బెల్టు దుకాణాలు విస్తరించడం వల్ల మద్యపానం విపరీతంగా పెరిగిందని గ్రామ పెద్దలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం కూలీ పనికి వెళ్లే పలువురు సంపాదనలో గణనీయమైన భాగాన్ని మద్యానికే ఖర్చు చేస్తుండటంతో కుటుంబాల ఆర్థిక పరిస్థితి దెబ్బతింటోందని చెబుతున్నారు. మహిళలు, చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తమవుతోంది.

**పాఠశాలల సమీపంలోనూ విక్రయాల ఆరోపణలు**

కొన్ని గ్రామాల్లో విద్యాసంస్థలు, జనావాసాలకు సమీపంలోనే అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో విద్యార్థులపై కూడా ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని పలువురు సామాజిక కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు.

**చోద్యం చూస్తున్న ఎక్సైజ్ శాఖ?**

అక్రమ మద్యం విక్రయాలపై తరచూ ఫిర్యాదులు వస్తున్నప్పటికీ, సంబంధిత అధికారుల తనిఖీలు, చర్యలు ఆశించిన స్థాయిలో కనిపించడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఎక్సైజ్, పోలీసు శాఖలు సమన్వయంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి బెల్టు దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. దమ్మపేట మండలంలో అక్రమ మద్యం విక్రయాలపై ప్రజల నుంచి వస్తున్న ఆరోపణల నేపథ్యంలో సంబంధిత శాఖలు సమగ్ర విచారణ చేపట్టి, వాస్తవ పరిస్థితులను పరిశీలించి కఠిన మైన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# నేరాల కట్టడికే కార్డెన్ సెర్చ్

### డీఎస్పీవిట్టల్ రెడ్డి

బాన్సువాడ ప్రతినిధి : ప్రజాదర్బార్. నేరాల కట్టడి కోసం కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని బాన్సువాడ డిఎస్పి విట్టల్ రెడ్డి అన్నారు. కామారెడ్డి జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు బుధవారం బాన్సువాడ మండలం తాడ్కోల్ గ్రామ పంచాయతీ పరిధిలోనీ రాజారామ్ దుబ్బాలో ఉదయం బాన్సువాడ డీఎస్పీ ఆధ్వర్యంలో పట్టణ సీఐ తులా శ్రీధర్, గ్రామీణ సీఐ తిరుపయ్య , పిట్లం ఎస్సైఆంజనేయులు, 140 మంది పోలీస్ సిబ్బంది కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి పోలీస్ సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. నంబర్ ప్లేట్లు లేని సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను ప్రధాన కూడలి వద్ద తీసుకువచ్చి పరిశీలించారు. కార్డెన్ సెర్చ్ తనిఖీలు నిర్వహించి 112 మోటార్ సైకిళ్ళు, ఐదు కార్లు, 18 ఆటోలను తనిఖీ చేసి వాటిలో సరైన ధ్రువపత్రాలు లేని 13 మోటార్ సైకిళ్ళు, ఒక ఆటోను జప్తు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ప్రజలను ఉద్దేశించి డీఎస్పీ మాట్లాడుతూ సురక్షితమైన భద్రతను కల్పించడం కోసం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కనెక్టివిటీ కార్యక్రమంలో భాగంగా కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు రోడ్డు భద్రత, ఆన్లైన్ బెట్టింగ్,గంజాయి నిర్మూలన, మాదకద్రవ్యాల గురించి అవగాహన కల్పించారు. వాహనాలను తనిఖీ చేయడంతో పాటు ఎలాంటి ఆధారాలు లేకుండా గ్రామంలో ఉన్న నూతన వ్యక్తుల సమాచారాన్ని సేకరించడం, ప్రజలకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అందుతున్న సేవలను వివరించారు. ప్రతి ఒక్కరూ వారి వాహనాలకు ఆర్సి , డ్రైవింగ్ లైసెన్సులు, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. పాత వాహనాలు కొనుగోలు చేసేటప్పుడు డాక్యుమెంట్లు



చెక్ చేసుకోవాలన్నారు. హెల్మెంట్ లేకుండా సీటు బెల్టు, లేకుండా మద్యం సేవించి వాహనాలను నడపవద్దని సూచించారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమా నిబంధనలను పాటిస్తూ ప్రయాణించే సమయంలో వాహనాల అన్ని ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. ఎవరైనా అనుమానస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే చట్టరీత్య చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. సైబర్ క్రైమ్ వల్ల ప్రజలు మోసపోతున్న విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించి ఎవరు సైబర్ క్రైమ్ బారిన పడి మోసపోకుండా చూడడం లాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు డీఎస్పీ తెలిపారు. బాన్సువాడఎస్సైలు మోహన్, వి.అశోక్, వెంకట్రావ్, శిరీష, బీర్కూర్ ఎస్సై రాములు, నిజాంసాగర్ ఎస్సైశివకుమార్, నస్రుల్లాబాద్ ఎస్సై రాఘవేంద్ర, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాలలో చదువుకున్న

# ప్రతి అక్షరం జీవితాన్ని వెలిగించే దీపం

### జిల్లా రెవెన్యు అదనపు కలెక్టర్ అనిల్ కుమార్

మహబూబాబాద్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ కొమ్మనబోయిన యాకయ్య జూలై 29 (ప్రజాదర్బార్): పిల్లల కళ్లలో ఆనందం, కుటుంబ భవిష్యత్తు, రాష్ట్ర ప్రగతి అన్నీ విద్యతోనే సాధ్యమవుతాయని ప్రతి సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు విద్య కోసం ఖర్చు చేస్తున్నాయని, ప్రతి పేద పిల్లవాడు చదువుకోవాలి.. ఆశలు పెంచుకోవాలి.. పాఠశాలలో కూర్చుని నేర్చుకున్న ఒక్క ప్రతి అక్షరం జీవితాన్ని వెలిగించే దీపమని జిల్లా రెవెన్యు అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్ అన్నారు. బుధవారం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు, విద్యాశాఖ సహకారంతో ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేపట్టనున్న పరీక్షల్లో విజయం సాధించాలంటే.. అనే కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించి జిల్లా వ్యాప్త కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యాభ్యాసం కోసం పెట్టే ఒక్కో రూపాయి, రాబోయే తరాల కన్నీళ్లు తుడిచే అమూల్యమైన పెట్టుబడిగా మలుస్తుందని స్పష్టం చేశారు. విద్య అనేది పేదవాడి ఆయుధం, అక్షరాస్యతే సమాజానికి అజ్ఞానం నుంచి విముక్తి అని తెలిపారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థుల పరీక్షల ఫలితాల ఉ




న్నతికై ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నామని, గత పది సంవత్సరాలుగా ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని,విద్యాసంస్థలు విరివిగా వినియోగించుకోవాలని, విద్యాశాఖ సహకారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ప్రతినిది సహజ తదితరులు పాల్గొన్నారు.

### అంగన్వాడీ సెంటర్ లో అవకతవకలు...

# డిడబ్ల్యూఓ ఆధ్వర్యంలో విచారణ



నంగునూరు, జులై29 (ప్రజా దర్బార్)సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం ఆంక్షపూర్ గ్రామ అంగన్వాడి కేంద్రంలో అవకతవకలు జరిగినట్లు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో డి డబ్ల్యు ఓ శారద గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచి పద్మ, గ్రామస్తులు, ఫిర్యాదుదారులు, అంగన్వాడి ఉపాధ్యాయులరాలు రేణుక సమక్షంలో , బుధవారం విచారణ చేపట్టారు. అనంతరం కేంద్రంలో గర్భిణీ, బాలింతలకు ఇవ్వాల్సిన గుడ్లు, పాలు, పప్పులు, బియ్యం, నూనె వంటి వాటిలో అంగన్వాడి టీచర్ రేణుక కొన్ని పొరపాట్లు చేసిందని డి డబ్ల్యు ఓ శారద పత్రికా సమావేశంలో వెల్లడించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... గతంలో కూడా అంగన్వాడి కేంద్రం పరిశు భ్రత విషయంలో టీచర్ రేణుకకు మెమో జారీ చేశామని గ్రామస్తులకు, పిర్యాదుదారులకు గుర్తు చేశారు. ప్రభుత్వ ఉద్యోగి ప్రజలకు అందుబాటులో ఉండి జవాబుదారిగా ఉండాలన్నారు. చిన్న పిల్లలు వాష్ రూమ్ వెళ్తే శుభ్రం చేయాలని సదరు ఆయా, టీచర్లు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని, వాష్ రూమ్ వెళ్లిన పిల్లలను అలాగే ఇంటికి పంపిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇక నుంచి గ్రామస్తులతో దురుసుగా మాట్లాడనని, అంగన్వాడి సెంటర్ కు వచ్చే పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందిస్తామని, ఇప్పటి వరకు జరిగిన పొరపాట్లతో బాధితులకు క్షమాపణలు తెలుపుతున్నట్లు రేణుక వెల్లడించారు.

# పోలింగ్ బూత్ ల సంఖ్యను పెంచండి..!

### హుస్నాబాద్‌లో బీజేపీ సర్ ప్రవాస్ అభియాన్- పోలింగ్ బూత్‌ల పెంపునకు ఆర్డీఓ రామ్మూర్తి కి వినతి




హుస్నాబాద్, జూలై 29 (ప్రజాదర్బార్): బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న సర్ ప్రవాస్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా హుస్నాబాద్ పట్టణంలో బీజేపీ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి, పట్టణ ప్రవాస్ అభియాన్ సంయోజక్ ఖమ్మం వెంకటేశం 24 గంటలపాటు పర్యటించి పార్టీ కార్యక్రమాలను సమీక్షించారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ ఆర్డీఓ రామ్మూర్తిని కలిసి, పట్టణంలో ఓటర్ల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా కొత్త పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసి, బూత్‌ల సంఖ్యను పెంచాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగాబిజెపి జిల్లా కార్యదర్శి ఖమ్మం వెంకటేశం మాట్లాడుతూ బూత్ కమిటీలే భారతీయ జనతా పార్టీకి వెన్నెముక అని అన్నారు. ప్రతి కార్యకర్త తన పరిధిలోని ప్రతి కుటుంబాన్ని కలిసి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజల విశ్వాసాన్ని పొందాలని, యువత, మహిళలు, రైతులు, మేధావులు సహా అన్ని వర్గాల ప్రజలను పార్టీతో అనుసంధానం చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకురాలు లక్కిరెడ్డి తిరుమల, తోట స్వరూప, మాజీ కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, నాయకులు తగరం లక్ష్మణ్, రాయికంటి చందు, తోట సమ్మయ్య, ఎర్రవెల్లి ప్రశాంత్, పెందోట భూశంకరాచారి, ఇల్లందుల తిరుపతి, బొడిగే వెంకటేష్, ఎర్రోజు సాయికృష్ణ, నందకుమార్, వరియోగుల మురళీధరస్వామి, విలసాగరం మురళీమోహన్, బూత్ అధ్యక్షులు, బిఎల్ఏ2లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### అధికారులు ప్రజాప్రతినిధులు

# సమన్వయంతో పని చేయండి..!

### - గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలి- మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం.



హుస్నాబాద్, జూలై 29 ప్రజాదర్బార్.హుస్నాబాద్ మండల పరిధిలో ఉన్నటువంటి గ్రామాల అభివృద్ధిపై బుధవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సమావేశం హుస్నాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేయగా హుస్నాబాద్ మండల పరిధిలో ఉన్నటువంటి గ్రామాల సర్పంచులు అధికారులు కార్యదర్శులు హాజరయ్యారు .వారిని ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలని అన్నారు.గ్రామ పంచాయతీ అభివృద్ధి కార్యక్రమాల గురించి ఎప్పటికప్పుడు సమీక్ష జరుపుతూ గ్రామాలను ఏ విధంగా అభివృద్ధి చేయాలో అందరూ భాగస్వాములై అభివృద్ధికి తోడ్పాటు అందించాలని అన్నారు. గ్రామంలో ఉన్నటువంటి పాఠశాలల్లో ఉన్న సౌకర్యాలను గాని, ఇంకుడు గుంతల నిర్మాణాలు గానీ, వ్యవసాయ రంగ పంటలపై విశ్లేషణ గాని,ఇంకా ఇతరత్రా అన్ని అంశాలపై సమగ్రమైన నివేదిక కలిగి ఉండాలని అన్నారు.వర్షాభావ పరిస్థితుల్లో తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని మరియు ఎల్ నినో ప్రభావం ఉండడం చేత రైతులకు పంటలపై అవగాహన కల్పించి మోటివేషన్ చేయాలని మంత్రి తెలిపారు.మొత్తానికి గ్రామ అభివృద్ధికి అందరూ సహకరిస్తేనే ముందుకు వెళ్లగలుగుతామని సూచించారు.ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఆత్మ కమిటీ చైర్మన్ జంగపల్లి ఐలయ్య,మండల పరిషత్ అధికారులు వివిధ గ్రామాల సర్పంచులు కార్యదర్శులు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గురువుల మహిమను చాటిన గురుపౌర్ణమి వేడుకలు

### -- గురుభక్తితో నిండిన శ్రీ సత్యనారాయణ గీతా మందిరం



దౌల్తాబాద్, జూలై 29 (ప్రజాదర్బార్) గురుపౌర్ణమి సందర్భంగా దౌల్తాబాద్ మండల కేంద్రంలోని శ్రీ సత్యనారాయణ గీతా మందిరంలో బుధవారం గురుపూజా మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోగా, ప్రత్యేక పూజలు, గురుపూజ, వేద మంత్రోచ్చారణల నడుమ ఆధ్యాత్మిక కార్యక్రమాలు వైభవంగా సాగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన భక్తులు మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో గురువుకు అత్యున్నత స్థానం ఉందని, అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞానమార్గంలో నడిపించే మహనీయులు గురువులని పేర్కొన్నారు. గురువులను గౌరవించడం ప్రతి ఒక్కరి ధర్మమని, గురుపౌర్ణమి వంటి పర్వదినాల ఆచరణ ద్వారా ఆధ్యాత్మిక విలువలు, సంస్కారాలు మరింత బలోపేతమవుతాయని వివరించారు. అనంతరం భక్తులు గురువులకు పాదపూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. కార్యక్రమం ముగింపులో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దౌల్తాబాద్ ఉప సర్పంచ్ ఆది బాలకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

# గురుపౌర్ణమి వేడుకల్లో భక్తి పారవశ్యం

### - గురువుల పాదపూజతో కృతజ్ఞతాభివందనం-వేదమంత్రాల నడుమ ఘనంగా గురుపూజలు



కొందుర్గు జూలై 29(ప్రజాదర్బార్):- "మాతృదేవో భవ... పితృదేవో భవ... ఆచార్యదేవో భవ" అని భారతీయ సంస్కృతి బోధించిన గురుతత్వం మరోసారి గురుపౌర్ణమి సందర్భంగా సజీవమైంది. గురువే జ్ఞానానికి మూలం... గురువే సంస్కారానికి ప్రతిరూపం... గురువే జీవితానికి దిక్సూచి అనే భావనతో మండల వ్యాప్తంగా గురుపౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విద్యాసంస్థలు, ఆశ్రమాలు, దేవాలయాలు, ఆధ్యాత్మిక కేంద్రాలు గురుభక్తితో కళకళలాడాయి. గురువుల పాదపూజలు, శాలువా సత్కారాలు, పుష్పార్చనలు, ఆశీర్వచనాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఉదయం నుంచే విద్యార్థులు, శిష్యులు, భక్తులు తమ గురువులను దర్శించుకుని పాదపూజలు నిర్వహించారు. వేదఘోషలు, మంగళ వాయిద్యాల నడుమ గురువులకు హారతులు ఇచ్చి పుష్పాంజలి ఘటించారు. గురువుల ఆశీస్సులు తీసుకున్న విద్యార్థులు తమ జీవితంలో జ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. వక్తలు మాట్లాడుతూ, గురువు లేకుండా విద్య లేదని... విద్య లేకుండా వ్యక్తిత్వ వికాసం సాధ్యం కాదని అన్నారు. మనిషిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, చీకటి నుంచి వెలుగులోకి నడిపించే మహోన్నత వ్యక్తి గురువేనని కొనియాడారు. ప్రపంచాన్ని జయించిన మహానుభావుల వెనుక కూడా ఒక గొప్ప గురువు ఉంటాడని గుర్తు చేశారు.

గురుపౌర్ణమి రోజున మహర్షి వేదవ్యాసుడిని స్మరించుకోవడం భారతీయ సంప్రదాయమని తెలిపారు. వేదాలను నాలుగు భాగాలుగా విభజించి, మహాభారతం, పద్దెనిమిది పురాణాలు రచించి భారతీయ జ్ఞాన సంపదను ప్రపంచానికి అందించిన మహర్షి వ్యాసుని గౌరవార్థమే ఈ పర్వదినాన్ని వ్యాస పౌర్ణమిగా కూడా జరుపుకుంటారని వివరించారు.

--ఈ సందర్భంగా గురువుల గొప్పతనాన్ని తెలియజేస్తూ పలువురు ఈ శ్లోకాన్ని పఠించారు:

--గురు బ్రహ్మ గురు విష్ణుః
గురు దేవో మహేశ్వరః ।
గురుః సాక్షాత్ పరబ్రహ్మ
తస్మై శ్రీ గురవే నమః ॥

అర్థం: గురువే బ్రహ్మ, గురువే విష్ణువు, గురువే మహేశ్వరుడు. గురువే ప్రత్యక్ష పరబ్రహ్మ స్వరూపుడు. అటువంటి శ్రీ గురుదేవునికి నా నమస్కారాలు.

--అలాగే మరో ప్రసిద్ధ గురు శ్లోకాన్ని కూడా భక్తిశ్రద్ధలతో పఠించారు:

--అజ్ఞాన తిమిరాంధస్య
జ్ఞానాంజన శలాకయా ।
చక్షురున్మీలితం యేన
తస్మై శ్రీ గురవే నమః ॥

అర్థం: అజ్ఞానమనే అంధకారాన్ని తొలగించి జ్ఞానమనే వెలుగును ప్రసాదించిన గురువుకు వందనాలు.

కార్యక్రమాల్లో విద్యార్థులు గురువులపై కవితలు, గేయాలు, ప్రసంగాలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. గురువులు విద్యార్థులకు ఆశీర్వచనాలు అందిస్తూ విద్యతో పాటు వినయం, క్రమశిక్షణ, సేవాభావం, దేశభక్తి వంటి విలువలను పెంపొందించుకోవాలని సూచించారు. "తల్లిదండ్రులు జన్మనిస్తే... గురువు జీవితానికి అర్థాన్ని ఇస్తాడు. సంపద కంటే గొప్పది విద్య... ఆ విద్యను అందించే గురువు కంటే గొప్ప దైవం మరొకటి లేదు" అని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో గురువులను ఘనంగా సన్మానించి శాలువాలు, పుష్పగుచ్ఛాలు అందజేశారు. విద్యార్థులు తమ గురువుల పాదాలకు నమస్కరించి ఆశీర్వాదాలు పొందారు. గురుపౌర్ణమి సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ జీవితంలో జ్ఞానదీపం వెలిగించిన గురువులను స్మరించుకోవాలని, వారి బోధనలను ఆచరణలో పెట్టడమే నిజమైన గురుదక్షిణ అని వక్తలు పిలుపునిచ్చారు.

## సమన్వయంతో ముందుకు

# సాగి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలి

### -- మండల ప్రత్యేక అధికారి బాబు నాయక్



రాయపోల్ జులై 29 (ప్రజాదర్బార్) గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగుతూ అభివృద్ధి చేసుకుంటూ ముందుకు సాగాలని వ్యవసాయ శాఖ గజ్వేల్ డివిజన్ ఎడీఏ. రాయపోల్ మండల ప్రత్యేక అధికారి బాబు నాయక్ పేర్కొన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల కేంద్రంలో రైతు వేదిక కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన సర్పంచులు అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. వర్షాకాలం సీజన్ కావడం వలన గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని. ఎప్పటికప్పుడు వీధులను పరిశుభ్రంగా ఉంచే విధంగా పంచాయతీ కార్యదర్శిలు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించి డ్రై డే కార్యక్రమాలను ముమ్మరంగా చేపట్టాలని ఆయన సూచించారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలని. సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు. గ్రామస్థాయి అధికారులు సమన్వయంతో పనిచేస్తే గ్రామాల్లో సమస్యలు పరిష్కారం చెందుతాయని ఆయన గుర్తు చేశారు. అన్ని శాఖల అధికారులు సమయపాలన పాటించి విధులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని. మురికి కాలువలు పరిశుభ్రంగా ఉండాలని. చెత్తా చెదారం ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్లకు తరలించాలని సూచించారు. ఈ సమావేశంలో ఉమ్మడి మండల మార్కెట్ చైర్మన్ గొల్లపల్లి కనకయ్య. ఉమ్మడి మండల సొసైటీ చైర్మన్ అన్నా రెడ్డి గారి వెంకట్ రెడ్డి. తాసిల్దార్ కృష్ణమోహన్. ఎంపీడీవో శ్రీనివాస్. రాయపోల్ గ్రామ సర్పంచ్ మాసంపల్లి రాజు నరసింహారెడ్డి మున్నా, పర్వేజ్ అహ్మద్, వాసు వెంకటయ్య అశోక్ రెడ్డి, రాజా గారి రేణుక వివిధ గ్రామాల సర్పంచులు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మెదక్ ప్రెస్ క్లబ్ నూతన ఎన్నిక..

## అధ్యక్ష,కార్యదర్శులుగా. నరసింహ చారి, సంగమేశ్వర్



మెదక్ జిల్లా ప్రతినిధి, జులై 29:( ప్రజా దర్బార్ )మెదక్ ప్రెస్ క్లబ్ 2026-28 సంవత్సరానికి జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. స్థానిక ప్రెస్ క్లబ్ భవనంలో జరిగిన ఎన్నికల్లో 98 మంది ఓట్లకు గాను 96 మంది ఓటు హక్కు వినియోగం చేసుకున్నారు. ఓటర్లు బారులు తీరి ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. సీనియర్ విలేకరులు బాలేశ్వర్ , దేవయ్య, శ్రీధర్, మురళి, ఫారూక్ తో పాటు మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. హోరాహోరీగా ఎన్నికలు జరుగగా, అధ్యక్ష స్థానానికి గుట్టమీది ప్రకాష్, శివన్నగారి నర్సింహచారి తలపడ్డారు. 98 ఓటర్లకు గాని 96 ఓట్లు పోల్ అవ్వగా ప్రకాశ్ కు 42 ఓట్లు రాగా, నర్సింహచారికి 54 ఓట్లు వచ్చాయి. 12 ఓట్ల మెజార్టీతో నర్సింహచారి అధ్యక్షుడిగా గెలుపొందారు.ప్రధాన కార్యదర్శి పదవికి చెవిటి అశోక్, బచ్చు సంగమేశ్వర్ పోటీ పడగా, అశోక్ కు 44 ఓట్లు, సంగమేశ్వర్ కు 52 ఓట్లు వచ్చాయి. ఎనిమిది ఓట్ల మెజార్టీతో సంగమేశ్వర్ విజయం సాధించారు.గెలిచిన అధ్యక్ష, కార్యదర్శులకు ఎన్నికల కమిటీ సభ్యులు మంగ శరత్ చంద్ర గౌడ్, బోనగిరి చంద్రశేఖర్, అల్లాడి శేఖర్, పొగాకు రామకృష్ణ, మహ్మద్ యూసుఫ్ ఆలీ ధ్రువపత్రాలు అందజేశారు. అనంతరం నూతన అధ్యక్ష, కార్యదర్శులను ప్రెస్ క్లబ్ సభ్యులు షాల్వాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## బోరు కరెంట్ స్తంబాలు ధ్వంసం



శివ్వంపేట, జూలై 29 ( ప్రజా దర్బార్ ) మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలో వ్యవసాయ పొలంలోని బోరుకు విద్యుత్ సరఫరా కోసం పాతిన కరెంట్ స్తంభా లను ఓ వ్యక్తి ధ్వంసం చేసిన అమానుష సంఘటన శివ్వంపేట మండల పరిధిలోని దొంతి గ్రామంలో మంగళవారం జరిగింది. బాధితులు అంబిగారి నర్సిములు, తెలిపిన వివరాల ప్రకారం. దొంతి గ్రామ శివారులోని తన వ్యవసాయ భూమిలో ఉన్న బోరుకు విద్యుత్ కనెక్షన్ కోసం అదే గ్రామానికి చెందిన చుక్క మల్లేష్ పొలంలో నుండి మూడు కరెంట్ స్తంభాలను పాతినట్టు చెప్పారు. విద్యుత్ స్తంబాలు పాతిన విషయం తెలుసుకొని అక్కడికి వచ్చిన మల్లేష్.. ఆగ్రహం వ్యక్తం చేస్తూ. నా పొలంలో నుండి ఎట్లా స్తంబాలు పాతినవు అంటూ దుర్భాషలాడుతూ జేసీబీ సాయంతో కరెంట్ స్తంభాలను పూర్తిగా విరగొట్టిండని దళిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. బోరుకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో వరి నాటు పూర్తిగా ఎండిపోయిందని రైతు కన్నీరుమున్ని రయ్యాడు. విద్యుత్ స్తంభాలను ధ్వంసం చేసిన వ్యక్తులపై అధికారులు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజాదర్బార్
తెలుగు దినపత్రిక
Thursday, July,30, 2026

# దుబ్బాక మండల అభివృద్ధిపై సమగ్ర సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ..



–దుబ్బాక అభివృద్ధికి సహకరించని అధికారులను ఉపేక్షించేది లేదు– జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడికైనా వెనుకాడం– ప్రజా సమస్యల పరిష్కారమే సమీక్ష సమావేశాల ప్రధాన ఉద్దేశం– రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అధికారులు బాధ్యతగా పనిచేయాలి– డీఏపీ ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు– ప్రతి గ్రామంలో విద్యుత్, తాగునీరు, విద్య, వైద్య సేవలు మెరుగుపడాలి– పామాయిల్ సాగుకు నా సొంత 12 ఎకరాలను కేటాయిస్తా -- ఎమ్మెల్యే– ఉద్యమాల గడ్డ దుబ్బాక శక్తి ఏమిటో అవసరమైతే చూపిస్తాం – దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి దుబ్బాక. జూలై 29 (ప్రజా దర్బార్): దుబ్బాక మండల పరిషత్ కార్యాలయంలో దుబ్బాక మండలానికి చెందిన సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు, జిల్లా స్థాయి అధికారులతో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మండల అభివృద్ధిపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయం, విద్యుత్, మిషన్ భగీరథ, హౌసింగ్, విద్య, వైద్యం తదితర శాఖల పనితీరును శాఖల వారీగా సమీక్షించి, ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో రైతులు ఏయే పంటలు ఎంత విస్తీర్ణంలో సాగు చేశారో అడిగి తెలుసుకున్నారు. రైతులకు పామాయిల్ సాగుపై అవగాహన కల్పించాలని అధికారులతో పాటు ఏఈఓలు, సర్పంచులకు సూచించారు. పామాయిల్ సాగును ప్రోత్సహించేందుకు తాను కూడా తన సొంత 12 ఎకరాల్లో పామాయిల్ సాగు చేస్తానని ప్రకటించారు. రైతులకు యూరియా, డీఏపీ ఎరువుల సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉండకూడదని ఆదేశించారు. డీఏపీ ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నారని సర్పంచులు, రైతులు ఫిర్యాదు చేయడంతో వెంటనే జిల్లా అధికారులకు ఫోన్ చేసి సంబంధిత ఫర్టిలైజర్ దుకాణాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడుతూ రైతులకు విద్యుత్ అంతరాయం లేకుండా ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచాలని, ప్రతి గ్రామానికి ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి అత్యవసర పరిస్థితుల్లో విద్యుత్ సరఫరాను నియంత్రించే సౌకర్యం కల్పించాలని సూచించారు. విద్యుత్ పనుల పేరుతో చెట్లను నరికి రోడ్లపై వదిలేయడం బాధ్యతారాహిత్యమని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పాత విద్యుత్ స్తంభాలు, వైర్లను వెంటనే మార్చి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిషన్ భగీరథ పరిధిలో గ్రామాల్లో తాగునీటి సరఫరా నిరంతరంగా ఉండేలా చూడాలని, ప్రతి ఇంటి వద్ద నీటి వృథాను అరికట్టేందుకు సర్పంచులు, సెక్రటరీలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ బోర్ల ద్వారా వచ్చే నీరు, విద్యుత్ వృథా కాకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. హౌసింగ్ శాఖ అధికారులతో మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఎదుర్కొంటున్న బిల్లుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. విద్యాశాఖ అధికారులతో మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య, మధ్యాహ్న భోజనం, మౌలిక వసతులు అందేలా నిరంతరం తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. బెంచీలు, బల్లలు లేని పాఠశాలలకు వెంటనే అవసరమైన సామగ్రి అందించాలని, ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్య శాఖ అధికారులతో మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. పీహెచ్‌సీల్లో అవసరమైన సిబ్బంది కొరతను తీర్చేందుకు స్థానిక సంస్థల సహకారంతో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ దుబ్బాక అభివృద్ధికి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చేస్తున్న కృషిని అభినందించారు. దుబ్బాకలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు కోసం ముఖ్యమంత్రిని కలిసి ప్రత్యేకంగా కృషి చేసినందుకు ఆయనను అభినందించారు. చివరగా సమావేశాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి గారు మాట్లాడుతూ ఈ సమీక్షా సమావేశాల ప్రధాన ఉద్దేశం ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి జిల్లా, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పరిష్కరించడమేనని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా అధికారులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉండాలని, గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. దుబ్బాక అభివృద్ధి విషయంలో జిల్లా అధికారుల నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఎమ్మెల్యే తీవ్ర హెచ్చరిక చేశారు. జిల్లా కలెక్టర్ నుంచి కింది స్థాయి అధికారుల వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. అభివృద్ధి పనులకు అడ్డంకులు సృష్టిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ప్రజలతో కలిసి ముట్టడించేందుకు వెనుకాడబోమన్నారు. అయినా పరిస్థితి మారకపోతే ఉద్యమాల గడ్డ దుబ్బాక శక్తి ఏమిటో మరోసారి చూపించే పరిస్థితి వస్తుందని ఘాటుగా హెచ్చరించారు. ప్రజల అభివృద్ధే తమ లక్ష్యమని, అందుకు ఎవరు అడ్డొచ్చినా ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## దుబ్బాక మండల అభివృద్ధిపై సమగ్ర సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ..

-దుబ్బాక అభివృద్ధికి సహకరించని అధికారులను ఉపేక్షించేది లేదు- జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడికైనా వెనుకాడం- ప్రజా సమస్యల పరిష్కారమే సమీక్ష సమావేశాల ప్రధాన ఉద్దేశం- రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అధికారులు బాధ్యతగా పనిచేయాలి- డీఏపీ ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు- ప్రతి గ్రామంలో విద్యుత్, తాగునీరు, విద్య, వైద్య సేవలు మెరుగుపడాలి- పామాయిల్ సాగుకు నా సొంత 12 ఎకరాలను కేటాయిస్తా -- ఎమ్మెల్యే - ఉద్యమాల గడ్డ దుబ్బాక శక్తి ఏమిటో అవసరమైతే చూపిస్తాం-- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



దుబ్బాక. జూలై 29 (ప్రజా దర్బార్): దుబ్బాక మండల పరిషత్ కార్యాలయంలో దుబ్బాక మండలానికి చెందిన సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు, జిల్లా స్థాయి అధికారులతో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మండల అభివృద్ధిపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయం, విద్యుత్, మిషన్ భగీరథ, హౌసింగ్, విద్య, వైద్యం తదితర శాఖల పనితీరును శాఖల వారీగా సమీక్షించి, ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో రైతులు ఏయే పంటలు ఎంత విస్తీర్ణంలో సాగు చేశారో అడిగి తెలుసుకున్నారు. రైతులకు పామాయిల్ సాగుపై అవగాహన కల్పించాలని అధికారులతో పాటు ఏఈఓలు, సర్పంచులకు సూచించారు. పామాయిల్ సాగును ప్రోత్సహించేందుకు తాను కూడా తన సొంత 12 ఎకరాల్లో పామాయిల్ సాగు చేస్తానని ప్రకటించారు. రైతులకు యూరియా, డీఏపీ ఎరువుల సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉండకూడదని ఆదేశించారు. డీఏపీ ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నారని సర్పంచులు, రైతులు ఫిర్యాదు చేయడంతో వెంటనే జిల్లా అధికారులకు ఫోన్ చేసి సంబంధిత ఫర్టిలైజర్ దుకాణాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడుతూ రైతులకు విద్యుత్ అంతరాయం లేకుండా ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచాలని, ప్రతి గ్రామానికి ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి అత్యవసర పరిస్థితుల్లో విద్యుత్ సరఫరాను నియంత్రించే సౌకర్యం కల్పించాలని సూచించారు. విద్యుత్ పనుల పేరుతో చెట్లను నరికి రోడ్లపై వదిలేయడం బాధ్యతారాహిత్యమని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పాత విద్యుత్ స్తంభాలు, వైర్లను వెంటనే మార్చి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిషన్ భగీరథ పరిధిలో గ్రామాల్లో తాగునీటి సరఫరా నిరంతరంగా ఉండేలా చూడాలని, ప్రతి ఇంటి వద్ద నీటి వృథాను అరికట్టేందుకు సర్పంచులు, సెక్రటరీలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ బోర్ల ద్వారా వచ్చే నీరు, విద్యుత్ వృథా కాకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. హౌసింగ్ శాఖ అధికారులతో మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఎదుర్కొంటున్న బిల్లుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. విద్యాశాఖ అధికారులతో మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య, మధ్యాహ్న భోజనం, మౌలిక వసతులు అందేలా నిరంతరం తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. బెంచీలు, బల్లలు లేని పాఠశాలలకు వెంటనే అవసరమైన సామగ్రి అందించాలని, ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్య శాఖ అధికారులతో మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. పీహెచ్‌సీల్లో అవసరమైన సిబ్బంది కొరతను తీర్చేందుకు స్థానిక సంస్థల సహకారంతో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ దుబ్బాక అభివృద్ధికి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చేస్తున్న కృషిని అభినందించారు. దుబ్బాకలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు కోసం ముఖ్యమంత్రిని కలిసి ప్రత్యేకంగా కృషి చేసినందుకు ఆయనను అభినందించారు. చివరగా సమావేశాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి గారు మాట్లాడుతూ ఈ సమీక్షా సమావేశాల ప్రధాన ఉద్దేశం ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి జిల్లా, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పరిష్కరించడమేనని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా అధికారులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉండాలని, గ్రామ సర్పంచులు, పంచాయ తీ కార్యదర్శులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. దుబ్బాక అభివృద్ధి విషయంలో జిల్లా అధికారుల నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఎమ్మెల్యే తీవ్ర హెచ్చరిక చేశారు. జిల్లా కలెక్టర్ నుంచి కింది స్థాయి అధికారుల వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. అభివృద్ధి పనులకు అడ్డంకులు సృష్టిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ప్రజలతో కలిసి ముట్టడించేందుకు వెనుకాడబోమన్నారు. అయినా పరిస్థితి మారకపోతే ఉద్యమాల గడ్డ దుబ్బాక శక్తి ఏమిటో మరోసారి చూపించే పరిస్థితి వస్తుం దని ఘాటుగా హెచ్చరించారు. ప్రజల అభివృద్ధే తమ లక్ష్యమని, అందుకు ఎవరు అడ్డొచ్చినా ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# పొంగిపొర్లుతున్న గణపురం ఆనకట్ట....

## గణపురం ఆనకట్ట వద్దగంగామాతకు ప్రత్యేక పూజలు.: ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి...





కొల్చారం, జూలై 29: ( ప్రజా దర్బార్) ఎలినీనో ప్రభావంతో వర్షాలు సమృద్ధిగా కురవాయని ముందస్తు హెచ్చరికలు ఉన్నప్పటికీ రైతులకు ప్రభుత్వపరంగా ఆరుతడి పంటలపై అవగాహన కల్పించకుండా వరి నాట్లు వేసిన తర్వాత విత్తన మేళాలు నిర్వహిస్తున్నారని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతా లక్ష్మారెడ్డి విమర్శించారు. బుధవారం నాడు మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని చిన్నఘనపూర్ ఆనకట్ట వద్ద గంగా మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, రైతులు ఇప్పటివరకు సుమారు 60 శాతం వరి నాట్లు పూర్తి చేశారని, గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మిగిలిన నాట్లు కూడా పూర్తయ్యాయని తెలిపారు. ప్రస్తుతం రైతులు ఎంతో ఆనందంగా ఉన్నారని పేర్కొన్నారు. అలాగే, ఈ ఏడాది వర్షాలు తక్కువగా పడే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు ముందుగానే హెచ్చరిం చినప్పటికీ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభు త్వం కళ్లు తెరిచి రైతుల అవసరాలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని ఆమె కోరారు. ఇతర నియోజకవర్గాలలో మాదిరిగా నియోజకవర్గంలో యూరియా సైతం అందుబాటులో ఉండటం లేదన్నారు. రైతులు రోజుల తరబడి వేచి చూడాల్సి వస్తుందన్నారు. దీనికి తోడు యూరియా బస్తా తో పాటు నానో యూరియా బలవంతంగా రైతులకుఅంటగడుతున్నారన్నారు. దీంతో రైతులకు ఆర్థిక భారం పెరుగుతుందన్నారు. రైతులకు యాప్ బుకింగ్ ద్వారా కాకుండా ఎరువుల దుకాణాలు పిఎసిఎస్ ల ద్వారా యూరియా లభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు యాబన్నగారి రవితేజ రెడ్డి, సర్పంచులు దొడ్ల ఆంజనే యులు, దుబ్బగళ్ళ స్వామి, ఉప సర్పంచ్ ఆరే రవీందర్, బిఆర్ఎస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు రాంపల్లి గౌరీ శంకర్ గుప్తా, యువత విభాగం అధ్యక్షులు తూనికపల్లి సంతోష్ రావు, బిఆర్ఎస్ నాయకులు నరేందర్ రెడ్డి, ముత్యం గారి సంతోష్ కుమార్, చిట్యాల యాదయ్య, కొమ్ముల యాదగౌడ్, వేమారెడ్డి, సాయి ని సిద్ధిరాములు, ఏగొండ, సురేష్ గౌడ్, శ్యామ్ రావు,కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ జిల్లాలో 90 శాతం ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి



మెదక్ జిల్లా ప్రతినిధి, జూలై29:( ప్రజా దర్బార్ )జిల్లాలో ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతుందని, ఇప్పటి వరకు జిల్లాలో 90 శాతం పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ తెలిపారు .బుధవారం ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ పై రాష్ట్ర ఎలక్ట్రోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలో కొనసాగుతున్న ఎస్.ఐ. ఆర్ ప్రక్రియ పై సమీక్షనిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.జిల్లాలో మొత్తం ఓటర్లు 4,53140 కి గాను వంద శాతం ఎన్యూమరేషన్ ఫారాలు ఓటర్లకు అందజేసి ఇప్పటి వరకు 90 శాతం ఎన్యూమరేషన్ ఫారాలను 90 శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు వివరించారు. రెండు మూడు రోజుల్లో వందశాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియ సైతం చేపట్టడం జరుగుతుందన్నారు.ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో 1200 ఓట్ల కన్నా ఎక్కువ ఉన్న పోలింగ్ స్టేషన్లు, 2 కి.మీ. కంటే ఎక్కువ దూరం ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి రేషనలైజేషన్ చేస్తున్నట్లు తెలిపారు. డిజిటలైజేషన్ ప్రక్రియకు గడువు 4,5 రోజులు మాత్రమే మిగిలి ఉందని, వేగవంతంగా పూర్తి చేయాలని అదే సమయంలో తప్పులు లేకుండా ఉండేందుకు ఈ.ఆర్.ఓ లు ర్యాండం గా తనిఖీలు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఆర్డీఓ రమాదేవి, సెక్షన్ సూపరింటెండెంట్ గఫార్ , ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ పోస్టులకు భారీ స్పందన

## కొల్చారం, పాపన్నపేట మండలాల్లో 186 దరఖాస్తులు..



మెదక్ జిల్లా ప్రతినిధి,జూలై 29: (ప్రజా దర్బార్)మెదక్ పట్టణంలోని సిడిపిఓ కార్యాలయంలో ఖాళీగా ఉన్న అంగన్ వాడీ పోస్టులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించినట్లు మెదక్ సీడీపీఓ వెంకటరమణమ్మ తెలిపారు. మెదక్ ప్రాజెక్టు పరిధిలోని కొల్చారం, పాపన్నపేట మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా నిర్వహించిన వెరిఫికేషన్ కు అభ్యర్థుల నుంచి మంచి స్పందన లభించింది. మొత్తం 5 పోస్టులకు 186 మంది దరఖాస్తు చేయగా, 102 మంది వెరిఫికేషన్ కు హాజరైనట్లు సీడీపీఓ తెలిపారు. కొల్చారం మండలంలోని 2 పోస్టులకు 74 మంది దరఖాస్తు చేసుకోగా, 38 మంది హాజరయ్యారు. పాపన్నపేట మండలంలోని 3 పోస్టులకు 112 మంది దరఖాస్తు చేయగా, 64 మంది వెరిఫికేషన్ కు హాజరయ్యారు. భర్తీ జరుగుతున్న ఖాళీల్లో కొల్చారం మండలంలోని రంగంపేట--2, కొంగోడ్ సెంటర్--2, పాపన్నపేట మండలంలోని కొత్తపల్లి సెంటర్--2, అర్కెల సెంటర్--2, లక్ష్మీనగర్ తండా అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని సీడీపీఓ వెంకటరమణమ్మ వెల్లడించారు

# ఆవంచలో విత్తన మేళా



నర్సాపూర్, జూలై 29 ( ప్రజాదర్బార్ ) : నర్సాపూర్ మండల పరిధిలోని ఆవంచ గ్రామంలోని రైతువేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం విత్తన మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ విత్తనమేళాలో ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితులకు అనువైన కూరగాయల విత్తనాలతో పాటు మొక్కజొన్న, జొన్న ,కందులు, పెసర్లు పశుగ్రాసం విత్తనాలతో పాటు నానో యూరియా, నానో డి ఏ పి రైతులకు అందుబాటులో ఉంచారు. సందర్భంగా వ్యవసాయ మండల అధికారి దీపిక మాట్లాడుతూ.. రైతులకు అందుబాటులో నాణ్యమైన విత్తనాలు ఒకే చోట కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించాలనె ఉద్దేశంతో ప్రభుత్వం విత్తనమేళా కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ విత్తన మేళాలో రైతులు తమకు అవసరమైన విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టి ఆర్ వి కే శాస్త్రవేత్త సతీష్, గ్రామ సర్పంచ్ స్రవంతి కరుణాకర్, వ్యవసాయ విస్తరణ అధికారులు లావణ్య,తేజస్విని, రాజశేఖర్, దుర్గాప్రసాద్, విత్తన డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

# జీవో నెంబర్ 25 ను వెంటనే సవరించాలి



నర్సాపూర్, జూలై 29 ( ప్రజా దర్బార్ ) :ప్రాథమిక స్థాయి విద్యను బలోపేతనం చేసేలా జీవో నెంబర్ 25 ను వెంటనే సవరణ చేయాలని ఎస్టీటీయు నర్సాపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటిగ్రేటెడ్ టీచర్ ట్రైనింగ్ కార్యక్రమం టీ బ్రేక్ సమయంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నర్సాపూర్ యందు ఉపాధ్యాయులు ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్ జి టి యు మండల అధ్యక్షుడు గణేష్, ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్, ఉపాధ్యక్షులు కళారాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు రవికుమార్, మహిళా ఉపాధ్యాయులు రామేశ్వరి, అరుణ, అనిత, సునీత, హైమావతి ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ కౌన్సిలర్ల వార్డులపై వివక్ష ఎందుకు

# ఎనిమిది వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టాలి

**- సమస్యలు పరిష్కరించకుంటే ప్రజల పక్షాన పోరాటం - కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు వినతిపత్రం అందజేసిన మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మాదేవేందర్‌రెడ్డి**

మెదక్ జిల్లా ప్రతినిధి, జులై 29:( ప్రజా దర్బార్) మెదక్ పట్టణ అభివృద్ధిలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎనిమిది వార్డులపై వివక్ష చూపుతున్నారని మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మాదేవేందర్‌రెడ్డి ఆరోపించారు. ఈ విషయమై బుధవారం బీఆర్ఎస్ కౌన్సిలర్లతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు వినతిపత్రం అందజేశారు . బీఆర్ఎస్ కౌన్సిలర్ల వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ సందర్భంగా పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ. ప్రజల చేత ఎన్నికైన బీఆర్ఎస్ కౌన్సిలర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డుల్లో కేవలం రాజకీయ కారణాలతో అభివృద్ధి పనులు చేపట్టడం లేదని ఆరోపించారు. మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ ఎనిమిది వార్డుల్లో పనులు చేయడం లేదని, అధికారులకు కూడా పనులు చేపట్టవద్దని ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోందని పేర్కొన్నారు. ఈ తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి వచ్చిన నిధులతో మెదక్ పట్టణంలోని అన్ని వార్డుల్లో సమానంగా అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉండగా, బీఆర్ఎస్ కౌన్సిలర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎనిమిది వార్డుల్లో మాత్రం వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. టెండర్లు పూర్తయినప్పటికీ శిలాఫలకాలు ఏర్పాటు చేయడం లేదని, పనులను ప్రారంభించడం లేదని అన్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ప్రజల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఎనిమిది వార్డుల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్,ఎమ్మెల్యేపై ఉందని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని వార్డులకు సమానంగా అభివృద్ధి పనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ వెంటనే స్పందించి బీఆర్ఎస్ కౌన్సిలర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న 8 వార్డుల్లో పర్యటించి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని కోరారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ పట్టణ కన్వీనర్, కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు మాట్లాడుతూ. బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలుపొందిన ఎనిమిది మంది కౌన్సిలర్లపై వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి వచ్చిన నిధులతో వీధి దీపాలు, డ్రైనేజీలు, రహదారుల నిర్మాణం వంటి పనులు అన్ని వార్డుల్లో చేపట్టాల్సి ఉ



న్నప్పటికీ, తమ వార్డుల్లో పనులు జరగడం లేదని అన్నారు. టెండర్లు పూర్తయి రెండు, మూడు నెలలు గడుస్తున్నప్పటికీ శిలాఫలకాలు ఏర్పాటు చేయడం లేదని, పనులను ప్రారంభించడం లేదని పేర్కొన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే పట్టణ అభివృద్ధి దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. తమ వార్డుల్లో నివసిస్తున్న ప్రజలు కూడా మున్సిపాలిటీకి పన్నులు చెల్లిస్తున్నారని, వారికి మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత మున్సిపాలిటీపై ఉందని గుర్తు చేశారు. ఎనిమిది వార్డుల్లో వెంటనే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని మున్సిపల్ కమిషనర్‌ను డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. రాజకీయాలకు అతీతంగా అన్ని వార్డులను సమానంగా చూసి అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. ఇతర కౌన్సిలర్లు మాట్లాడుతూ.. తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు మున్సిపల్ కమిషనర్ స్వయంగా పర్యటించాలని డిమాండ్ చేశారు. ప్రజల చేత ఎన్నికైన ప్రజాప్రతినిధులుగా తమ వార్డుల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు జుబెర్ అహ్మద్,ఖాజా సోహెల్ మైనుద్దీన్,బట్టి ఉదయ్‌కుమార్, దీపక్‌కుమార్,మాయ, గంగామణి,మల్లేశం,స్వరూప, ఫాతిమా ఇమ్దాద్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ చట్టాల పట్ల ప్రాథమిక అవగాహన కలిగి ఉండాలి :నాగారం ఎస్సై ఎస్. చిరంజీవి




సూర్యాపేట జిల్లా/నాగారం, ప్రజాదర్బార్ (జూలై 29): ప్రతి ఒక్కరూ చట్టాల పట్ల ప్రాథమిక అవగాహన కలిగి ఉండాలని నాగారం ఎస్సై ఎస్. చిరంజీవి అన్నారు. నాగారం ఎక్స్ రోడ్ వద్ద బుధవారం స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో 'పోలీస్ ప్రజా భరోసా' అవగాహన సదస్సును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాగారం ఎస్ఐ హాజరై ప్రజలకు వివిధ చట్టాలు, సామాజికాంశాలు, రక్షణ పద్ధతులపై విస్తృత అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా మెలగాలని సూచించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం ద్వారా సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. మహిళలు, బాలికల రక్షణ కోసం పోలీస్ శాఖ ప్రవేశపెట్టిన 'పోలీస్ అక్క' సేవల గురించి తెలియచేశారు. ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు, నకిలీ కాల్స్, లింకుల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాల వల్ల జరిగే నష్టాలను వివరిస్తూ, యువత డ్రగ్స్ బారిన పడకుండా జాగ్రత్త వహించాలని హెచ్చరించారు. గ్రామాలు, వ్యాపార సముదాయాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ఎంతో కీలకమని, ఇవి నేరాల నియంత్రణకు, దొంగతనాల నివారణకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. బాధితులకు సత్వర పోలీస్ సేవలు అందించేందుకు ఉద్దేశించిన 'డోర్‌స్టెప్ ఎఫ్ఐఆర్' సేవలను ప్రజలు ఎలా ఉపయోగించుకోవాలో ఈ సందర్భంగా వివరించారు. స్థానిక పోలీస్ సిబ్బంది, వాహనదారులు, వ్యాపారస్థులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉపాధి హామీ సోషల్ ఆడిట్‌పై ఆరోపణలు.. పారదర్శకతపై అనుమానాలు




సూర్యాపేట జిల్లా/గరిడేపల్లి, ప్రజా దర్బార్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (వీ+చీ=జు+రా) సోషల్ ఆడిట్ నిర్వహణపై గరిడేపల్లి మండలంలో పలు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల భాగస్వామ్యంతో పారదర్శకంగా జరగాల్సిన సోషల్ ఆడిట్ ప్రక్రియను నామమాత్రంగా నిర్వహించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానికుల ఆరోపణల ప్రకారం, ఓపెన్ ఫోరం నిర్వహణకు ముందుగానే సంబంధిత డీఆర్పీ, ఎస్ఆర్పీలను ప్రభావితం చేసి, అనుకూల వాతావరణం ఏర్పరచుకున్న అనంతరం కార్యక్రమాన్ని నిర్వహించారని ఆరోపిస్తున్నారు. దీంతో సోషల్ ఆడిట్ లక్ష్యాలైన ప్రజల అభిప్రాయాల సేకరణ, ఉపాధి హామీ పనుల్లో జరిగిన లోపాలు, అవకతవకలపై చర్చలు పూర్తిస్థాయిలో జరగలేదని వారు పేర్కొంటున్నారు. అంతేకాకుండా, కొన్ని గ్రామ పంచాయతీలలో సోషల్ ఆడిట్‌లో భాగంగా నిర్వహించాల్సిన డోర్ టు డోర్ విజిట్‌లు కూడా సక్రమంగా చేపట్టలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పనుల పరిశీలన, కూలీల నుంచి సమాచారం సేకరణ జరగకుండానే ప్రక్రియను ముగించారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల సమక్షంలో విస్తృతంగా నిర్వహించాల్సిన ఓపెన్ ఫోరంను మండల కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించడం పలు అనుమానాలకు తావిస్తోందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఉపాధి హామీ పనుల్లో జరిగిన లోపాలు, నిధుల వినియోగం, కూలీల సమస్యలపై పూర్తిస్థాయిలో చర్చ జరగకుండా కార్యక్రమాన్ని ముగించారనే ఆరోపణలు చేస్తున్నారు. మండలంలోని 32 గ్రామ పంచాయతీల పరిధిలో సోషల్ ఆడిట్ సందర్భంగా పెనాల్టీ, రికవరీ రూపంలో మొత్తం రూ.2,28,778లు విధించినట్లు సమాచారం. ఇందులో అత్యధికంగా పొనుగోడు గ్రామ పంచాయతీకి రూ.30,698లు పెనాల్టీ, రికవరీ కింద నమోదైనట్లు తెలుస్తోంది. ప్రజాధన వినియోగంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడమే సోషల్ ఆడిట్ ప్రధాన ఉద్దేశమని, అలాంటి కీలక ప్రక్రియపై ఆరోపణలు రావడం ఆందోళనకరమని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, రాష్ట్ర సోషల్ ఆడిట్ యూనిట్, సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. బడ్జెట్ లేక ఓపెన్ ఫోరం మండల కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనట్లు అధికారులు తెలిపారు

# వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్...



మెదక్ జిల్లా ప్రతినిధి, జులై 29: (ప్రజా దర్బార్) జిల్లాలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ లోని ఛాంబర్ లో వర్షాల అప్రమత్తతపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ. భారత వాతావరణ శాఖ హెచ్చరికలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పాడు బడిన ఇండ్లు, శిథిలావస్థలో ఉన్న భవనాలు, కమ్యూనిటీ హాళ్లను పరిశీలించి, ఎవరైనా అందులో నివసిస్తుంటే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. వర్షాల సమయంలో వాగులు, వంకలు, చెరువులు, కాలువలు పొంగిపొర్లే అవకాశం ఉన్నందున వాటిని దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించరాదని సూచించారు. వరద నీటిలో ప్రయాణించడం ప్రాణాపాయానికి దారితీసే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితులు మినహా భారీ వర్షాల సమయంలో బయటకు వెళ్లకుండా ఉండాలని, ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ తీగలు తెగి పడిన ప్రాంతాలకు వెళ్లకుండా ఉండాలని, అలాంటి సంఘటనలు కనిపిస్తే వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. తక్కువ ఎత్తులో ఉన్న ప్రాంతాల ప్రజలు నీటి మట్టాన్ని నిరంతరం గమనిస్తూ, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. రైతులు తమ వ్యవసాయ పరికరాలు, ఎరువులు, విత్తనాలను సురక్షిత ప్రదేశాల్లో నిల్వ చేసుకోవాలని సూచించారు. వాహనదారులు భారీ వర్షాల సమయంలో అధిక వేగంతో ప్రయాణించకుండా జాగ్రత్త వహించాలని, నీరు నిలిచిన రహదారులపై ప్రయాణించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. జిల్లా యంత్రాంగం అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేసి సహాయక చర్యలకు సిద్ధంగా ఉంచిందని, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు ప్రత్యేక బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ప్రజలు వదంతులను నమ్మకుండా అధికారిక సమాచారం మాత్రమే విశ్వసించాలని, అత్యవసర పరిస్థితుల్లో సంబంధిత శాఖల అధికారులనుసంప్రదించాలని జిల్లా యంత్రాంగం విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతోనే వర్షాల ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కోగలమని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ తమ కుటుంబ సభ్యుల భద్రతకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, ఎంపీడీవోలు,జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

## గూడూరు శ్రీ గురుపీఠం లో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

శివ్వంపేట, జూలై 29 ( ప్రజా దర్బార్ ) :మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని గూడూరు గ్రామంలో గురు పౌర్ణమి సందర్భంగా శ్రీ దత్తాత్రేయ గురుపీఠం, శ్రీ సాయిబాబా దేవాలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్పర్సన్ సుహాసిని రెడ్డి,పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ గురుపీఠం ఫౌండర్-చైర్మన్ జిన్నారం పెద్దగోని శివకుమార్ గౌడ్,రమాదేవి ఆధ్వర్యంలో వేదపండితులు వామన శర్మ, ఆలయ పూజారులు హర్ష శర్మ, నటరాజ శర్మ వేదమంత్రోచ్చారణల మధ్య గురుపౌర్ణమి విశేష పూజలను నిర్వహించారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, ఆలయ అర్చకుల నుంచి ఆశీర్వాదాలు స్వీకరించి రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమానికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు, పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై గురుపౌర్ణమి వేడుకల్లో పాల్గొన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా శివ్వంపేట కు చెందిన ఎడ్ల



రమణారెడ్డి, ఎడ్ల దయానంద రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో వందలాది మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించి గురుపౌర్ణమి వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు.

## తుంగతుర్తిలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేత



సూర్యాపేట జిల్లా/తుంగతుర్తి, (ప్రజాదర్బార్):నియోజకవర్గ కేంద్రంలో ఫైర్ స్టేషన్ ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో డిప్యూటీ తహశీల్దార్ కంఠమయ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గనికి కేంద్ర బిందువుగా ఉన్న తుంగతుర్తిలో నూతనంగా మంజూరైన ఫైర్ స్టేషన్ ను ఏర్పాటు చేయడం వల్ల ఐదు మండలాలకు తిరుమలగిరి, నాగారం, జాజిరెడ్డిగూడెం, మద్దిరాల, నూతనకల్ ప్రాంతాలకు సౌకర్యార్థంగా ఉంటుందని కోరారు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే మందుల సామెల్ మరియు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ స్పందించి తుంగతుర్తిలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు కోసం కృషి చేయాలని కోరారు. లేనిపక్షంలో అఖిలపక్ష సంఘాల ఆధ్వర్యంలో భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు తడకమళ్ళ రవికుమార్, ఉప్పుల రాంబాబు, కొండ రాజు, గునిగంటి సంతోష్, బొంకూర్ మల్లేష్ బొజ్జ సాయికిరణ్, కొండగడుపుల వెంకటేష్, తడకమల్ల మల్లికార్జున్, బొంకురి మధు, బొంకూరి వెంకటేష్,తడకమళ్ళ అనిల్,బొంకూరి సాయి, తడకమల్ల మధు,కాసర్ల రాజశేఖర్,కొండ మధు,కాసర్ల పవన్ తదితరులు పాల్గొన్నారు.

## అర్వపల్లి సాయిబాబా దేవాలయంలో గురు పౌర్ణమి వేడుకలు



సూర్యాపేట జిల్లా /జాజిరెడ్డిగూడెం, జులై 29, (ప్రజాదర్బార్): గురు పౌర్ణమి వేడుకల సందర్భంగా అర్వపల్లిలోని శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ పవిత్ర సందర్భాన్ని పురస్కరించుకుని ఆలయంలో బాబావారి కాకడ హారతి, పంచామృత అభిషేకం, గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవచనం, మండపారాధన, గురుపూజతో పాటు లక్ష్మీ గణపతి హోమం, దత్త హోమం, పూర్ణాహుతి మరియు పల్లకి సేవలు ఘనంగా నిర్వహించినట్లు ఆలయ అర్చకులు గిరి సాయిరాం తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కడియం రామచంద్రయ్య మాట్లాడుతూ... "సబ్ కో మాలిక్ ఏక్ హై" నినాదానికి తగినట్లుగా షిరిడి సాయిబాబా భక్తులందరికీ వివిధ రూపాల్లో సహాయం అందిస్తున్నారని, కొలిచిన వారికి కొలిచిన రూపంలో కొంగు బంగారమై నిలుస్తున్నారని పేర్కొన్నారు. మధ్యాహ్న హారతి అనంతరం భక్తులందరికీ మహా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టి భక్తిభావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు శ్రీనివాసరావు, జనరల్ సెక్రెటరీ కిషోర్ బాబు, ఉపాధ్యక్షులు ఉపేందర్, మారపాక రాములు తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు

## చిలుకూరులో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు...



సూర్యాపేట జిల్లా/ చిలుకూరు, జూలై 29 (ప్రజా దర్బార్) : చిలుకూరు మండలంలో కాలవొ డ్డు అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో గురు పౌర్ణమి సందర్భంగా బుధవారం సాయిబాబా కు ప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వహించారు. సాయి నామాలతో భజనలు చేసి, సాయి సంకీర్తనలను ఆలకించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి చిలుకూరుకు చెందిన స్వామి సావిత్రమ్మ కుమారులు, స్వామి వెంకటేశ్వర్లునీరజ స్వామి శ్రీనివాస్ లక్ష్మి , స్వామి శ్రీహరి ఇందుకుమారి దంపతులు కుటుంబ సభ్యులు సందీప్ సౌజన్య హరిదీప్ వాసవి సాయి ఆర్థిక సాయం అందజేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దేవల కమిటీ అధ్యక్షులు గుడారు వెంకటేశ్వర్లు ఆలయ అర్చకులు చించాపట్టణం రజినీకాంత్ ఆచార్య, గొప్ప సమ్మిరెడ్డి మాదారపు లక్ష్మయ్య, కట్టెకోల చంద్రయ్య, కొడాలి శ్రీను రోజా, భవాని, లక్ష్మీ, సావిత్రి, మంగమ్మ ,పద్మ, లావణ్య, సాయి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల భవిష్యత్తు తరగతి గదిలోనే నిర్మించబడుతుంది



సూర్యాపేట జిల్లా/ కోదాడ, జులై 29 (ప్రజాదర్బార్): పిల్లల భవిష్యత్తు తరగతి గదిలోనే నిర్మించబడుతుందని గుడిబండ సర్పంచ్ మందుల నాగయ్య అన్నారు.బుధవారం గుడిబండ గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో బాలసభ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ మందుల నాగయ్య అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మందుల నాగయ్య మాట్లాడుతూ విద్యార్థుల జీవితాన్ని తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకం అని ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలి అని అన్నారు.బాలల హక్కులు, విద్య యొక్క ప్రాముఖ్యత, పరిశుభ్రత, క్రమశిక్షణ, నైతిక విలువలపై అవగాహన కల్పిస్తూ బాలసభ విజయవంతంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు చంద్రకళ, గ్రామ కార్యదర్శి అవినాష్ రెడ్డి , వైస్ ప్రెసిడెంట్ జయసింహా రెడ్డి , వార్డ్ సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు,ఆశా వర్కర్లు,విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## కొండగట్టు ఆంజనేయస్వామి గిరిప్రదక్షిణలో పాల్గొన్న మంత్రులు, విప్, ఎమ్మెల్యే



జగిత్యాల ప్రతినిధి /కొండగట్టు/, జూలై 29 (ప్రజా దర్బార్):గురు వ్యాస పౌర్ణమి సందర్భంగా జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన గిరిప్రదక్షిణలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొన్నారు. తెల్లవారుజాము నుంచే వర్షం కురుస్తున్నప్పటికీ దానిని లెక్కచేయకుండా మంత్రులు, ప్రజాప్రతినిధులు భక్తులతో కలిసి భక్తిశ్రద్ధలతో గిరిప్రదక్షిణ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శ్రీ ఆంజనేయస్వామి అనుగ్రహం కలగాలని ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు తెలిపారు.

## వరి నాట్ల జోరు.. ఊపందుకుంది చూడు..

మొగుళ్ళపల్లి. జూలై 29.( ప్రజా దర్బార్ ) ప్రతినిధి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మొగుళ్లపల్లి మండలంలోని వివిధ గ్రామాలలో వరి నాట్లు ఊపందుకు ఉన్నాయి. ఎలినినో కారణంగా ప్రస్తుతం ఖరీఫ్ లో వర్షాలు లేక ఆకాశం వైపు చూస్తున్న అన్న దాతలకు ఈ వర్షం వరంగా మారింది.ఈ వానలు పంటలకు ప్రాణం పోస్తున్నాయి. జయ శశీకర్ జిల్లా మొగుళ్లపల్లి మండలం ఇస్సిపేట లో కూలీలతో వరి నాట్లు వేస్తున్న దృశ్యశీ బుధవారం. ప్రజా దర్బార్. కంట పడింది



## వరి పొలాల్లో ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలు -- అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి



సూర్యాపేట జిల్లా/మేళ్లచెరువు,జూలై 29 (ప్రజాదర్బార్): మేళ్లచెరువు మండలంలోని వ్యవసాయ పొలాల మీదుగా వెళ్లే విద్యుత్ తీగలు అత్యంత ప్రమాదకరంగా కిందకు వంగి రైతుల చేతులకు తగిలే స్థాయిలో ఉండడంతో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. వ్యవసాయ పనుల కోసం పొలాల్లోకి వెళ్లే రైతులు, కూలీలు నిత్యం ప్రాణభయంతో పని చేయాల్సిన పరిస్థితి నెలకొంది. స్థానిక రైతులు పలుమార్లు విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వరి సాగు పనులు జరుగుతున్న నేపథ్యంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయం నెలకొంది. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కిందకు వంగిన విద్యుత్ తీగలను సురక్షితమైన ఎత్తుకు బిగించి, అవసరమైతే కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి ప్రమాదాన్ని నివారించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే దానికి పూర్తి బాధ్యత విద్యుత్ శాఖ అధికారులదేనని రైతులు హెచ్చరించారు. రైతుల ప్రాణాలను కాపాడేలా అత్యవసర చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## చిన్న వయస్సు నుండే పిల్లలకు క్రీడలపై మక్కువ ఉండేలా ప్రోత్సహించాలి

### రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు జెట్టి వీరారెడ్డి

సూర్యాపేట జిల్లా/మునగాల, జూలై 29 (ప్రజాదర్బార్): అంగన్వాడీ కేంద్రంలో చిన్న వయసు నుండే క్రీడలపై మక్కువ ఉండేలా పిల్లలను ప్రోత్సహించాలని రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు జెట్టి వీరారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని బరాఖత్ గూడెం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్వాడీ సెంటర్ కు క్యారమ్, చెస్, క్రికెట్ వంటి ఆట సామాగ్రిని ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంగన్వాడీ లో చదువుతో పాటు క్రీడలు ఎంతో శారీరక దృఢత్వంతో పాటు ఉల్లాసాన్ని ఇస్తాయని, అందుకు విద్యార్థులు క్రీడా సామాగ్రిని సద్వినియోగం చేసుకునే విధంగా అంగన్వాడి టీచర్లు ఆయాల పిల్లలను ప్రోత్సహించాలని అన్నారు. దాతల సహకారంతో అంగన్వాడీ భవనంలోని పలు వసతులు



కల్పించాలని అంగన్వాడీ టీచర్ కాలె సునిత కోరారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు బోళ్ల ప్రతాపరెడ్డి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి. దీపాదేవి, ఉపాధ్యాయులు, ఆయా ఇందిరమ్మ పాల్గొన్నారు.

## మానవత్వానికి, చిరస్మరణీయమైన స్నేహానికి నిలువెత్తు నిదర్శనం.

ప్రజా దర్బార్ చింతకాని జులై 29....(ప్రతినిధి) ఖమ్మం వాస్తవ్యులు సీతాపతి తమ చిన్ననాటి ఆత్మీయ స్నేహితుడు చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన జానకిరాములు కి అపూర్వమైన కానుకను అందించి నిజమైన స్నేహానికి కొత్త అర్థాన్ని చాటిచెప్పారు.జానకిరాములు కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవాలనే గొప్ప ఆలోచనతో, వారి జీవనోపాధికి ఉపయోగపడేలా ఒక లక్ష రూపాయల విలువైన పాడి గేదెను ప్రేమాభిమానాలకు గుర్తుగా బహుమతిగా అందజేశారు.ఈ బహుమతి కేవలం ఒక పాడి గేదె మాత్రమే కాదు దశాబ్దాలుగా కొనసాగుతున్న విశ్వాసం, ఆప్యాయత, ఆత్మీయత, చెదరని స్నేహబంధానికి ప్రతీక . నేటి స్వార్థపూరిత సమాజంలో స్నేహితుడి అభ్యున్నతిని కోరుకుంటూ, అతని కుటుంబానికి శాశ్వతంగా ఉపయోగపడే కానుకను అందించడం నిజంగా ఆదర్శప్రాయమైన విషయం. ఈ గేదెను లిపాతర్లపాడు సర్పంచ్ భర్త వొబినబోయిన అచ్చయ్య చేతుల మీదుగా జానకిరాములు కి అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు సామినేని అప్పారావు



, మండేపూడి కృష్ణప్రసాద్, సీతాపతి గొప్ప మనసును, వారి చిరస్మరణీయ స్నేహబంధాన్ని హృదయపూర్వకంగా అభినందించారు. స్నేహం అంటే మాటల్లో చెప్పేది కాదు అవసరమైన సమయంలో అండగా నిలిచి, జీవితాలను నిలబెట్టేది. అలాంటి స్నేహమే నిజమైన స్నేహం. సీతాపతి ,ఇంజం జానకిరాములు ల స్నేహబంధం చిరకాలం ఇలాగే కొనసాగాలని, వారి స్నేహం మరెందరికో ఆదర్శంగా నిలవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిద్దాం.

## జూరాల కుడి కాలువ కు నీటిని విడుదల చేసినఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

గద్వాల క్రైమ్ జూలై 29 (ప్రజా దర్బార్): గద్వాల నియోజకవర్గం ధరూర్ మండల పరిధిలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు కుడికాలువ కు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ప్రజాప్రతినిధులతో కలిసి కృష్ణమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి సాగు నీరు విడుదల చేశారు..ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ నీళ్లు విడుదల చేయడానికి సహకరించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రివర్యులు ఉత్తంకుమార్ రెడ్డి, జిల్లా మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు,వాకిటి శ్రీహరి మరియు ఉమ్మడి పాలమూరు జిల్లా సహచర ఎమ్మెల్యేలకు గద్వాల నియోజకవర్గ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు..ఎలినోవా ప్రవాహంతో ఎక్కువ వర్షం పాత నమోదు కాలేదు వర్షం లేకపోవడం వల్ల నీళ్ల ఇబ్బంది ఉ ందని అయినా కూడా ప్రభుత్వం సీఎం ఉమ్మడి జిల్లా ప్రాంత వాసి కాబట్టి రైతుల కష్టాలు తెలిసిన నాయకుడు కాబట్టి రైతులకు పంటలు వేసుకునే నాట్లు వేసుకునే సమయంలో కొంత మేరకు సాగునీటి విడుదల చేయడం జరుగుతుందని, 30 లక్షల ఎకరాలకు నీళ్ల అందించడమైదన్నారు..రైతులు నీటిని వృధా చేయకుండా వినియోగించుకోవాలని,రెండు పంటలకు ఉపయోగించుకోవాలని దశలవారీగా నీటిని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.నారాయణపూర్ డ్యామ్ నుండి డ్యామ్ గేట్లు ఎత్తి దిగువన జూరాలకు నీటిని విడుదల చేయనున్నారు. రైతులు వరి పంటలు వేయకుండా నీటిని తక్కువగా ఉపయోగపడే పంటలను వేయాలని శాస్త్రవేత్తలు సూచించే పంటలను వెయ్యాలని,అదేవిధంగా అగ్రికల్చర్ అధికారులు సూచించే పంటలను వేసి ఆకుకూరలు పండ్లు కూరగాయలు వంటి పంటలను పండించాలని అప్పుడే నీటి ఎక్కువ



వృధా కాకుండా సరిపడా నీటిని ఉపయోగించుకోవాలన్నారు.. రైతులు కూడా వ్యవసాయ అధికారులకు సహకరించాలని, అప్పుడే నీళ్ల ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు..ప్రభుత్వాలు వచ్చిన రైతుల సంక్షేమం కోసం కృషి చేయడం జరుగుతుందని.కావున రైతులు ఇబ్బందులు అపోహాలు చెందవద్దండి అన్ని విధాలుగా ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కృషి చేయడం జరుగుతుందని తెలిపారు.నడిగడ్డ లో ప్రతి ఎకరాకు సాగునీరందిస్తామన్నారు. జూరాలకు వస్తున్న వరద నీటిని దృష్టిలో ఉంచుకుని నెట్టెంపాడు ఎత్తిపోతల ద్వారా ర్యాలంపాడు, గూడెందొడ్డి పంపు మోటార్లు ఇప్పటికే పంపింగ్ చేశామని, రిజర్వాయర్ల ద్వార కాలువలకు సాగు నీరు వదలడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల జయలక్ష్మి నర్సింహులు యాదవ్,మార్కెట్ యార్డ్ చైర్మన్ హన్మంతు,ఆయా గ్రామాలప్రజాప్ర తినిధులు, జిల్లా సీనియర్ నాయకులు, నాయకులు రైతులు, అధికారులు, కార్యకర్తలు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో వాహనదారులు,ప్రజలు అప్రమత్తంగా ఉండాలి సీఐ

పరకాల ప్రజాదర్బార్ జులై 29:ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా పరకాల పట్టణ మరియు మండల పరిధిలోని గ్రామాల ప్రజలు,వాహనదారులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని పరకాల పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ) క్రాంతి కుమార్ సూచించారు.వర్షాల సమయంలో ప్రమాదాల నివారణకు ప్రజలు ప్రాథమిక భద్రతా నియమాలను పాటించాలని ఆయన కోరారు.వర్షంలో రోడ్లు జారుడుగా మారే ప్రమాదం ఉన్నందున వాహనాలను నెమ్మదిగా నడపాలి.

బ్రేకులు,మలుపులు, వాహనాలు,బైకులకు అకస్మాత్తుగా బ్రేకులు వేయవద్దు.వేగంగా మలుపులు తిరగడం ప్రమాదకరం.నీరు నిలిచిన రహదారులపై వాహనాలు నడపవద్దు. నీటిలో కనిపించని గుంతల పట్ల అప్రమత్తంగా ఉండాలి.వర్షం పడుతున్న సమయంలో చెట్ల కింద నిలబడవద్దు.పాత భవనాలు,ప్రహరీ గోడలకు దూరంగా ఉండాలి.వాహనాలు నడిపేటప్పుడు కారులో ఉన్నవారు సీట్ బెల్ట్,ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి.

వర్షం పడుతున్న సమయంలో వాహనం నడిపేటప్పుడు హెడ్‌లైట్లు ఆన్ చేసి ఉంచాలి.వాహనం నడుపుతున్నప్పుడు మొబైల్ ఫోన్ ఉపయోగించకూడదు.వర్షం కురిసే సమయంలో మత్స్యకారులు వాగులు,చెరువులకు చేపలు పట్టడానికి వెళ్ళవద్దని స్పష్టం చేశారు.తెగిపడిన విద్యుత్ తీగలను ఎట్టి పరిస్థితుల్లోనూ తాకవద్దని,వర్షపు నీటిలో విద్యుత్ ప్రసరించే ప్రమాదం ఉన్నందున వెంటనే సంబంధిత అధికారులకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.ప్రజలందరూ సురక్షితంగా ఇళ్లకు చేరే విధంగా వాహనదారులు తగు జాగ్రత్తలు పాటించాలని సీఐ క్రాంతి కుమార్ పిలుపునిచ్చారు.

## వర్షాకాలంలో గొర్రెలు మేకల ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరి డాక్టర్ అంతటి అనిల్ కుమార్



సూర్యాపేట జిల్లా/జాజిరెడ్డిగూడెం, జులై 29 (ప్రజాదర్బార్): జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని అర్వపల్లి లో వెటర్నరీ డాక్టర్ అంతటి అనిల్ కుమార్ వర్షాకాలంలో వచ్చే వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు ఎలా తీసుకోవాలో తెలియజేస్తున్నారు. అదేవిధంగా గొర్రెలు సున్నితమైన నెమరువేసే జంతువులు వీటికి సీజనల్ గా కొన్ని ప్రమాదకర వ్యాధులు వస్తుంటాయి.నిర్లక్ష్యం వహిస్తే అధిక నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. కాబట్టి సీజనల్ వ్యాధుల ముప్పును తగ్గించుకోవడానికి మందలోని అన్ని గొర్రెలకు సకాలంలో టీకా చెప్పినట్లయితే సీజనల్ గా వచ్చే వ్యాధులను సమర్థవంతంగా ఎదుర్కొనవచ్చు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిలంచర్ల విద్యాసాగర్, జశ్రీశీ పద్మ,గోపాలమిత్రలు, పెంపకం దారులు పాల్గొన్నారు.

## కాళేశ్వరంలో గురు పౌర్ణమి వేడుకలు



కాళేశ్వరం, జూలై 29, ప్రజాదర్బార్:గురు పౌర్ణమి సందర్భంగా కాళేశ్వరంలోని శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య స్వామివారికి పాలు, పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక అలంకరణలు చేసి, హారతి ఇచ్చారు. ఈ పూజా కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

## జిపి కార్యాలయానికి తాళం



మొగులపల్లి. జూలై 29( ప్రజాదర్బార్ ) మండలంలోని వేములపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయానికి తాళం వేసిన మాజీ సర్పంచ్ బెల్లంకొండ మాధవి శ్యాంసుందర్ రెడ్డి. పెండింగ్ బిల్లులు చెల్లించాలని కార్యదర్శిని మూడు నెలలుగా కోరినప్పటికీ స్పందించకపోవడంతో ఆయనను గదిలో ఉంచి కార్యాలయానికి తాళం వేసినట్టు తెలిపారు. విషయం తెలుసుకున్న ప్రస్తుత సర్పంచ్. ఆ రెల్లి రమేష్ అక్కడికి చేరుకొని మాజీ సర్పంచ్ దంపతులతో మాట్లాడారు. జిల్లా, మండల అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో తాళం తీశారు

## జలసిరి అవగాహన కార్యక్రమాలు

. ఆమనగల్ జులై 28 ప్రజా దర్బార్. రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండలంలోని సింగంపల్లి గ్రామపంచాయతీలో జలసిరి అవగాహన కార్యక్రమాలు నీటిని పొదుపుగా వాడాలని పామ్ పాండ్ నిర్మించుకోవాలని ఇంకోడు గుంతలు నిర్మించుకోవాలని ఊట కుంటలు ప్రతి ఇంటి ముందు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకొని నీటిని వృధా కాకుండా ఇంకుడు గుంతల్లో నిలువ ఉండే నీటిని సంరక్షించుకొని చెట్లు పెంచుకొని అవగాహన కార్యక్రమంలో గ్రామ సభలో చైర్మన్ తీర్మాన కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ వినోద. గ్రామపంచాయతీ సభ్యులు అయోధ్య ఉపసర్పంచ్ రవీంద్ర కాటమరాజు మంజుల తానేష చందు ఏవో ప్రభావతి ప్రభాకర్ వంశీ గ్రామ ప్రజలు కార్యక్రమంలో పాల్గొన్నారు కార్యక్రమం అనంతరం గ్రామ సర్పంచ్ ఆడపిల్లలకు బీద పెళ్లి అయిన వారికి చనిపోయిన వారికి పారిపోషకం 5016. ఇవ్వడం జరుగుతున్నదని గ్రామ సర్పంచ్ ప్రజాదర్బార్ విలేఖరికి తెలియజేశారు కార్యక్రమంలో ఆ గ్రామంలో ఈరోజు పుట్టిన ఆడబిడ్డకు 5 016లు. అందజేశారు శిల్ప నాగేష్. దంపతులకు అందజేశారు కార్యక్రమం అనంతరం ప్రాథమిక పాఠశాలలో స్పెషల్ అధికారి వినోద్ రెడ్డి గ్రామ సెక్రెటరీ కాటమరాజు గ్రామ ఏఈఓప్రభావతి. ఫీల్డ్ అసిస్టెంట్ వినోద్ రెడ్డి ప్రభుత్వం కార్యక్రమాలు గ్రామ మహిళా సంఘాలకు అప్పచెప్పడం జరిగినదని కార్యక్రమంలో వెలుగు సిసి మహేందర్ గ్రామ సంఘం నాయకురాలు జలసిరి కార్యక్రమంలో పాల్గొన్నారు ప్రాథమిక పాఠశాలలో ఇంకుడు గుంత ముగ్గు వేయడం జరిగినది వృధాగా నీరు పోకుండా ఆ నీటిని ఆ ఇంకుడి గుంతలో పోయేటట్లు ఒక పైపు వేసి భూగర్భ జలాలను నిల్వ ఉంచుకొని నీటిని వృధా చేయరాదని స్పెషల్ అధికారి వినోద్ రెడ్డి గ్రామసభలో సభ్యులకు తెలియజేశారు

# కామారెడ్డి జిల్లాలో ఆకస్మికంగా పర్యటించిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు డా. రవీందర్ నాయక

**- సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు కార్యాచరణపై అధికారులకు కీలక ఆదేశాలు**



**కామారెడ్డి, ప్రజాదర్బార్ జూలై 29:** జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యలు, ఆరోగ్య శాఖ సంసిద్ధతతో పాటు ఇతర ప్రజారోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్షించేందుకు రాష్ట్ర వైద్య మరియు ఆరోగ్య శాఖ సంచాలకులు డా. రవీందర్ నాయక్ బుధవారం కామారెడ్డి జిల్లాను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా భిక్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన ఆయన, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. చికిత్స కోసం వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవల పనితీరుపై వైద్యాధికారి డా. ఏమీమాను అభినందిస్తూ ప్రశంసించారు. తదుపరి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ కార్యాలయంలో ప్రోగ్రాం ఆఫీసర్లు, జిల్లాలోని వైద్యాధికారు లతో జూమ్ సమావేశం నిర్వహించి సమగ్ర సమీక్ష చేపట్టారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక, వ్యాధుల పర్యవేక్షణ, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు, వైద్య సేవల మరింత బలోపేతంపై అధికారులకు దిశానిర్దేశం చేస్తూ తగిన ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. వెంకటి, ప్రోగ్రాం ఆఫీసర్లు డా. రాజు, డా. వెంకటస్వామి, డా. రోహిత్, డా. ప్రదీప్, డా. నర్సింగ్ చౌహాన్, ఏఎంఓ శ్రీనివాస్ రెడ్డి, డెమో మహేందర్ రెడ్డి, హెచ్ఈ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలి

**- బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పోతుగంటి భరత్ ప్రసాద్**



**నాగర్ కర్నూల్ జిల్లా ప్రత్యేక ప్రతినిధి జూలై 29 (ప్రజాదర్బార్)** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఓటర్ల వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోతుగంటి భరత్ ప్రసాద్ అధికారులకు సూచించారు. నాగర్‌కర్నూల్ పట్టణంలోని నాగనూలు, దేశి ఇటిక్యాల్ బూత్‌లను సందర్శించిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోతుగంటి భరత్ ప్రసాద్ ఎస్ఐఆర్ కార్యక్రమం అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్ఏలు, బూత్ కార్యకర్తలతో పోతుగంటి భరత్ ప్రసాద్ మాట్లాడుతూ బూత్ బలోపేతమే భారతీయ జనతా పార్టీ విజయానికి బలమైన పునాది అని అన్నారు. పోలింగ్ బూత్ లో ప్రతి అర్హుడి ఓటు నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటు హక్కు ప్రతిపౌరుడికి అత్యంత విలువైనదని, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు ఎంత ముఖ్యమో ఓటరు జాబితాలో పేరు ఉండడం అంతే ముఖ్యమని రాష్ట్ర కార్యదర్శి పోతుగంటి భరత్ ప్రసాద్ పేర్కొన్నారు. ఓటర్ల ప్రక్రియ, కార్యక్రమం పురోగతి, ఓటరు వివరాల పరిశీలన, క్షేత్రస్థాయి పరిస్థితులపై బూత్ లెవెల్ ఏజెంట్లను వివరాలు అడిగి ఆయన తెలుసుకున్నారు. ప్రతి బూత్‌లో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా పూర్తి చేయాలని కార్యకర్తలకు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోతుగంటి భరత్ ప్రసాద్ సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ప్రమోద్ కుమార్ గారు మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల సత్తా

**- అండర్-20, అండర్-18 విభాగాల్లో గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ పతకాలతో ప్రతిభ చాటిన క్రీడాకారిణులు**



**సదాశివనగర్, । ప్రజాదర్బార్ ప్రతినిధి ।జూలై 29:** కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం మర్కల్ గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీల్లో విశేష ప్రతిభ కనబర్చి పతకాలు సాధించి కళాశాలకు పేరు తీసుకొచ్చారు. ఈ నెల 27న కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీల్లో కళాశాలకు చెందిన విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని అత్యుత్తమ ప్రదర్శన కనబర్చారు. జావెలిన్ త్రో ఉమెన్స్ విభాగంలో ఎం. అమృత గోల్డ్ మెడల్ సాధించగా, అండర్-20 విభాగంలో బి. నవ్య గోల్డ్ మెడల్ కైవసం చేసుకుంది. అండర్-18 విభాగంలో కే. స్వప్న సిల్వర్ మెడల్, ఎం. మహేశ్వరి బ్రాంజ్ మెడల్ సాధించి కళాశాల ప్రతిష్ఠను మరింత పెంచారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. శోభారాణి విజేత విద్యార్థినులను అభినందిస్తూ, క్రీడల్లో సాధించిన ఈ విజయాన్ని భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లోనూ కొనసాగించాలని ఆకాంక్షించారు. వైస్ ప్రిన్సిపాల్ ఎస్. కృష్ణవేణి, ఫిజికల్ డైరెక్టర్ రమాదేవి, అధ్యాపక బృందం విద్యార్థినులను అభినందించి వారి కృషిని ప్రశంసించారు.

# భక్తిశ్రద్ధలతో శ్రీ దత్తసాయి ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలు



**దండేపల్లి,జూలై 29(ప్రజా దర్బార్) :** దండేపల్లి మండలంగూడెం గ్రామంలోని శ్రీ దత్తసాయి ఆలయంలో గురు పూర్ణిమ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆధ్యాత్మిక కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.?ఉదయం నుంచే వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ శ్రీ దత్తాత్రేయ స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ దత్తాత్రేయ హోమం, స్వామివారికి నేత్రపర్వంగా పుష్పాలంకరణ, పూర్ణాహుతి మరియు మహా హారతి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా పూర్తి చేశారు. అనంతరం ఆలయానికి తరలివచ్చిన భక్తులకు తీర్థ ప్రసాద వితరణతో పాటు మహా అన్నప్రసాద వితరణ గావించారు.?గురు-శిష్యుల పవిత్ర అనుబంధానికి ప్రతిరూపంగా, ఎంతోమంది శిష్యులను తీర్చిదిద్ది ఆధ్యాత్మిక మార్గంలో నడిపిస్తున్న ఆలయ వ్యవస్థాపకుడు చక్రవర్తుల పురుషోత్తమాచార్యుల వారిని శిష్య బృందం ఘనంగా సన్మానించి తమ గురుభక్తిని చాటుకున్నారు.?ఈ పూజా కార్యక్రమాల్లో వేద పండితులు రజినేష్ శర్మ, ఆలయ పూజారి హేమ్రాజ్ త్రిపాఠిలతో పాటు ఆలయ కమిటీ సభ్యులు బోనగిరి కిషన్, ఓజ్జల ప్రకాష్, దాస గంగన్న, తండబోయిన శ్రీకాంత్, చింతల శ్రీనివాస్, అక్కల శకుంతల-మల్లేశం, సత్యనారాయణ రెడ్డి, కరుణాకర్ రావు పాల్గొన్నారు.ఫోటో రైటప్ : హోమము నిర్వహిస్తున్న వేద పండితులు.ఫోటో రైటప్ :గురువును సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు.

# భారీ వర్షాలతో ఉప్పొంగుతున్న వాగులు. -ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు






**దండేపల్లి,జూలై 29(ప్రజా దర్బార్) :** దండేపల్లి మండలంలో గత రాత్రి నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జలదిగ్బంధ వాతావరణం నెలకొంది. నిరంతరం పడుతున్న వానలతో మండలంలోని వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తుండగా, పలు గ్రామాల్లో నీరు ఇళ్లలోకి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.?రాత్రికి రాత్రే వర్ష తీవ్రత పెరగడంతో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. నీరు ముంచెత్తడంతో కొన్ని గ్రామాల్లో కాజ్‌వేలు, వంతెనల పైనుంచి ప్రవాహం కొనసాగుతోంది.?లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ఇళ్లలోకి వర్షపు నీరు వచ్చి చేరింది. ఉప్పొంగుతున్న వాగులు, వంకల వద్దకు ఎవరూ వెళ్లవద్దని, ముఖ్యంగా పిల్లలు, పశువుల కాపరులు జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. అత్యవసరం ఐతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాకూడదని సూచించారు.ఫోటో రైటప్ : ఇంటిలోనికి చేరి వర్షపు నీరు.ఫోటో : రోడ్డు పై ప్రవహిస్తున్న వర్షపు నీరు.ఫోటో రైటప్ : ఉధృతంగా ప్రవహిస్తున్న దండేపల్లి వాగు.ఫోటో రైటప్ : పంట పొలాల లో చేరిన వర్షపు నీరు.

# పాతకక్షల నేపథ్యంలో యువకుడి దారుణహత్య..

**72 గంటల్లోనే కేసును ఛేదించిన పోలీసులు**

**వరంగల్ నేర విభాగం(ప్రజాదర్బార్ ప్రతినిధి)29 జూలై:** అజాం జాహి మిల్స్ కాలనీ ఠాణా పరిధిలో సంచలనం సృష్టించిన మాధ అనిల్(23) హత్యోదంతాన్ని పోలీసులు కేవలం 72 గంటల వ్యవధిలోనే ప్రతిభావంతంగా కొలిక్కితెచ్చి నలుగురు నిందితులను కటకటాల వెనక్కి నెట్టారు. గతేడాది వినాయక చవితి ఉత్సవాల్లో డీజే ఏర్పాటు విషయమై తలెత్తిన వివాదం, ఆపై డిసెంబర్ 31న జరిగిన పరస్పర దాడులు పాత కక్షలకు దారితీయగా, ప్రతీకారం రగులుతున్న ప్రధాన నిందితుడు గిరబోయిన మహేందర్ అలియాస్ మహి తన అనుచరులు కంప రాజేష్, భూక్య పూర్ణచందర్, కొండపాక కమలేష్‌లతో కలిసి బీరన్న బోనాల పండుగకు వచ్చిన అనిల్‌ను ఈ నెల 25న ఉర్సుగుట్ట సీపీఎం కార్యాలయం సమీపంలో పదునైన కత్తితో కిరాతకంగా మట్టుబెట్టాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేసిన ఇన్స్పెక్టర్ కర్రె స్వామి బృందం, మంగళవారం మధ్యాహ్నం ఆర్టీఏ జంక్షన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపిస్తూ పారిపోయేందుకు యత్నించిన హంతకులను వెంబడించి చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు.

అరెస్టయిన వారి నుంచి నేరానికి వాడిన మారణాయుధం, రెండు ద్విచక్ర వాహనాలు, రక్తపు మరకలున్న దుస్తులతో పాటు నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని న్యాయస్థానంలో హాజరుపరిచారు. నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ రౌడీయిజం, గ్యాంగ్ వార్స్‌కు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే నేరస్థులపై బీఎన్ఎస్ నిబంధనలతో పాటు అవసరమైతే పీడీ యాక్ట్ ప్రయోగించడానికి ఏమాత్రం వెనుకాడబోమని పోలీస్ కమిషనరేట్ వర్గాలు కఠినంగా హెచ్చరించాయి.

# నీటి సంరక్షణ గ్రామాభివృద్ధికి ప్రజలకు అవగాహన కల్పించిన అధికారులు



**సదాశివనగర్, ప్రజాదర్బార్ ప్రతినిధి జూలై 29:** కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం లోని తిమ్మాజివాడి గ్రామంలో బుధవారం సర్పంచ్ నంది పేట బావని సాయిలు అధ్యక్షతన ప్రత్యేక గ్రామసభ నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జలసిరి కార్యక్రమంపై గ్రామ ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించారు. గ్రామసభలో జలసిరి కార్యక్రమం లక్ష్యాలు, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, నీటి వనరుల సమర్థ వినియోగం, గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి చర్యల గురించి అధికారులు వివరించారు. జలసిరి కార్యక్రమం ద్వారా గ్రామాలకు దీర్ఘకాలికంగా కలిగే ప్రయోజనాలను వివరించి, ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్ కుమార్ ప్రత్యేక అధికారిగా పాల్గొని జలసిరి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నందిపేట భవాని--సాయిలు, ఉప సర్పంచ్ జింజర్ రవీందర్‌రావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీలేఖ, ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింలు, ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వర్షాకాలం నేపథ్యంలో రోడ్లు, డ్రైనేజీలు మరమ్మత్తులు చేయాలి



**కామారెడ్డి జిల్లా ప్రజా దర్బార్ ప్రతినిధి జూలై 29** కామారెడ్డి పట్టణంలోని పలు వార్డులలో నెలకొన్న సమస్యల గురించి మరియు రోడ్డు, డ్రైనేజీ మరమ్మత్తులు చేయించాలని, ఆషాడం బోనాల సందర్భంగా అమ్మ వారి గుడుల వద్ద మొరమ్ పోయించాలని ఇంచార్జి మున్సిపల్ కమిషనర్ డి ఈ కి బీజేపీ కౌన్సిలర్ లు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ కౌన్సిలర్ లు మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న సందర్భంగా రోడ్ల పై నడిచే పరిస్థితి లేదని, ఎక్కడికక్కడ గుంతలు ఉన్నాయని , అలాగే డ్రైనేజీ లు సరిగ్గా లేనందున రోడ్లపైకి డ్రైనేజీ నీరు వస్తున్నాయని ముఖ్యంగా శివారు ప్రాంతాల్లోనీ వార్డుల్లో విపరీతమైన సమస్య ఉందని అన్నారు. సాధ్యమైనంత తొందరగా పాచ్ వర్క్ లు పూర్తి చేసి అవసరం ఉన్న చోట మొరమ్ పోయించి పట్టణ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు విన్నవించినట్లు కోరారు. బోనాల పండగ సందర్భంగా అమ్మ వారి గుడి పరిసరాలలో బురద లేకుండా మొరం పోయాలని సూచించినట్టు తెలిపారు.

# భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి: ఎస్సై అనిల్ కుమార్




**పెంచికల్‌పేట్, జూలై 29,ప్రజాదర్బార్ :** జిల్లాలో రానున్న నాలుగు రోజుల పాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెంచికల్‌పేట్ ఎస్సై అనిల్ కుమార్ సూచించారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, వాగులు, వంకలు, చెరువులు, లో-లెవల్ వంతెనలను దాటేందుకు ప్రయత్నించవద్దని హెచ్చరించారు. వరద ప్రాంతాల్లో సెల్ఫీలు, రీల్స్ కోసం వెళ్లరాదని, చేపల వేటకు దూరంగా ఉండాలని, విద్యుత్ తీగలు, శిథిలావస్థలో ఉన్న ఇళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్-100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రజలంతా పోలీసు, రెవెన్యూ శాఖల సూచనలు పాటించి అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# పెద్దన్న మృత్యుంజయుడై రావాలి..



**నెక్కొండ(ప్రజాదర్బార్ ప్రతినిధి)29జూలై :** మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి గుండెపోటునుంచి త్వరితగతిన కోలుకుని, మృత్యుంజయుడిగా తిరిగి రావాలని ఆకాంక్షిస్తూ నెక్కొండ మండలం నాగారం మంజునాథ శివరామ క్షేత్రంలో తెరాస శ్రేణులు కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కరోనా విపత్కర కాలంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవ చేసిన ఆ నేతను కంటికిరెప్పలా కాపాడుకుంటామని అభిమానులు ఉద్ఘాటించారు. నాడి స్పందన సాధారణ స్థితికి చేరేవరకు పట్టువదలకుండా తొమ్మిదిసార్లు సీపీఆర్ చేసి ప్రాణాలు నిలిపిన రోహిణి ఆసుపత్రి వైద్యురాలు మమతారెడ్డికి హృదయపూర్వక అభినందనలు తెలుపుతూ, భూమ్మీద డాక్టర్లు దేవుళ్ళతో సమానమని కొనియాడారు. మరోవైపు సామాజిక మాధ్యమాలు, కొన్ని వార్తా ఛానళ్లు తమ రేటింగ్స్ కోసం వైద్యబృందం ధృవీకరించని మరణవార్తను ప్రసారం చేయడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాంటి కల్పిత కథనాలు కుటుంబ సభ్యులతో పాటు అనుచరులను ఎంతో మనోవేదనకు గురిచేశాయని ఆవేదన చెందారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గత పంచాయతీ పాలకవర్గ ప్రతినిధులు, గ్రామ కమిటీ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గురు పౌర్ణమి సందర్భంగా సీనియర్ రిటైర్డ్ ఉపాధ్యాయుడు గణపురం వేణుగోపాల్‌కు ఘన సన్మానం



**పెంచికల్‌పేట్, జూలై 29, ప్రజాదర్బార్ :**గురు పౌర్ణమి సందర్భంగా విద్యారంగానికి విశిష్ట సేవలు అందించిన సీనియర్ రిటైర్డ్ ఉపాధ్యాయుడు గణపురం వేణుగోపాల్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రమేష్ బాబు, జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు విజయనిర్మలతో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొని శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి వేణుగోపాల్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉపాధ్యాయ వృత్తి అత్యంత గొప్పదని, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అమూల్యమని పేర్కొన్నారు. గణపురం వేణుగోపాల్ తన సేవాకాలంలో ఎన్నో మంది విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లారని కొనియాడారు. సన్మానానికి స్పందించిన గణపురం వేణుగోపాల్ మాట్లాడుతూ, గురు పౌర్ణమి రోజున లభించిన ఈ గౌరవం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని, ఉపాధ్యాయునిగా చేసిన సేవలకు లభించిన గుర్తింపుగా భావిస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని గురువుల సేవలను స్మరించుకున్నారు.

# బండ్లగూడ జాగీర్‌లో అక్రమ నిర్మాణాల రాజ్యం.!

**- ఈ నిర్మాణాలకు మున్సిపల్ అధికారుల ఆశీస్సులు - ఫిర్యాదులు చేసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న యంత్రాంగం - సర్ పేరుతో చర్యలు సాగదీస్తున్న వైనం**




**గండిపేట్,జులై 29(ప్రజాదర్బార్)**రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బండ్లగూడ జాగీర్ లో అక్రమార్కులు రోజురోజుకూ కోకోల్లలుగా వెలుస్తున్నాయి.అధికారుల కనుసన్నల్లోనే నిబంధనలను బొందపెడుతూ ,అనుమతులు లేని అక్రమ నిర్మాణాలను పుట్టగొడుగుల్లా నిర్మిస్తున్నారు. చట్టం,నిబంధనలు తమకేమీ కావన్నట్లు బరితెగించి వ్యవహరిస్తుంటే పర్యవేక్షించాల్సిన అధికారులు మాత్రం కన్నుమూసి'మామూళ్ల'మత్తులో తూగుతున్నారనేసర్ పేరుతో చర్యలు సాగదీస్తున్నారని తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**అనుమతులు నిల్ – నిర్మాణాలు ఫుల్.!**

బండ్లగూడ జాగీర్ పరిధి దర్గా ఖలీజ్ ఖాన్ దారిలోఎలాంటి టౌన్ ప్లానింగ్ అనుమతులు లేకుండానే దర్జాగా బహుళ అంతస్తుల భవనాలు,అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి.కనీస ప్లాన్ అప్రూవల్స్, సెట్‌బ్యాక్‌లు లేకపోయినా నిర్మాణాలు శరవేగంగా సాగిపోతుండటం వెనుక మున్సిపల్ అధికారుల "పుష్కలమైన ఆశీస్సులు" ఉన్నాయనేది బహిరంగ ఆరోపణలు ఉన్నాయి.

క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి అక్రమ నిర్మాణాలను కూల్చివేయాల్సిన సిబ్బంది,ముడుపుల పర్వంలో మునిగితేలుతున్నారన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

**కందిరీగల చుట్టూ"కింది స్థాయి" సిబ్బంది"**

అక్రమ నిర్మాణాల వ్యవహారంలో ఉన్నతాధికారుల కంటే కింది స్థాయి సిబ్బందే అంతా వెనుకుండి చక్కబెడుతున్నారనే బలమైన ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.యాజమానుల దగ్గర నుండి ఓ రేట్లు మాట్లాడటం,వసూళు చేయడం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి కవర్ చేయడం అంతా ఈ కింది స్థాయి సిబ్బందే నిర్వహిస్తున్నారని విశ్వసనీయత సమాచారం.ఫీల్డ్ లెవల్‌లో ఉండే ఈ సిబ్బంది ఇచ్చే 'సపోర్ట్'తోనే అక్రమార్కులు భయం లేకుండా నిర్మాణాలు పూర్తి చేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

**ఫిర్యాదులు బుట్టదాఖలు'మామూళ్ల' గిఫ్టులు..?**

స్థానిక ప్రజలు,పర్యావరణ వేత్తలు అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యం.కనీసం క్షేత్రస్థాయి పరిశీలనకు కూడా రాని పరిస్థితి నెలకొంది. ఫిర్యాదుదారుల వినతులను చెత్తబుట్టలో పడేస్తూ,అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నారని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల ఈ ఉ




దాసీనత వెనుక భారీ ఎత్తున ముడుపులు చేతులు మారాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.కింది స్థాయి సిబ్బంది అక్రమార్కులతో కుమ్మక్కై ఫిర్యాదులను పక్కదోవ పట్టిస్తున్నారు.రోజు రోజుకూ బండ్లగూడ జాగీర్ అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారుతోందని విమర్శలు గుప్పిస్తున్నారు.

**ఉన్నతాధికారులు స్పందించేనా.?**

అధికారులు,కింది స్థాయి సిబ్బంది అండదండలతో ఆకాశాన్ని తాకుతున్న అక్రమ నిర్మాణాలపై విజిలెన్స్ విచారణ జరిపించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మున్సిపల్ సిబ్బందిపై తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని,అనుమతులు లేని నిర్మాణాలను వెంటనే కూల్చివేయాలని ప్రజలు కోరుతున్నారు.

## రాష్ట్రీయ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడిగా చిన్నబీర రవికుమార్



**సదాశివనగర్ ।ప్రజాదర్బార్ ప్రతినిధి ।జూలై 29**: రాష్ట్రీయ హిందూ పరిషత్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా సదాశివనగర్ మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన చిన్నబీర రవికుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మండల భూపాల్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. జూలై 29, 2026 నుండి ఈ నియామకం అమలులోకి వస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో హిందూ సమాజ ఐక్యత, సంస్థ బలోపేతం, సేవా కార్యక్రమాల విస్తరణకు కృషి చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు సూచించారు. ఈ సందర్భంగా చిన్నబీర రవికుమార్ తనపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ ఆశయాలకు అనుగుణంగా జిల్లా వ్యాప్తంగా సేవా, సామాజిక కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తూ సంస్థ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.




# జ్యోతి హాస్పిటల్ లో ఓపెన్ హార్ట్ సర్జరీ విజయవంతం

**మిర్యాలగూడ, జూన్ 29 ప్రజాదర్బార్:-**జ్యోతి హాస్పటల్ ఘనత.. ఆరోగ్యశ్రీ తో ఆర్ట్ సర్జరీ విజయవంతం. గుండె ఆపరేషన్ అంటేనే జనాలకు పరేషాన్...లక్షలతో కూడిన వ్యవహారం... అయినా ప్రాణాలు నిలుస్తాయో లేదో అని పెషెంట్ తోపాటు, మొత్తం కుటుంబం ఆందోళన తో బిక్కు బిక్కు మంటూ గుండెల్లో గుబులుతో ఎదురు చూసే పరిస్థితి.ఇలాంటి పరిస్థితి ని అదిగమించి..మిర్యాలగూడ వైద్యరంగ చరిత్రలో జ్యోతి హాస్పిటల్ మరో అరుదైన ఘట్టాన్ని నమోదు చేసింది. మూడు దశాబ్దాలుగా ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందిస్తూ విశ్వాసాన్ని సంపాదించిన ఈ ఆసుపత్రిలో తొలిసారిగా అత్యంత క్లిష్టమైన ఓపెన్ హార్ట్ బైపాస్ సర్జరీని విజయవంతంగా నిర్వహించారు.దీంతో ఇప్పటివరకు ఇలాంటి చికిత్స కోసం హైదరాబాద్, విజయవాడ వంటి మహానగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి నుంచి మిర్యాలగూడ, పరిసర ప్రాంతాల ప్రజలకు ఉపశమనం లభించింది.ఈసందర్భంగా జ్యోతి హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ సర్జన్ డాక్టర్ ముvvా రామారావు మాట్లాడుతూ ఇటీవల దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామానికి చెందిన 61 ఏళ్ల మహిళ తీవ్ర గుండెనొప్పితో ఆసుపత్రిలో చేరగా, వైద్య పరీక్షల్లో గుండెకు రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళాల్లో తీవ్రమైన బ్లాకులు ఉన్నట్లు మా డాక్టర్స్ గుర్తించార న్నారు. వెంటనే శస్త్రచికిత్స అవస రమని నిర్ణయించి వారి కుటుంబ సభ్యులకు అన్ని విధాలుగా తెలియజేసిన వైద్యులు ఈనెల 20న, కార్డియో థొరాసిక్ సర్జరీ (సీటీవీఎస్) విభాగం ఆధ్వర్యంలో ఓపెన్ హార్ట్ బైపాస్ సర్జరీ నిర్వహించామన్నారు . శస్త్రచికిత్స విజయ వంతం కావడంతో రోగి వేగంగా కోలుకుని ఐదో రోజే డిశ్చార్జ్ చేయడం మరొక అద్భుతం అని డాక్టర్స్ ను ప్రశంసలతో కొనియాడారు.ఈ ఖరీదైన చికిత్సను రోగి కి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పూర్తిగా ఉ చితంగా అందించడం మరో విశేషంగా నిలిచిందన్నారు.ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు కూడా అత్యాధునిక గుండె వైద్యం ను తమ జ్యోతి ఆసుపత్రి ద్వారా అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో ఈ సేవలను అందిస్తున్నట్లు వెల్లడించారు.ఈ శస్త్రచికిత్స కోసం అత్యాధునిక హార్ట్-లంగ్ మెషిన్, హీటర్-కూలర్ సిస్టమ్, మైక్రో కార్డియాక్ ఇన్‌స్ట్రుమెంట్స్ వినియోగించారు. దాదాపు 25 మందికి పైగా వైద్యులు, అనస్థీషియానిపుణులు, నర్సింగ్ సిబ్బంది, టెక్నీషియన్లు సమన్వయంతో పనిచేసి ఈ క్లిష్ట ఆపరేషన్‌ను విజయవంతం చేశారు.శస్త్రచికిత్సలో సీనియర్ కార్డియో థొరాసిక్ సర్జన్ డాక్టర్ రమేష్, కార్డియాలజిస్ట్ డాక్టర్ మనోజ్ కుమార్ రెడ్డి, కార్డియాక్ అనస్థీషియా, క్రిటికల్ కేర్ నిపుణులు డాక్టర్ లావణ్య కడిమి, డాక్టర్ కృష్ణ చక్ర,



మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ముvvా రామారావు, కో-ఫౌండర్ డాక్టర్ జీవన జ్యోతి, డాక్టర్ ముvvా శ్రీహర్షతో పాటు కార్డియాక్ స్టాఫ్, ఆరోగ్య మిత్రలు, సపోర్ట్ సిబ్బంది కీలక పాత్ర పోషించారన్నారు .మిర్యాలగూడతో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాకు అత్యాధునిక గుండె వైద్యసేవలను అందించాలన్న సంకల్పంతోనే ఈ సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు.ప్రజల విశ్వాసం, సహకారంతో భవిష్యత్తులో మరిన్ని సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను విస్తరించ నున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మిర్యాలగూడలో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు



**మిర్యాలగూడ, జూలై 29 ప్రజాదర్బార్:-** మిర్యాలగూడ నియోజకవర్గం వ్యాప్తంగా గురు పౌర్ణమి సందర్భంగా దేవాలయాలు భక్తులతో కిట కిట లాడాయి. పట్టణంలోని హనుమాన్‌పేట సాయిబాబ దేవాలయంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మా రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..గురువుల గొప్పతనాన్ని స్మరించుకుంటూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికత పెంపొందిం చుకొని ధర్మబద్ధమైన జీవనం సాగించాలని కోరారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభిచగా ఈ కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షులు మంచుకొండ వెంకటేశ్వర్లు- నాగరత్నం, అధ్యక్ష కార్యదర్శులు గౌరు దయాకర్, నీల పాపారావు, గంధం సైదులు, సాంబశివరావు, శ్రీనివాస్, కోటేశ్వరం ావు, పెండ్యాల పద్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడిపాటి నవీన్ కుమార్, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...

## షీ టీం ఆధ్వర్యంలో 'పోలీస్ అక్క' అవగాహన కార్యక్రమం

**నల్లగొండ జులై 29 (ప్రజాదర్బార్)** నల్లగొండ జిల్లాలో మహిళలు, బాలికల భద్రత, రక్షణే లక్ష్యంగా షీ టీం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'పోలీస్ అక్క' కార్యక్రమం లో భాగంగా బుధవారం నల్లగొండ పట్టణంలోని గౌతమి ఇంగ్లీష్ స్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నల్లగొండ అడిషనల్ ఎస్పీ రమేష్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడారు. మహిళలు మరియు బాలికల భద్రతకు తెలంగాణ పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.మహిళలపై వేధింపులు, ఈవ్ టీజింగ్, అసభ్య ప్రవర్తన, వెంటపడటం (స్టాకింగ్), సోషల్ మీడియా ద్వారా వేధింపులు, బ్లాక్‌మెయిల్, సైబర్ నేరాలు వంటి ఘటనల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ, అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకులు, ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరించారు. ఏవైనా అనుమానాస్పద సంఘటనలు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.అనంతరం షీ టీం అధికారులు మహిళల భద్రత కోసం అందుబాటులో ఉన్న సేవలు, అత్యవసర సహాయ నంబర్లు, భరోసా కేంద్రాల సేవలు, సైబర్ మోసాల నుంచి రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ మంజుల, భరోసా కేంద్రం ఎస్ఐ అమీన్, రూరల్ ఎస్ఐ శివకుమార్, షీ టీం ఎస్.ఐ గౌస్ అధికారులు, పోలీసు సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.




## ఫలించిన చొప్పదండి బిఆర్ఎస్ -రైతుల పోరాటం దిగివచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం

**- కాళేశ్వరం కూళేశ్వరం అన్న సన్నాసులకు ఇదిగో నీళ్లు.. - మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్**





**ప్రజాదర్బార్, కరీంనగర్** :గాయత్రి పంప్ హౌస్‌లో మీటర్లు ఆన్.బీఆర్ఎస్ నేతలతో కలిసి సందర్శించిన మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్.కుంకుమ పూలు చల్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా సుంకే రవిశంకర్ మాట్లాడుతూకాళేశ్వరం నీళ్లతోనే రైతులకు ఊరట అని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను తప్పుదోవ పట్టిస్తోంది"కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనికిరాదని, నీళ్లు రావని ప్రచారం చేసిన వారికే ఇప్పుడు అదే కాళేశ్వరం నీళ్ల సమాధానం చెబుతున్నాయని అన్నారు.వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులు వరి వేయొద్దని, నీటి పరిస్థితి అనుకూలంగా లేదని చెప్పారని, మరోవైపు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాత్రం ఎన్‌డీఎస్‌ఏ నివేదిక వచ్చిన తర్వాతే నీటి విడుదలపై నిర్ణయం తీసుకుంటామని చెప్పడం ప్రభుత్వంలోని అయోమయాన్ని బయటపెడుతోందని విమర్శించారు. ముఖ్యమంత్రి ఒక మాట, మంత్రులు మరో మాట మాట్లాడుతుంటే రైతులు ఎవరిని నమ్మాలని ప్రశ్నించారు.ఎన్‌డీఎస్‌ఏ నివేదికలో బ్యారేజీల భద్రత మాత్రమే తమ పరిధి అని, నీటి నిర్వహణ, సాగునీటి పంపిణీ రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతేనని స్పష్టంగా పేర్కొన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నివేదిక పేరుతో రైతులను తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు.కన్నెపల్లి పంపులను ముందుగానే ప్రారంభించి ఉంటే గాయత్రి పంప్‌హౌస్ ద్వారా నీటిని ఎత్తిపోసి మిడ్‌మానేరు, రంగనాయకసాగర్, అన్నపూర్ణ, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ వరకు నీటిని చేరవేసి చెరువులు నింపే అవకాశం ఉండేదని తెలిపారు. ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రైతుల నారుమడులు ఎండిపోయాయని, ఇప్పటికే జూలై చివరి దశకు చేరుకున్నా నాట్లు వేసే పరిస్థితి లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.గాయత్రి పంప్‌హౌస్ ద్వారా నీటి విడుదలను పూర్తి స్థాయిలో కొనసాగించి ప్రతి చెరువు, ప్రతి రిజర్వాయర్‌ను నింపాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను సుంకె రవిశంకర్ ప్రశంసించారు. గోదావరి జలాలను తెలంగాణ రైతాంగానికి అందించేందుకు కాళేశ్వరం వంటి మహత్తర ప్రాజెక్టును నిర్మించిన కేసీఆర్ దూరదృష్టి వల్లే నేడు రైతులకు ఈ నీరు అందుతోందని అన్నారు. కేసీఆర్‌పై గతంలో చేసిన విమర్శలు ఇప్పుడు అసత్యమని తేలిపోయాయని, తెలంగాణ రైతాంగం తరఫున ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఆశ్రమ విద్యార్థుల సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యం..!

**-నాణ్యమైన విద్య, పోషకాహారం,పరిశుభ్రతపై ఐటిడిఏ పివో మంద మకరందు ప్రత్యేక దృష్టి**

**జైనూర్, ప్రజాదర్బార్ న్యూస్, జూలై 29:** ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి,పోషకాహారం, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని ఐటిడిఏ ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి మంద మకరందు సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం ఆయన జైనూర్ మండలంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి విద్యా బోధన, వైద్య సేవలు,భోజన నాణ్యత,వసతి సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి భోజనం,మెనూ అమలు,విద్యా ప్రమాణాల పై వివరాలు తెలుసుకున్నారు.అనంతరం వంటశాలలో భోజనాన్ని స్వయంగా రుచి చూసి నాణ్యతను పరిశీలించడంతో పాటు కంప్యూటర్ ల్యాబ్‌లో విద్య వీక్ష యాప్ పనితీరును సమీక్షిం చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సమయపాలన పాటించ కపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ మెమో జారీ చేశారు. ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం,ప్రాథమిక అభ్యాస నైపుణ్యాలు వచ్చేలా బోధించాలని సూచించారు.వర్షాకాలంలో డెంగ్యూ,మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా వసతి గృహ పరిసరాలు, వంటశాల,స్టోర్‌రూమ్, తాగునీటి సౌకర్యాలు, మరుగుదొడ్లు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంలో డిడి అంబాజి, ఏటిడిఓలు,జిసిసి బివోలు, ఉపాధ్యాయులు, తదితరులున్నారు.

## బాలాజీనగర్ శివారులో జూదరుల పట్టివేత

**- నగదు, చరవాణులు స్వాధీనం**

**?వరంగల్ నేర విభాగం(ప్రజాదర్బార్ ప్రతినిధి) జూలై 29 :** ఏనుమాముల ఠాణా పరిధి బాలాజీనగర్ శివారులో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై బుధవారం టాస్క్‌ఫోర్స్ సిబ్బంది మెరుపు దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఇన్‌స్పెక్టర్ కె.శ్రీధర్, ఎస్సై టి.వీరస్వామి బృందం ఆపరేషన్ చేపట్టగా.. నిందితులు ఉంద్రతి మహేష్, అంబి సంపత్, దేవర గోపి, ఎస్కె సలీం పట్టుబడ్డారు. వీరంతా కాశీబుగ్గ వాసులుగా కూలీ, హమాలీ పనులు చేసుకుంటూ సులభంగా డబ్బు సంపా దించాలనే దురాశతో వ్యసనాలకు బానిసలవడం గమనార్హం. అరెస్ట్ అయిన వారి వద్ద నుంచి రూ.7,350 నగదు, రెండు స్మార్ట్ ఫోన్లు, మరో జత కీప్యాడ్ మొబైల్స్ తో పాటు పేకముక్కలను దర్యాప్తులో భాగంగా సీజ్ చేసినట్లు ఏసీపీ ఏ.మధుసూదన్ వెల్లడించారు. దాడుల్లో దొరికిన సొమ్మును తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం స్థానిక పోలీసులకు అప్పగించినట్లు ఉన్నతాధికారులు తెలిపారు.

## సినారె తెలుగు సాహిత్యానికి విశేషమైన కృషి చేశారు

**మిర్యాలగూడ, జూలై 29 ప్రజా దర్బార్:-** సినారె తన రచనల ద్వారా తెలుగు సాహిత్యానికి ఎనలేని కృషి చేశారని, విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు గుడిపాటి కోటయ్య యాదవ్ అన్నారు. మిర్యాలగూడ మండలం జప్తి వీరప్ప గూడెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రముఖ కవి జ్ఞానపీఠ అవార్డు గ్రహీత ఆచార్య నారాయణరెడ్డి 95వ జయంతి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. సినారె తన రచనల ద్వారా తెలుగు సాహిత్యానికి ఎనలేని కృషి చేశారని, యువకులకు యువ సాహితీవేత్తలకు వారు రాసిన ఆధునికాంధ్ర కవిత్వం సాంప్రదాయాలు ప్రయోగాలు అన్న సిద్ధాంత గ్రంథం నేటికీ ప్రామాణికంగా ఉండటమే వారి ప్రతిభకు నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎడవల్లి



దామోదర్ రెడ్డి, పి జగదీశ్వర్ రెడ్డి, ఒట్టె మాధవి, టి శ్రీనివాసరెడ్డి, జల్ రామ్, చంద్రకళ,రేణుక తదితరులు పాల్గొన్నారు.

# పని వాతావరణం కల్పించే బాధ్యత నాది, పనిచేసే బాధ్యత మీది విద్యుత్ అధికారుల సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



**మునుగోడు జులై 29 (ప్రజాదర్బార్)**ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువ పడే అవకాశం ఉందిలి వ్యవసాయం బోరు బావుల పైనే ఆధారపడాల్సి వస్తుంది నీటి సమస్య కరెంటు సమస్య రాబోతుంది కరెంటు జీవనంలో భాగమైంది. కరెంట్ కే మొదటి ప్రాధాన్యత పని వాతావరణం కల్పించే బాధ్యత నాది పనిచేసే బాధ్యత మీది బాధ్యతతో పనిచేసేటట్లయితే ఉండండి లేదంటే రాజీనామా చేసి వెళ్లిపోండి లో వోల్టేజి సమస్య పై ట్రాన్స్కో సిఎండి కృష్ణ భాస్కర్ కి ఫోన్ విద్యుత్ శాఖ సమీక్షలో కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ఎల్ నినో ప్రభావంతో వాతావరణం లో కీలకమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయని దీని ప్రభావంతో వర్షాలు తక్కువ పడే అవకాశం ఉన్న నేపథ్యంలో మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా కేవలం బోరుబావుల పైన వ్యవసాయం ఆధారపడి ఉందని ఆ బోరుబావులకు విద్యుత్ సక్రమంగా అందిస్తూ ఎటువంటి సమస్య లేకుండా చూడాలని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. మునుగోడు లోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న విద్యుత్ సమస్యలపై యాదాద్రి భువనగిరి జిల్లా నల్గొండ జిల్లా విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు..కరెంట్ అనేది జీవనంలో భాగమైందని కరెంటుకి మొదటి ప్రధానమంత్రి ఇవ్వాలన్నారు.. మునుగోడు నియోజకవర్గాన్ని విద్యుత్ లో రోల్ మోడల్ గా చేయడంలో భాగంగా మొదటగా మండల కేంద్రాలలో ఎటువంటి విద్యుత్ సమస్యలు లేకుండా చేసి, తర్వాత గ్రామాలలోని విద్యుత్ సమస్యల పరిష్కారం, అనంతరం వ్యవసాయ బావుల లైన్స్ ను విడతల వారీగా అభివృద్ధి చేసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు... మొదటగా అన్ని మండల కేంద్రాలలో గృహాలపై విద్యుత్ తీగలు లేకుండా లైన్స్ షిఫ్ట్ చేసి ఎటువంటి విద్యుత్ సమస్య లేకుండా అంచనాలు రూపొందించాలన్నారు.. పనిచేయాల్సిన బాధ్యత మీదని నిధులు తేవాల్సిన బాధ్యత నేను చూసుకుంటానన్నారు. ఇటీవల సిబ్బంది అధికారుల పని ఒత్తిడి, వేధింపుల వల్ల ఇబ్బంది పడుతూ ఆసుపత్రి పాలైన మునుగోడు మండల విద్యుత్ ఏఈ నరేందర్ ను ఫోన్లో పరామర్శించారు.. డిపార్ట్మెంట్లో ఏం జరుగుతుందో చూసుకోవాల్సిన బాధ్యత పై స్థాయిలో ఉన్న అధికారులపై ఉందని మందలించారు.. నరేందర్ కు ధైర్యం చెబుతూ వెంటనే విధులకు హాజరుకావాలని నేను నీకు భరోసాగా ఉంటానని హామీ ఇచ్చారు...లో వోల్టేజి సబ్ స్టేషన్ ల నిర్మాణం పై ట్రాన్స్కో సీఎం డి కృష్ణ భాస్కర్ కి ఫోన్ చేసి వర్షభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో బోరుబావుల పైన విపరీతమైన ఒత్తిడి ఉండడంతో మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా లో వోల్టేజి సమస్య అధికమవుతుందని అదేవిధంగా నిర్మించాల్సిన మంజూరైన సబ్ స్టేషన్లను త్వరితగతిన పూర్తి చేసే విధంగా సహకరించాలని ట్రాన్స్కో సీఎండీ కృష్ణ భాస్కర్ కి ఫోన్లో వివరించారు.. సీఎండీ కృష్ణ భాస్కర్ మునుగోడు నియోజకవర్గంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు... ఇప్పటివరకు నియోజకవర్గ వ్యాప్తంగా సబ్ స్టేషన్ల పనితీరుపై చర్చించారు... ఇప్పటివరకు మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా 31 సబ్స్టేషన్లు పనిచేస్తుండగా... కొత్తగా నిర్మించిన 6 సబ్స్టేషన్లు ఉపయోగం లోకి వచ్చాయి.. మరో 3 సబ్ స్టేషన్లు నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉండగా..ఇంకో 6 సబ్స్టేషన్లు మంజూరై టెండర్ ప్రాసెస్ లో ఉన్నాయి.. మరో 3 సబ్స్టేషన్లు మంజూరై భూమి కేటాయింపు స్టేజిలో ఉన్నాయి.. వివిధ దశలలో ఉన్న ఈ సబ్ స్టేషన్ లను త్వరితగతిన పూర్తి చేసి ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు...మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా భద్రతతో కూడిన నాణ్యమైన కరెంటు ని ఇచ్చే విధంగా కరెంట్ అభివృద్ధి పనులు చేయాలన్నారు... ఈ సమీక్ష సమావేశంలో యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్ ఈ. సురేష్, నల్గొండ కన్స్ట్రక్షన్ డిఈ నరసింహ, దేవరకొండ డిఈ బాల్య నాయక్, నల్గొండ డీఈ విద్యాసాగర్, చౌటుప్పల్ డిఇ మల్లికార్జున్, నాంపల్లి మునుగోడు చౌటుప్పల్ ఏడీఈలు, అన్ని మండలాల ఏఈ లతోపాటు నియోజకవర్గ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



## కుటియా బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



**అల్వాల్, జూలై 29 (ప్రజాదర్బార్)**: అల్వాల్ సర్కిల్ తుర్కపల్లి డివిజన్లోని కుటియా బాబా మందిరంలో బుధవారం మాజీ కార్పొరేటర్ రాజ్ జితేందర్ నాథ్ సందర్శించి బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం గురుపౌర్ణమి సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. లడ్డూ రెడ్డి, శ్రీశైలం యాదవ్, శ్రీధర్ రెడ్డి, వెంకటేష్, కొండల్, నవీన్ యాదవ్, భీంరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజన్స్ సర్వసభ్య సమావేశం.....

**మెదక్ జిల్లా ప్రతినిధి, జులై 29:( ప్రజా దర్బార్ )**తెలంగాణ స్టేట్ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ మెదక్ పట్టణ సర్వసభ్య మండలి సమావేశం ఈ నెల 31న శుక్రవారం ఉదయం 11 గంటలకు స్థానిక ప్రణామ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు సంఘం ప్రతినిధులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంఘం అధ్యక్షుడు శివ్వా కృష్ణమూర్తి అధ్యక్షతన సమావేశం జరగనుంది. సమావేశం అనంతరం మెదక్ పట్టణ కార్యనిర్వాహక కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల అధికారిగా టాస్కా జిల్లా బాధ్యులు సార శ్యాంసుందర్, పరిశీలకులుగా త్యార్ల సత్యనారాయణ వ్యవహరించనున్నారు. సంఘం జీవిత సభ్యత్వం కలిగిన సీనియర్ సిటిజన్లు తప్పనిసరిగా సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

# ఓటరు నమోదుపై రాజకీయ పార్టీలు బాధ్యత తీసుకోవాలి

**- ఇంకా ఐదు రోజులే గడువు,100 శాతం ఓటరు నమోదు లక్ష్యంగా చైతన్యం కల్పించాలి**

**- ఈఆర్వో సోలిపేట శ్రీనివాస్ రెడ్డి**

**గండిపేట్,జూలై 29(ప్రజాదర్బార్)**ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ముగియడానికి ఇంకా ఐదు రోజులే మిగిలి ఉన్నందున రాజకీయ పార్టీలు క్షేత్రస్థాయిలో చొరవ తీసుకుని అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు అయ్యేలా అవగాహన కల్పించాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కిస్మత్‌పూర్‌లోని రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో బుధవారం నాటికి 57.2 శాతం ఓటర్ల వివరాలు డిజిటలైజేషన్ పూర్తయ్యాయని తెలిపారు. ఇంకా చాలామంది ఓటర్లు తమ ఓటును స్వగ్రామంలో కొనసాగించాలా లేదా ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతంలో నమోదు చేసుకోవాలా అనే సందిగ్ధంలో ఉన్నారని,వారికి స్పష్టమైన అవగాహన కల్పించి ఏదో ఒకచోట తప్పనిసరిగా ఓటరుగా నమోదు అయ్యేలా రాజకీయ పార్టీలు



కృషి చేయాలని సూచించారు. ఓటర్లకు అందుబాటులో ఉండేలా పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణ చేపట్టామని తెలిపారు. హైదర్‌షాకోట్,బుద్వేల్,గంధంగూడ ప్రాంతాల్లోని కొన్ని పోలింగ్ కేంద్రాలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు మార్చినట్లు వెల్లడించారు. అలాగే శంషాబాద్‌లో రోడ్డు దాటి వెళ్లాల్సిన ఇబ్బందిని తొలగించేలా పోలింగ్ కేంద్రాలను స్థానికులకు అనువుగా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని మొత్తం 547 పోలింగ్ కేంద్రాల్లో 36 కేంద్రాలను సమీప పోలింగ్ కేంద్రాల్లో విలీనం చేయడంతో ఇకపై 511 పోలింగ్ కేంద్రాలు మాత్రమే అందుబాటులో ఉంటాయని సోలిపేట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

# విద్యార్థులే దేశ భవిష్యత్తు.. వారి విద్యకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత:పడమటి శ్రీధర్ రెడ్డి

**శివరాంపల్లి,జూలై 29(ప్రజాదర్బార్)**విద్యార్థులే దేశ భవిష్యత్తని,వారి విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమవంతు సహాయం అందించాలని రాజేంద్రనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పడమటి శ్రీధర్ రెడ్డి అన్నారు. బుధవారం శివరాంపల్లి దళిత బస్తీ వీకర్ సెక్షన్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హైదరాబాద్ మార్వాడీ యువ మంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో దాదాపు 200 మంది విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులు,నోట్‌బుక్స్‌ను శ్రీధర్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో అపారమైన ప్రతిభ దాగి ఉందని, వారికి సరైన ప్రోత్సాహం,అవసరమైన విద్యా సామగ్రి అందిస్తే భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహిస్తారని అన్నారు. పేద,మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఇటువంటి సహాయం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరం కాకుండా సమాజంలోని సేవాభావం కలిగిన సంస్థలు ముందుకు వచ్చి సహకరించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం చేపడుతున్న సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా



నిలుస్తాయని,ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగించాలని సూచించారు. హైదరాబాద్ మార్వాడీ యువ మంచ్ ప్రతినిధులు మాట్లాడుతూ..పేద మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలనే లక్ష్యంతో తమవంతు సహాయంగా స్కూల్ బ్యాగులు,నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీను నాయక్,నర్సింహాచారి, కిరణ్,మార్వాడీ యువ మంచ్ ప్రతినిధులు మహేందర్,ఇందిరా,గౌతం,దినేష్,మహేష్,కాంగ్రెస్ నాయకులు మాదూరి ప్రభాకర్ రెడ్డి,దాసరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నల్లగొండ జిల్లాలో ముమ్మరంగా ఎస్ఐఆర్ ప్రక్రియ - జిల్లా కలెక్టర్







**నల్లగొండ జులై 29 (ప్రజాదర్బార్)** జిల్లాలో 88.63 శాతం ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఐఏఎస్ అన్నారు. బుధవారం ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ పై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలో కొనసాగుతున్న ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ పై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో వంద శాతం ఎన్యూమరేషన్ ఫారాలు ఓటర్లకు అందజేసి ఇప్పటి ఎన్యూమరేషన్ ఫారాలను 88.63 శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు కలెక్టర్ వివరించారు. రెండు మూడు రోజుల్లో వందశాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియ సైతం చేపట్టడం జరుగుతుందన్నారు. అంతకుముందు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ డిజిటలైజేషన్ ప్రక్రియకు 4,5 రోజులు మాత్రమే గడువు మిగిలి ఉందని, వేగవంతంగా పూర్తి చేయాలని,అదే సమయం లో తప్పులు లేకుండా ఉండేందుకు ఈ.ఆర్.ఓ లు ర్యాండం గా తనిఖీలు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి దశరథ,ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

# జగిత్యాల జిల్లాలో భారీ వర్షాలతో పొంగిపొర్లుతున్న వాగులు -- నిలిచిపోయిన రాకపోకలు

**జగిత్యాల ప్రతినిధి జులై 29 (ప్రజా దర్బార్)** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో నిన్న రాత్రి నుంచి కురుస్తున్న ఎడతెరిపి లేని భారీ వర్షాల కారణంగా వాగులు పొంగిపొర్లుతున్నాయి. దీంతో పలు గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని యామాపూర్ -- పకీర్ కొండాపూర్ గ్రామాల మధ్య వరద ఉధృతి అధికంగా ఉండటంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. బ్రిడ్జి నిర్మాణ పనుల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక రహదారి వరద ప్రవాహానికి కొట్టుకుపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో గ్రామాల మధ్య ప్రయాణించే ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. వరద ప్రవాహం ఉధృతంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప వరద నీటిని దాటే ప్రయత్నం చేయవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. అలాగే



ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శాశ్వత బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేయడంతో పాటు తక్షణమే ప్రత్యామ్నాయ రహదారిని ఏర్పాటు చేసి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

# సర్ పై ఎమ్మార్వో పొలిటికల్ భేటీ

**చిట్యాల జులై 29 (ప్రజాదర్బార్)** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ 2026లో భాగంగా ఎమ్మార్వో విజయ్ కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో మాట్లాడుతూ సమావేశంలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ (రేషనలైజేషన్)ప్రక్రియలో భాగంగా చేపట్టవలసిన చర్యలపై వివరంగా చర్చించడం జరిగిందని,పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, ఓటర్ల జాబితాల క్రోడీకరణ, బదిలీలు, పేర్ల తొలగింపు/చేర్పు వంటి అంశాలపై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల అభిప్రాయాలను స్వీకరించామనీ అలాగే సర్ ప్రక్రియకు పూర్తి సహకారం అందిస్తామని అన్ని రాజకీయ



పార్టీల నాయకులు తెలియజేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబ సమేతంగా సాయినాధుడి సేవలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**మల్కాజిగిరి, జూలై 29,( ప్రజాదర్బార్)** : గురుపౌర్ణమి పర్వ దినాన్ని పురస్కరించుకొని బుధవారం మల్కాజిగిరి సాయి నగర్‌లోని శ్రీ సాయిబాబా దేవాలయాన్ని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ సాయి సమాజం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ప్రజలు అందరూ సుఖ సంతోషాలతో, ఆయు రారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. గురువు మార్గదర్శకత్వం సమాజ నిర్మాణానికి ఎంతో అవ శ్యమన్నారు.



భారతీయ సంస్కృతిలో గురువుకు అత్యున్న త స్థానం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేని శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యు లు మమతా రెడ్డి, కల్పన, మాజీ కార్పొరేటర్లు మేకల సునీత రాముయాదవ్, శిరీష జితేందర్ రెడ్డి, ఏకే మురుగేష్, ఆలయ కమిటీ సభ్యులు వీరేశం యాదవ్, మల్లేష్ గౌడ్, లింగారెడ్డి, అశోక్, బీఆర్ఎస్ నాయ కులు బద్దం పరుశురాం రెడ్డి, జేవీసీ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# సంత్ శ్రీ రవిదాస్ మహారాజ్ సేవలు చిరస్మరణీయం: క్యానం రాజ్యలక్ష్మి,మాజీ కార్పొరేటర్

**మల్కాజిగిరి, జూలై 29,(ప్రజాదర్బార్) :** సంత్ శ్రీ రవి దాస్ మహారాజ్ అందజేసిన సేవలు చిరస్మరణీయమని వినాయ క్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి అన్నారు. బుధవారం వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలోని సుమంగళి ఫంక్షన్ హాల్‌లో నిర్వ హించిన సంత్ శ్రీ రవిదాస్ మహారాజ్ 650వ జయంతి కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై, ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం క్యానం రాజ్యలక్ష్మి మాట్లాడుతూ, శ్రీ సంత్ రవిదాస్ మహారాజ్ సమాజానికి అందించిన సేవలను కొనియాడారు. ఆయన బోధనలు సమాజంలో సమానత్వం, సోదరభావానికి ప్రతీకగా నిలి చాయన్నారు. ప్రశాంత్ ఆధ్వర్యంలో



నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్ఐఆర్ ఇన్‌చార్జి వాసంశెట్టి శ్రీనివాస్, డివిజన్ నాయకులు ఓం ప్రకాష్, మంగేష్, మల్లేష్ యాదవ్, ఉడతా నవీన్, నర్సింగ్ రావు, మల్లేష్, సాయి సురేష్, శ్రీదేవి, సుమలత, సోమంద్, వెంకటేష్, రెడ్డి, రమేష్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు

# తెల్ల బెల్లం మాటున నల్లబెల్లం దందా..!!

**- మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు!!**

**- పగలు తెల్ల బెల్లం దిగుమతి రాత్రి నల్ల బెల్లం సరఫరా..!!**



**ప్రజాదర్బార్,మోతె,జులై29** మండల కేంద్రంలో అడ్డు అదుపులేకుండా తెల్ల బెల్లం మాటున నల్ల బెల్లం అక్రమ దందా చేస్తున్న వ్యాపారి .అబ్కారి పోలీసు అధికారులు కనుసందనలో ఇష్టా రీతిగా లారీలకొద్దీనల్ల బెల్లం దిగుమతి చేస్తున్న వ్యాపారి.పట్ట పగలే లారీల కొద్దీ బెల్లం బహటంగా వ్యాపారి ఇంట్లో దించుతుండగా గ్రామంలో కొందరు లారీ లోడు తొ ఉన్న బెల్లం ను దించడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. గతంలో రాత్రి వేళలో చుట్టు ప్రక్కల గ్రామాలకు చెందిన నాటు సారా వ్యాపారులకు నల్ల బెల్లం తరలిస్తుండగా పట్టుకున్న అబ్కారి శాఖ సిబ్బంది .పట్టుకున్న బెల్లం మాయం కావడంతొ బెల్లం పట్టుకున్న పోలీసు కానిస్టేబుల్ మధ్య వర్తిగా ఉన్న వ్యక్తి కి ముప్పై వేల రూపాయలు ముట్టజెప్పడం తొ చిలికి చిలికి గాలి వానగా మారిన తీరుకు కానిస్టేబుల్ జీవితం బలి మండలంలో సంబంధిత అధికారుల వైఖరి చాలా వింతగా కనిపిస్తోంది. చీటికీ మాటికీ సారా విక్రయదారులపైనే అధికారులు చర్యలు తీసుకుంటున్నారే తప్పా సారా తయారీకి ప్రధాన కారణమైన బెల్లం వ్యాపారులపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ముందుగా బెల్లం వ్యాపారులపై గట్టి నిఘా పెడితే మండలంలో



గుడుంబా తయారీని చాలా వరకు అరికట్టవచ్చని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గతంలో నల్ల బెల్లం రవాణాపై పోలీస్, ఎక్సైజ్ అధికారుల నిఘా ఉండేది. బెల్లాన్ని సారా తయారీకి వినియోగించడంతో గుట్టుచప్పుడు కాకుండా తెల్ల బెల్లం వ్యాపారం మాటున నల్ల బెల్లం వ్యాపారం సాగుతోంది. నల్ల బెల్లంతోపాటు తెల్ల బెల్లం, కూడా సరఫరా చేస్తూ. రాత్రి వేళలలో ఆయా గ్రామాలకు నల్ల బెల్లం విక్రయిస్తున్నారు అక్రమ బెల్లం దందా వ్యాపారులు నల్లబెల్లం కంటే తెల్ల బెల్లం, చక్కెర తక్కువ ధరకు లభించడం, ఆపై తెల్లబెల్లం, చక్కెర రవాణాకు ఎటువంటి ఇబ్బందులు లేకపోవడంతో తెల్ల బెల్లం విక్రయాలకు అనుమతులు తెచ్చుకొని గుట్టు చప్పుడు తెలియకుండా నల్ల బెల్లం విక్రయిస్తున్నారు. అటు సారా వ్యాపారులు, ఇటు బెల్లం వ్యాపారులకు నల్ల బెల్లం అక్రమ వ్యాపారాన్ని ధీమాగా చేసుకోవడానికి కలిసి వస్తున్నాయి. తెల్ల బెల్లం సరఫరా అనుమతులు. మోతె ఎక్సైజ్ ఎస్సై సురేందర్ వివరణ: మోతె మండల వ్యాప్తంగా ఎక్కడైనా నల్ల బెల్లం కొన్న అమ్మిన సరఫరా చేసిన వ్యక్తుల పైన చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# సదాశివనగర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

**- ప్రజాసేవే పోలీసుల ధ్యేయం.. ప్రతి ఫిర్యాదుకు సత్వర న్యాయం అందించాలి**

**ప్రజాదర్బార్ ప్రతినిధి ।సదాశివనగర్ ।జూలై 29:** కామారెడ్డి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ బుధవారం సదాశివనగర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రిసెప్షన్, రైటర్ రూమ్, వివిధ రికార్డులు, సీసీటీఎన్ఎస్ నిర్వహణ, ఇతర విభాగాలను పరిశీలించి సిబ్బందితో సమావేశమయ్యారు. అనంతరం స్టేషన్ పరిసరాలను సందర్శించి పరిశుభ్రత, నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పరిశుభ్రమైన పోలీస్ స్టేషన్ సమర్థవంతమైన పోలీసింగ్‌కు పునాదిగా నిలుస్తుందని అన్నారు. ప్రతి పోలీసు ఉద్యోగి ప్రజాసేవను లక్ష్యంగా పెట్టుకుని బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, ప్రతి ఫిర్యాదును సకాలంలో స్వీకరించి బాధితులకు సత్వర న్యాయం అందించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో నమోదయ్యే ప్రతి కేసు, ప్రతి పిటిషన్‌ను తప్పనిసరిగా సీసీటీఎన్ఎస్‌లో నమోదు చేసి ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశించారు. అలాగే జిల్లా కార్యాలయం నుంచి వచ్చే సూచనలను సిబ్బందికి సక్రమంగా




తెలియజేస్తూ అమలు చేయాలని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రౌడీషీటర్లు, అనుమానిత వ్యక్తుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని, గ్రామాల్లో వి.పి.ఓలు తరచూ పర్యటించి కీలక సమాచారాన్ని వెంటనే అధికారులకు చేరవేయాలని ఆదేశించారు. జూదం, ఆన్‌లైన్ గేమింగ్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండి క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని పోలీసు సిబ్బందికి సూచించారు. పోలీసు శాఖపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా ప్రతి ఉద్యోగి అంకితభావంతో పనిచేయాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ తనిఖీ కార్యక్రమంలో సదాశివనగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. సంతోష్ కుమార్, ఎస్ఐ ఎం. పుష్పరాజ్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# వరుద ముంపు ప్రాంతాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**చెన్నూర్, జులై 29(ప్రజాదర్బార్)**మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలోని పలు గ్రామాలలో పర్యటించిన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్. ప్రాణహిత, గోదావరి నదిలో ప్రవహిస్తున్న వరద నీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి అనంతరం అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. భారీ నుండి అతి భారీ వర్షాలు నమోదవుతాయి అన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. అన్ని శాఖల అధికారులు ఎల్లప్పుడూ ఎంతో అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. గత రాత్రి నుండి కురుస్తున్న భారీ వర్షాలకు మట్టి ఇండ్లు, పెంకుటిల్లు, రేకుల ఇండ్లలో నివసించే ప్రజలు ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వీలైతే వాటిని ఖాళీ చేసి పునరావాస కేంద్రాలకు, లేదా సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని కోరారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు స్థితిలావస్థలో నివసిస్తున్న ప్రజలు ఎంతో అప్రమత్తంగా ఉండాలని, కురుస్తున్న భారీ వర్షాలకు ఇండ్లు ఎప్పుడైనా కూలిపోయి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నందున పలు గ్రామాలలో పర్యటిస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా ప్రాణహిత, గోదావరి నదులు, కాలువలు, చెరువులలో వరద నీరు చేరుతున్నందున ప్రజలు ఎవరు కూడా చేపల వేటకు



వెళ్లకూడదని అలాగే నదిలో సరదాగా ఈతకు, స్నానాలకు కానీ వెళ్ళకూడదని సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరిక మేరకు అధికారులు ఇప్పటికే అప్రమత్తమై గ్రామాలలోని ప్రజలకు పలు సూచనలు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. గ్రామాలలోని ప్రజలందరూ ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఏమైనా సహాయ చర్యలు కావాల్సినట్లయితే వెంటనే సహాయ బృందాలు లేదా పోలీసులను ఆశ్రయించాలని కోరారు. అత్యవసర పరిస్థితులలో తప్ప గ్రామాలలోని ప్రజలు ఎవరు కూడా ఇంట్లో నుండి బయటకి వెళ్ళవద్దని ఇప్పటికే ఉన్నంత అధికారులు విజ్ఞప్తి చేశారు.

# కేజీబీవీలో అంతర్జాతీయ పులుల దినోత్సవ వేడుకలు...విజేతలకు బహుమతుల ప్రదానం..

**- గాయపడిన వారి ఇళ్ల వద్ద మొక్కలు నాటిన అటవీ అధికారులు**




**పెంచికలపేట్, జూలై 29, ప్రజాదర్బార్ :**అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా పెంచికలపేట్ అటవీ రేంజ్ ఆధ్వర్యంలో స్థానిక కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బుధవారం అటవీ శాఖ అధికారుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎం. అనిల్ కుమార్ మాట్లాడుతూ వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ముఖ్యంగా పులుల ఆవాస ప్రాంతాలను కాపాడుకో



వడంతో పాటు, విద్యార్థి దశ నుంచే అడవులు, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అదేవిధంగా గతంలో అడవి జంతువుల దాడుల్లో గాయపడిన వ్యక్తుల ఇళ్లను అటవీ శాఖ అధికారులు సందర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారి ఇళ్ల వద్ద మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో వారిని భాగస్వాములను చేశారు. జంతువుల వల్ల నష్టం జరిగినప్పటికీ ప్రకృతి సమతుల్యత కోసం అడవులు, చెట్లను కాపాడుకోవాల్సిన అవసరం ఉందనే సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా అందించినట్లు అనిల్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది, కేజీబీవీ ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# వడ్డేపల్లి కొత్తచెరువు తూమును మరమ్మత్తులు చేయాలి





**నిజాంసాగర్ (జుక్కల్) జూలై 29,ప్రజాదర్బార్:**నిజాంసాగర్ మండలంలోని వడ్డేపల్లి కొత్తచెరువు తూమును మరమ్మత్తులు చేయాలని రైతులు అధికారులను కోరుతున్నారు. తూమును మరమత్తులు చేయాలని రెవిన్యూ,ఇరిగేషన్ అధికారులకు గత నాలుగు సంవత్సరాల క్రితం కలుసుకొని విన్నవించిన ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కురిసిన భారీ వర్షాలకు చెరువు కట్ట తెగిపోయి పంట పొలాలు నీట మునిగి నష్టం వాటిల్లిందని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తూముతో పాటు అలుగును మరమ్మతులు చేయాలని రైతులు అధికారులను కోరుతున్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో పీఎం శ్రీ పథకం కింద చేపట్టిన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి జిల్లా ప్రతినిధి జూలై 29 (ప్రజాదర్బార్ )**విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు కల్పించాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పీఎం శ్రీ పథకం కింద చేపట్టిన నిర్మాణ పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం వనపర్తి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల (జెడ్పీ హెచ్ఎస్ గర్ల్స్)లో పీఎం శ్రీ పథకం కింద నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదుల, సైన్స్ ల్యాబ్ పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని, ప్రతి దశలో నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి జాప్యానికి తావివ్వకుండా పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని సూచించారు. పనులు పూర్తయ్యే వరకు ఇంజినీరింగ్



అధికారులు నిరంతరం పర్యవేక్షణ నిర్వహిస్తూ నాణ్యతతో కూడిన నిర్మాణాలను అందించాలని ఆదేశించారు. నిర్మాణాలకు అవసరమైన అన్ని చర్యలను వేగవంతం చేసి సైన్స్ ల్యాబ్, అదనపు తరగతి గదులను త్వరలోనే విద్యార్థుల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. జెడ్పి సీఈవో యాదయ్య, ఈ డబ్ల్యు ఐ డి సి ఇంజనీరింగ్ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డి అసెంబ్లీ లో ఎస్ఐఆర్ ప్రక్రియ 100 శాతం పూర్తి

**-జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అభినందనలు**



**ప్రజాదర్బార్ జిల్లా ప్రతినిధి కామారెడ్డి జూలై 29:**ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఎన్యూమరేషన్ ఫారమ్‌ల (జుఖీరా) ప్రక్రియను 100 శాతం విజయవంతంగా పూర్తి చేసినందుకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సంబంధిత అధికారులను, సిబ్బందిని అభినందించారు. నియోజకవర్గంలో మొత్తం 2,28,503 మంది ఓటర్లు ఉండగా, వారిలో 2,06,220 మంది (90.25 శాతం) ఈఎఫ్ఎస్ డిజిటైజేషన్ పూర్తి చేశారు. మిగిలిన 22,283 మంది (9.75 శాతం) ఓటర్లకు సంబంధించిన ఫారమ్‌లు అందుబాటులో లేకపోవడంతో "అన్‌కలెక్టెడ్



ఫార్మ్స్"గా నమోదు చేయడం ద్వారా మొత్తం 2,28,503 మంది ఓటర్లకు సంబంధించిన ప్రక్రియను 100 శాతం పూర్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, నిర్దేశిత గడువులో లక్ష్యాన్ని విజయవంతంగా పూర్తి చేయడం అభినందనీయమని అన్నారు. ఈ విజయానికి కృషి చేసిన ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, తహసీల్దార్లు, బీఎల్ఓలు, సూపర్వైజర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు మరియు సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో ఎన్నికల ప్రక్రియలో నాణ్యతను, పారదర్శకతను కొనసాగిస్తూ భవిష్యత్తులో కూడా సమర్థవంతంగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి వనపర్తిని పూరి గుడిసెలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దాలి : ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**పెద్దమందడి జూలై 29 (ప్రజాదర్బార్ )**నియోజకవర్గంలోని పేద ప్రజలందరికీ ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా పక్కా ఇల్లు పూర్తయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. వనపర్తి నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం పురోగతిపై జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ వనపర్తి నియోజకవర్గాన్ని పూర్తిగా గుడిసెలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. పేద ప్రజలందరికీ ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పక్కా ఇల్లు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరై కూడా నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ఆసక్తి చూపని లబ్ధిదారులను వెంటనే గుర్తించాలని అధికారులను ఆదేశించారు. అలాంటి వారి వివరాలను సేకరించి, నిజంగా ఇల్లు అవసరమైన అర్హులైన పేదలకు



ఆ ఇళ్లను మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, ఇప్పటికే గుర్తించిన 287 గుడిసెలతో పాటు నియోజకవర్గంలోని అన్ని గుడిసెలను పూర్తిస్థాయిలో గుర్తించి జాబితాను సిద్ధం చేయాలని, ఈ ప్రక్రియతో పాటు పెండింగ్ అంశాలన్నింటినీ వారం రోజుల్లోపు పూర్తి చేయాలని స్పష్టమైన గడువు విధించారు. అదేవిధంగా, ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులు పరిమితులకు లోబడే ఇంటి నిర్మాణం చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేసేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని, లబ్ధిదారులకు అవసరమైన సూచనలు అందించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ విటోబా, అసిస్టెంట్ ఇంజనీర్లు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా పురస్కారం అందుకున్న చేడ్వాయి బీట్ ఆఫీసర్

**పెంచికలపేట్, జూలై 29, ప్రజాదర్బార్ :** అటవీ సంరక్షణ, అభివృద్ధి, పచ్చదనం పెంపు కోసం విశేషంగా కృషి చేసిన పెంచికలపేట్ మండలం చేడ్వాయి బీట్ ఆఫీసర్ టీ. మనోహర్ రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు. అటవీ సంరక్షణలో నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ, మొక్కల పెంపకం, అడవుల పరిరక్షణ, ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడంలో టీ. మనోహర్ చేసిన సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఈ పురస్కారాన్ని ప్రదానం చేసింది. ఈ సందర్భంగా సహచర అటవీ



శాఖ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు టీ. మనోహర్‌ను అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా ఇదే సేవా స్ఫూర్తితో పనిచేసి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# భారీ వర్షాలు, మెరుపుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- జిల్లా యంత్రాంగం, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయి -- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**



**కామారెడ్డి జిల్లా ప్రజా దర్బార్ ప్రతినిధి జులై 29**జిల్లాలో రాబోయే రోజుల్లో భారీ వర్షాలు, ఈదురుగాలులు, మెరుపులు సంభవించే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణే అత్యంత ప్రాధాన్యమని పేర్కొంటూ ప్రతి ఒక్కరూ అధికార యంత్రాంగం జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.“వర్షాల సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ నదులు, వాగులు, చెరువులు, కాలువలు వంటి నీటి ప్రవాహ ప్రాంతాల్లోకి వెళ్లవద్దు. వరద నీటిని దాటే ప్రయత్నం చేయడం ప్రమాదకరం. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి తమ భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి” అని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.వర్షాల సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, తెగిపోయిన విద్యుత్ తీగల సమీపంలో ఉండరాదని, మెరుపులు పడే అవకాశం ఉన్న సమయంలో బహిరంగ ప్రదేశాల్లో గుంపులుగా నిలబడకుండా సురక్షిత భవనాల్లో ఆశ్రయం పొందాలని సూచించారు.అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లకుండా ఉండాలని, రహదారులు జారుడు స్వభావం కలిగి ఉండే అవకాశం ఉన్నందున ప్రయాణాల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. కలుషితమైన ఆహారం, తాగునీటిని ఉపయోగించకుండా ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉందని కలెక్టర్ తెలిపారు. జిల్లా అత్యవసర నియంత్రణ కేంద్రాన్ని (కంట్రోల్ రూమ్) 24 గంటలు పనిచేసేలా ఏర్పాటు చేశామని, అవసరమైన సహాయక చర్యలకు అన్ని శాఖలను సిద్ధంగా ఉంచినట్లు వెల్లడించారు.“ వరదలు, భారీ వర్షాల వల్ల ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఏర్పడినా వెంటనే స్పందించేందుకు ఎస్‌డీఆర్ఎఫ్ (రాణ=ఖీ) బృందాలను సిద్ధంగా ఉంచాం. ప్రజలు భయాందోళనలకు గురికాకుండా అధికారుల సూచనలను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలి” అని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు .ఆర్అండ్‌బీ శాఖ అధికారులు రహదారుల పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని, పోలీసు శాఖ ట్రాఫిక్ నియంత్రణతో పాటు ప్రజల భద్రతకు చర్యలు చేపట్టాలని, పంచాయతీరాజ్ అధికారులు గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. గొర్రెల కాపరులు, పశుపోషకులు తమ పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు తలెత్తిన వెంటనే గ్రామ, మండల అధికారులకు లేదా జిల్లా నియంత్రణ కేంద్రానికి సమాచారం అందించాలని కలెక్టర్ కోరారు.అత్యవసర సంప్రదింపు నంబర్లుజిల్లా నియంత్రణ కేంద్రం: 8468220069పోలీస్ కంట్రోల్ రూమ్: 100అగ్నిమాపక శాఖ: 101

# ఫార్మాసిటీ రైతులను ఇంకెంతకాలం మోసం చేస్తారు

**- ఎమ్మెల్యే వైఖరి మోసపూరితం**
**- బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సత్తు వెంకటరమణారెడ్డి మండిపాటు**



**రంగారెడ్డి ప్రతినిధి, జూలై 29 ( ప్రజా దర్బార్):** అబద్ధాలు, ఉత్తుత్తి సమావేశాలతో ఫార్మాసిటీ రైతులను ఇంకెంతకాలం మోసం చేస్తారని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి ప్రభుత్వ పనితీరు పైన మండిపడ్డారు. గత శాసనసభ ఎన్నికలకు ముందు ఫార్మాసిటీ రైతులకిచ్చిన హామీలను అమలు చేయకుండా స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి కాలయాపన చేస్తున్నారని ఆయన విమర్శించారు. జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీధర్ బాబుతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఇటీవల ఎమ్మెల్యే ఏర్పాటు చేసిన ఫార్మా రైతుల సమావేశానికి సంబంధిత రైతులను, ఫార్మా వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులను పిలవకుండా మరోసారి మోసం చేశారని ఆరోపించారు. తూతూమంత్రపు సమావేశాలతో రైతులకు ఒరిగిందేమీ లేదని, హామీల అమలుకు నిర్దుష్టమైన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఫార్మాసిటీని రద్దు చేసి రైతులకు తిరిగి భూములు ఇస్తామని చెప్పిన మాట నిలబెట్టుకోవాలి, రైతుల అంగీకారం లేకుండా ఆన్‌లైన్‌లో వారి పేర్లు తొలగించిన 2500 ఎకరాల భూములను వెంటనే రైతుల పేరిట నమోదు చేయాలి, మేడిపల్లి, నానక్ నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు కిలోమీటరు దూరం వరకు ఎలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేయకుండా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి, భూములు రైతులకు తిరిగి ఇవ్వకుండా మోసం చేస్తే రైతులు తిరగబడతారని ఆయన హెచ్చరించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అప్పటి ఎమ్మెల్యే మంచి రెడ్డి కిషన్ రెడ్డి ఫార్మా రైతులకు ఇప్పించిన ప్లాట్లను ప్రస్తుత ప్రభుత్వం 3 ఏండ్లు కావస్తున్నా రిజిస్ట్రేషన్ చేయకపోవడం సిగ్గుచేటని రమణారెడ్డి మండిపడ్డారు. రైతులు విసిగిపోయి ఆ ప్లాట్లను అడ్డికిపావుశేరుకు అమ్ముకునేలా పెద్ద నాయకుల కనుసన్నల్లో కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి కందుకూరు మండలంలోని ముచ్చర్ల, మీర్ ఖాన్ పేట, సార్లరావుల పల్లి, బేగరికంచ, అన్నో జిగూడ, పంజాగూడ రైతులకు పట్టుబట్టి ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయించారని, ఇక్కడి రైతులకు బిఆర్ఎస్ హయాంలో ఇచ్చిన ప్లాట్లను కూడా రిజిస్ట్రేషన్ చేయించలేకపోవడం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అసమర్థతకు నిదర్శనమని దుయ్యబట్టారు. ఇందిరమ్మ పేదలకు భూములిస్తే బిఆర్ఎస్ ప్రభుత్వం గుంజుకుంటుందని అప్పుడు గగ్గోలుపెట్టిన నేతలు ఇప్పుడు మొండిగౌరెల్లి, కొత్తపల్లి, కుర్మిద్ద, మర్లకుంట తండా, ముచ్చర్ల గ్రామాలలో పేద రైతుల నుండి ఎందుకు భూములు లాక్కుంటున్నారని ఆయన ప్రశ్నించారు.

# ఆపదలో అండగా సిఎం సహాయ నిధి

**-జైనూర్ మార్కెట్ కమిటి ఛైర్మన్**
**-లబ్ధిదారులకు చెక్కుల అందజేత**



**జైనూర్, ప్రజాదర్బార్ న్యూస్,జూలై 29:** ఆర్థికంగా వెనుకబడిన పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) పథకం నిజమైన వరంగా నిలుస్తోందని జైనూర్ వ్యవసాయ మార్కెట్ కమిటి ఛైర్మన్ కుడిమేత విశ్వనాథ్ రావు అన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వేడమ బొజ్జు పటేల్ సిఫార్సుతో మంజూరైన సిఎం సహాయ నిధి చెక్కులను బుధవారం మార్కెట్ కమిటి కార్యాలయంలో ఆయన బాధిత కుటుంబాలకు అందజేశారు.ఈ సందర్భంగా కెరమెరి మండల కేంద్రానికి చెందిన రాథోడ్ ప్రేందాస్ కు రూ.60 వేల చెక్కు,సిర్పూర్ (యు) మండలానికి చెందిన మడవి అనసూయ,కృష్ణ కుటుంబానికి రూ.32 వేల చెక్కు, గాదిగూడ మండలానికి చెందిన ఆత్రం మంజుల,మారుతి కుటుంబానికి రూ.27 వేల చెక్కును అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణాపాయ పరిస్థితుల్లో కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్సలు, శస్త్రచికిత్సలు చేయించుకున్న పేద కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ సహాయాన్ని పొందాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ రషిద్,సర్పంచ్లు సేద్మకి జానేరావు,మడవి లక్ష్మణ్, టేకం అంబారావు,కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ ముఖీద్,కార్యవర్గ సభ్యుడు పెందుర్ ప్రకాష్, మాజీ మండల కో-ఆప్షన్ సభ్యుడు అఫ్రోజ్, నాయకులు మెస్రం అంబాజీ రావు,కనక గంగారాం,హైదర్,షేక్ అబ్బు,అస్లాం,గోడం శ్రీను, తుమ్రం కోటేశ్,మజర్, తదితరులు పాల్గొన్నారు.

# పట్నపూర్లో ఘనంగా గురు పౌర్ణమి మహోత్సవాలు

**-పూలాజీ బాబా సమాధి మందిరాన్ని సందర్శించిన పంజాబ్,నాందేడ్ భక్తులు**
**-బాబా సేవలు చిరస్మరణీయమని ప్రశంస**




**జైనూర్,ప్రజాదర్బార్ న్యూస్, జూలై 29:** ల జైనూర్ మండలంలోని పట్నపూర్ గ్రామంలో శ్రీశ్రీశ్రీ పరమహంస సద్గురు పూలాజీ బాబా ధ్యాన కేంద్రంలో బుధవారం గురుపౌర్ణమి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా గ్రామంలో శ్రీ పూలాజీ బాబా పల్లకి సేవను వైభవంగా నిర్వహించి,అనంతరం జ్యోతి ప్రజ్వలన, ధ్యానారాధన,ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి బాబా సమాధి మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆశీస్సులు పొందారు.ఈ వేడుకలకు పంజాబ్ అమృత్‌సర్,నాందేడ్ ప్రాంతాలకు చెందిన ప్రముఖ భక్తులు మహేందర్ సింగ్,ఎక్బల్ సింగ్ తమ కుటుంబ సభ్యులతో కలిసి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారికి సంస్థాన్ అధ్యక్షుడు కేశవరావు,ఉపాధ్యక్షుడు వామన్ ఘన స్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు.ఈ సందర్భంగా మహేందర్ సింగ్,ఎక్బల్ సింగ్ మాట్లాడుతూ 2013లో శ్రీ పూలాజీ బాబా అమృత్‌సర్‌ను సందర్శించిన సందర్భం తమకు చిరస్మరణీయమని పేర్కొన్నారు. బాబా మూగజీవులతో సైతం ఆత్మీయంగా సంభాషించిన దృశ్యాలు చూసి ఆయన మహాయోగి అని గ్రహించామని తెలిపారు. పూలాజీ బాబా ఒకప్పుడు తమ గురుద్వారాను సందర్శించారని, నేడు పట్నపూర్లోని ఆయన సమాధి మందిరాన్ని దర్శించడం ద్వారా అపూర్వమైన ఆధ్యాత్మిక ప్రశాంతత లభించిందని అన్నారు. ఇక్కడి ప్రశాంత వాతావరణం,భక్తి సంప్రదాయాలు ఎంతో ఆకట్టుకున్నాయని కొనియాడారు. అలాగే పంజాబ్‌లోని అమృత్‌సర్ గురుద్వారాను సందర్శించి అక్కడి సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో సంస్థాన్ అధ్యక్షుడు కేశవరావు, ఏఎస్పీ రఘునాథ్, ఆసిఫాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి శ్యాం నాయక్, సిఐ రమేష్,స్థానిక సర్పంచ్ కాందరే లక్ష్మీ బాలాజీ, కార్యదర్శి శ్రీనివాస్, రంగారావు,సుభాష్, దాదారావు,పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# అనాథ విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

**- అనాథ చిన్నారులకు అండగా యూత్ ఫర్ సేవ -- ఐ.ఎస్.ఆర్.డీ - గ్రామాల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ - చిన్నారుల చదువుకు చేయూత - అనాథ విద్యార్థులకు స్కూల్ కిట్ల పంపిణీ - విద్యే భవిష్యత్తు.. విద్యార్థులకు అవసరమైన సామగ్రి అందజేత - అనాథ చిన్నారులకు అండగా యూత్ ఫర్ సేవ -- ఐఎస్ఆర్‌డీ - గ్రామీణ విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ**







**ప్రజాదర్బార్ ప్రతినిధి ।సదాశివనగర్ ।జూలై 29:** యూత్ ఫర్ సేవ సహకారంతో, ఇన్‌స్పైర్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ (ఐఎస్ఆర్‌డీ)సామాజిక సమరసత వేదిక, ఆధ్వర్యంలో సదాశివనగర్ మండలంలోని మర్కల్, ధర్మారావు పేట్ గ్రామంలకు చెందిన తల్లి--తండ్రి లేని బాలబాలికలకు బుధ వారం విద్యా సామగ్రిని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాలు, జ్యామెట్రీ బాక్స్‌లు, డ్రాయింగ్ బుక్స్ అందజేశారు. ఆర్థికంగా వెనుకబడిన, అనాథ చిన్నారులు ఎలాంటి ఆటంకాలు లేకుండా విద్యను కొనసాగించేందుకు అవసరమైన సహాయాన్ని అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా మర్కల్ సర్పంచ్ ప్రియాంక సుభాష్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు మంచి విద్యను అభ్యసించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని కోరారు. గ్రామ పాఠశాల విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించిన యూత్ ఫర్ సేవ, సామాజిక సమరసత వేదిక, ఐ.ఎస్.ఆర్.డి సంస్థలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ధర్మారావు పేట్ సర్పంచ్ షేక్ ఉమర్ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో సమాజం భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. సేవా సంస్థలు, దాతలు సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. “సమాజం మనకేమిచ్చిందనే దానికంటే, సమాజానికి మనం ఏమి చేయగలమన్న ఆలోచనతో ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి” అని అన్నారు విద్యార్థులు లక్ష్యం పెట్టుకొని దాని కోసం కష్టపడి సాధించాలన్నారు.మండల విద్యాధికారి యూసెఫ్ మాట్లాడుతూ అవసరం గుర్తించి ఇలాంటి కార్యక్రమాలు చేయడం వల్ల విద్యార్థులకు ఉపయోగం అన్నారు. కార్యక్రమంలో ధర్మారావు పేట్ సర్పంచ్ షేక్ ఉమర్, మండల విద్యాధికారి యూసెఫ్, మర్కల్ సర్పంచ్ ప్రియాంక సుభాష్ రెడ్డి, ఉపసర్పంచ్ గుర్రపు లింగం, యూత్ ఫర్ సేవ ప్రతినిధులు, సామాజిక సమరసత వేదిక సభ్యులు, ఇన్‌స్పైర్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ (ఐఎస్ఆర్‌డీ) ప్రతినిధులు సోలంకి రవళి, అమృత రాజేంధర్ , ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు దయానంద్, సౌమ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శి గోదావరి, గ్రామ పెద్దలు ఆంజనేయులు, పంచాయతీ పాలక వర్గ సభ్యులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పదోన్నతి ఒక గౌరవం ప్రజాసేవలో మరింత బాధ్యతగా సేవ చేయాలి

**- జిల్లా ఎస్పీ సునిత రెడ్డి**
**-హెడ్ కానిస్టేబుల్ హోదా చిహ్నాలు అలంకరించి అభినందనలు తెలిపిన ఎస్పీ**




**వనపర్తి జిల్లా ప్రతినిధి జూలై 29 (ప్రజాదర్బార్ )**వనపర్తి జిల్లా కేంద్రంలో ఎస్పీ కార్యాలయం నందు పోలీస్ శాఖలో పదోన్నతి అనేది కేవలం హోదా పెరగడమే కాదు. ప్రజల భద్రత, న్యాయం, సేవ పట్ల మరింత అంకితభావంతో ముందుకు సాగే బాధ్యతను స్వీకరించినట్లేనని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి అన్నారు. జిల్లా పోలీసు శాఖలో హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందిన వనపర్తి పట్టణ పోలీస్‌స్టేషన్ కు చెందిన కానిస్టేబుళ్ల రాజ గౌడ్, నాగేశ్వరరావు, పానుగల్ పోలీస్ స్టేషన్‌కు చెందిన లక్ష్మీ నర్సమ్మ, రాంగోపాల్ వర్మ, పెబ్బేరు పోలీస్ స్టేషన్‌కు చెందిన నాగరాజు, బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ సునిత రెడ్డి కి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ వారికి హెడ్ కానిస్టేబుల్ హోదా చిహ్నమైన బ్యాడ్జీలను అలంకరించి శుభాకాంక్షలు తెలిపారు. పదోన్నతి బాధ్యతలను మరింత పెంచుతుందని పేర్కొన్న ఎస్పీ, ప్రజలకు క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావంతో సేవలందించాలని సూచించారు.ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ... పోలీసు శాఖలో పదోన్నతి అనేది కేవలం హోదా మార్పు మాత్రమే కాదు సమాజం, శాఖ మరియు ప్రజలు మనపై ఉంచిన విశ్వాసానికి లభించిన గౌరవప్రదమైన గుర్తింపు. ప్రతి పదోన్నతి కొత్త బాధ్యతలను, మరింత జవాబుదారీతనాన్ని, ఉన్నతమైన సేవా ప్రమాణాలను గుర్తు చేస్తుంది. హోదా పెరిగిన కొద్దీ ప్రజల పట్ల మన బాధ్యత, విధి పట్ల నిబద్ధత, చట్ట పరిరక్షణలో మన పాత్ర కూడా మరింత విస్తృతమవుతుంది. ప్రజల ప్రాణాలు, ఆస్తులు, హక్కులను పరిరక్షించడం పోలీసు శాఖ యొక్క అత్యున్నత కర్తవ్యం. ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది చట్టాన్ని నిష్పక్షపాతంగా అమలు చేస్తూ, ప్రజలతో మర్యాదగా, మానవీయ దృక్పథంతో వ్యవహరించాలి. ప్రజల విశ్వాసం, వారి ఆశీర్వాదం, వారు ఇచ్చే గౌరవమే పోలీసు ఉద్యోగానికి నిజమైన పురస్కారం. పదోన్నతి పొందిన సిబ్బంది శాఖ ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ మరింత అంకితభావంతో పనిచేయాలి. నిజాయితీ, క్రమశిక్షణ, సమయపాలన, సేవా తత్వం, నైతిక విలువలను తమ విధి నిర్వహణలో ప్రతిబింబిస్తూ, ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, నాణ్యమైన సేవలు అందించాలని అన్నారు.

# గురువులకు ఘనంగా సన్మానం...

**-అయిజ పట్టణ కేంద్రంలో...**
**-బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్ర రెడ్డి మాట్లాడుతూ...**





**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి జులై 29 (ప్రజా దర్బార్):** జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణ కేంద్రంలో శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయం దగ్గర గురుపూజ కార్యక్రమంలో భాగంగా ప్రతి సంవత్సరం జరుగుతుంది తల్లిదండ్రుల తర్వాత గురువులకు మూడవ స్థానం వారు ఎంతోమంది విద్యార్థినీ విద్యార్థినీలకు విద్యను అభ్యసించి విద్యార్థు లను ఉన్నతమైన స్థానాలకు ఎదగడం చాలా గొప్ప వరం ఒక గురువు ఎందుకంటే ఈ సమా జంలో అందరినీ సమానంగా ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా విద్యను అందించేవారు గురువులు గురుపూజ సంద ర్భంగా ఈరోజు గురువులకు ఘనంగా సన్మానం చేయడం జరిగినది ఈ కార్యక్రమంలో బిజెపి అయిజ మండల అధ్యక్షులు గోపాలకృష్ణ,భగత్ రెడ్డి ఖుషి, లక్ష్మణ గౌడ్ విష్ణువర్ధన్రెడ్డి,వెంకటేష్ ,రాజు ,కే ఆర్ అశోక్, గోవర్ధన్ ,సూర్య వర్ధన్ రెడ్డి తదితరులు పాలు గొన్నారు.

# మృతుని సతీమణికి ఆర్థిక భరోసా

**వరంగల్ నేర విభాగం(ప్రజాదర్బార్ ప్రతినిధి)జూలై 29:** విధి నిర్వహణలో ఉంటూ ఆకస్మిక మరణం పొందిన హోంగార్డు బాధితులకు రాష్ట్ర రక్షణ శాఖ అండగా నిలిచింది. దుగ్గొండి స్టేషన్ పరిధిలో పనిచేస్తూ గతేడాది కన్నుమూసిన పి.శ్రీనివాస్ రెడ్డి భార్యకు బుధవారం వరంగల్ సీపీ ఎన్.శ్వేత ఐపీఎస్ తన కార్యాలయంలో ఐదు లక్షల రూపాయల నిధి చెక్కును ప్రదానం చేశారు. సమాజానికి విశేష సేవలు అందిస్తూ ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోయిన సిబ్బంది సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఈ సహాయం కల్పిస్తోంది. సదరు కార్యక్రమంలో ఏఆర్ అదనపు డీసీపీ, ఆర్ఐ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



Publisher,Printer,Owned by Gonguluri Venu Gopal Sharma, Printed at Prajadarbar Printer, H.No.2 10 27/1, Main Road, Uppal, Hyderbad 39, Published From H.No.2 10 27/1, Main Road, Uppal, Hyderabad 39
Medchal Malkajgiri District, Telangana State., RNINo. 52925/94, EDITOR :GONGULURI VENU GOPAL SHARMA, Ph & Fax :040 27201814, Cell: 9440391525, E mail :prajadarbar94@gmail.com